ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహః

ప్రఖర ప్రజ్ఞ

సజల శ్రద్ధ


**సంకల్పం - సంరక్షణ**

వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత

**శ్రీరామ శర్మ ఆచార్య**

శక్తి స్వరూపిణి

**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు

**డాక్టర్ ప్రణవ్ పండ్యా**

సంపాదక వర్గం

**డా॥ యం.రామకృష్ణ**

**డా॥ తుమ్మూరి**

**కందర్ప రామచంద్ర రావు**

**కె.బి.సోమయాజులు**

**జి.సత్యవాణి**

**అశ్విని సుబ్బారావు**

**సంపుటి 5 సంచిక 2**

**మే 2004**

**తారణ : వైశాఖం - జేష్ఠ**

**విడిప్రతి రూ॥ 8.00**

**సం॥ చందా రూ॥ 85**

**3సం॥ చందా రూ॥ 250**

**10 సం॥ చందా రూ॥ 750**


## శక్తి సాధన

అస్తిత్వం మొత్తం శక్తిలో ఇమిడి ఉంది. జడచేతనాలు అన్నీ శక్తికి వివిధ రూపాలే. నిద్రాణమైన దీని నిష్క్రియత కొన్ని చోట్ల కనిపిస్తుంది. జీవితంలోని వివిధ రూపాలు దీని వల్లనే వ్యక్తం అయినాయి. పశు పక్షులలో, వృక్ష వనస్పతులలో దీని చైతన్యమే ప్రవహిస్తోంది. గతి-ప్రగతి, వికాసం-విస్తరణ ఇలా అనేక రూపాలలో శక్తి కానవస్తుంది. వాస్తవానికి జీవితం, జగత్తు శక్తిమయములు. శక్తి లేనిదే ఇక్కడ ఏదీ లేదు.

శక్తిలీలలోని ఈ రహస్యం మానవ జీవితంలో ఎంతో లోతయినది. స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలు, అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశాలు- ఇవన్నీ శక్తి ప్రవాహాల వివిధ రూపాలు. మూలాధార, స్వాధిష్ఠాన, మణిపుర, అనాహత, విశుద్ధి, ఆజ్ఞా, సహస్రార చక్రాలలో మహాశక్తి తన రహస్యాలను నిక్షేపించింది. ఇక కుండలినీ మహాశక్తి మానవ జీవితానికి అధిష్ఠానం. జగన్మాత అయిన ఆదిశక్తి ఈ పరమ రూపంలో తనను తాను ప్రతిష్ఠించుకుని మానవ జీవితాన్ని సర్వశ్రేష్ఠం చేస్తోంది.

శక్తిలీలలోని ఈ రహస్యాన్ని తెలుసుకుని వ్యక్తి శక్తి సముద్రం సమీపంలో ఉండి కూడా దీనుడిగా, దుఃఖితుడిగా, దయనీయుడిగా మిగిలిపోతాడు. చుట్టూ నీళ్లు ఉన్నా దాహంతో విలవిలలాడే వ్యక్తి అతడు. ఈ రహస్యాన్ని తెలుసుకునే సాధన చేసిన వ్యక్తి ఆదిశక్తి సంతానంగా గౌరవం పొందుతాడు. అతడి కణకణంలో శక్తి సముద్రం ప్రవహిస్తూ ఉంటుంది. అతడి ధమనులలో, శరీరంలో ఎక్కడ ఏదీ అసాధ్యం కాదు.

అసాధ్యాన్ని సాధ్యం చేసే ఈ శక్తి సాధన మహావిద్య గాయత్రీ మహామంత్రంలోని 24 అక్షరాలలో నిక్షిప్తమై ఉంది. అనుభవం పొందిన వారు ఈ సత్యాన్ని తెలుసుకుంటారు. గాయత్రీ మహాశక్తి సాధనలో పూర్తిగా లీనమైన శక్తి సాధకులు శక్తి కేంద్రాలుగా శక్తి ప్రసార కేంద్రాలుగా రూపొందకుండా ఉండలేరు. జీవితంలో, జగత్తులో ఉన్న అనేక రహస్య శక్తులు అందడంతో వారి జీవితాలు కృతార్థములు అవుతాయి.

H H H

**అన్యాయం చేయడమే కాక - దానికి తల ఒగ్గడమూ పాపమే.**

# విషయ సూచిక

ముఖ చిత్రం : గాయత్రీ మాత


1. **సంపాదకీయం :**
   నీవు మనిషివేనా? 1
2. **విషయ సూచిక** 2
3. **వేదమంత్రం** 3
4. **ముఖచిత్ర కథనం - 1 :**
   గాయిత్రికి రెండు హస్తాలు - యోగం, తపస్సు 4
5. **ముఖచిత్ర కథనం - 2 :**
   గాయిత్రీ మంత్రసిద్ధి లక్షణాలు 6
6. **గురుదేవుల అమృతవాణి :**
   దేవ సంస్కృతికి మూలం గాయిత్రి 8
7. **బోధ కథ :**
   అనుభూతిలో ఉంది సత్యం 12
8. **వ్యక్తి నిర్మాణం :**
   లక్ష్య సాధనకు దీక్ష అనివార్యం 15
9. **మనం-మన ఆరోగ్యం :**
   జీవన సంగీతాన్ని ఆలాపిస్తుంది ఆరోగ్యం 17
10. **భాగవత బోధ :**
    ఋషభదేవుడు అటు, ధృతరాష్ట్రుడు ఇటు 19
11. **గురుదేవుల దివ్యజీవనం :**
    గురుదేవుల ఐదు స్థూల శరీరాలు 22
12. **ధారావాహికం: దివ్యజీవన దర్శనం - 5**
    అపురూపం ఆ మాతృత్వ అనుభూతి 28
13. **మాతాజీ దివ్య జీవనం : 7**
    దివ్య సాధనా స్థలి ఎంపిక 32
14. **యుగ గీత :**
    యజ్ఞాలకు శిరోమణి జ్ఞాన యజ్ఞం 36
15. **కృష్ణావతారం - 18 :**
    పాండవులతో మంతనాలు 38
16. **శతసూత్ర కార్యక్రమం : 61-68**
    యుగనిర్మాణంలో సాహితీ ప్రతిభ 41
17. **సాధన విజ్ఞానం :**
    పాత్రతను పెంచుకోండి - సిద్ధులను అందుకోండి 42
18. **వార్తలు :**
    సహజీవనానికి ప్రేరణశక్తి గాయత్రీ మంత్రం 45


## చందాదారులకు ముఖ్య గమనిక

పలువురు చందాదారులు మారిన తమ చిరునామాను కార్యాలయానికి పంపడం లేదు. అందువల్ల పత్రికలు పాత చిరునామాకే వెళ్ళి తిరిగివస్తున్నాయి. కనుక, ఆయా చందాదారులు వెంటనే క్రొత్త చిరునామాను కార్యాలయానికి పంపాలి. అది 15వ తారీకులోగా అందితే, తర్వాతి నెల పత్రికను ఆ చిరునామాకు పంపుతాము.

ఒక వేళ ఏ నెలలో అయినా పత్రిక అందకపోతే, ఆ విషయం 15వ తేదీలోగా మాకు తెలుపండి. ఆ నెల పత్రిక పంపుతాము.

**- పత్రికా విభాగం**

## మే, జూన్ నెలలలో పర్వదినాలు

**మే :**

4 బుద్ధ పూర్ణిమ.
13 హనుమజ్జయంతి.
29 గాయత్రీ జయంతి.
గంగా దశహర.
గురుదేవుల మహా ప్రయాణ దినం.

**జూన్ :**

2 శుక్ర మూఢమి ప్రారంభం.
3 సంత్ కబీరు జయంతి.
23 లోకమాన్య తిలక్ జయంతి.
28 తొలి ఏకాదశి.
చాతుర్మాస్య వ్రత పూర్తి

మనిషి మరో మనిషిని మోసం చేయగలుగుతాడు. కానీ సృష్టికర్మ నియమావళిని మోసం చేయలేడు.

# వేద మంత్రం

**అథేన్వా చరతి మాయయైష వాచం శుశ్రువాం అఫలమపుష్పామ్ ।**

- ఋగ్వేదం 10/71/5

**భావార్థం** : గారడీవాని ఆవు పాలు ఇవ్వనట్లే సదాచరణ లేని విద్యావంతుడు ఫలితాన్ని పొందలేడు.

**సందేశం** : మనకు మనుష్య జీవితం వంటి అమూల్య అవకాశం లభిస్తే దానిని సద్వినియోగం చేసుకుందామని తోచకపోవటం, దానిని పిల్లచేష్టలతోనే వృధా చేసుకోవటం - ఎంత ఆశ్చర్యకరమైన విషయం ? వృధా చేసుకోవటమే కాక దురాచారాలతో వృధా చేసుకుని, వచ్చే జన్మకు పాపం మూట కట్టుకుని, నరకానికి ఏర్పాటు చేసుకుని, వీడ్కోలు పలుకుతున్నారు. మనకంటే పశువులు నయం. ఎలా వస్తున్నాయో అలానే వెళుతున్నాయి. ఇదేనా మనుష్యుని తెలివి? ఇంత జ్ఞానం, విజ్ఞానం చదువు మొదలైనవన్నీ పొందిన తర్వాత అతడు తన వివేకాన్ని తగు విధంగా ఉపయోగించుకోలేడా?

ప్రాపంచిక సాఫల్యం ఆధారంగా మనం ఎంత జ్ఞానులమో, చతురులమో తెలివిగలవారమో చెప్పవచ్చు. మనం జీవిత మూల ఉద్దేశ్యం తెలుసుకొని మన స్వరూపం, కర్తవ్యం తెలుసుకొని, వాటి గురించి గంభీరంగా ఆలోచించుట అవసరం కదా? మనం ఏమిటి, ఎవరు అని మనం ఆలోచించాలి. మన అస్థిత్వంయొక్క సార్థకతను ఏ విధంగా సిద్ధించుకోగలరు? ఈ ఆత్మబోధ లేకపోతే మనుష్య శరీరం కలిగిఉన్నా నరపశు, నరపిశాచాల వలె నికృష్ట జీవితం గడపవలసి వస్తుంది.

వివేకవంతుడైన ప్రతి వ్యక్తి తన వర్తమాన స్థితిని గురించి విమర్శించుకోవాలి. జీవితాన్ని పతనం నుండి రక్షించుకుని సృష్టికర్త లక్ష్య పూర్తికి వినియోగించుకొనేందుకై సాహసాన్ని కూడగట్టుకోవాలి. ఇటువంటి స్ఫురణ అంతఃకరణలో మేల్కొంటే అంతరాత్మలో ఈశ్వరుని ప్రకాశం ప్రవేశించిందని భగవంతుని అనుగ్రహం కలిగిందని తెలుసుకోవాలి.

ఎక్కువ మంది తమ ఆచరణను సరి చేసుకోవటానికి తయారు కారు. దురాచారాలను వదలి సదాచారాలను ఆచరించేందుకు సిద్ధం కారు. పైగా భగవంతుడు తమ కోర్కెలన్నీ తక్షణమే నెరవేర్చాలని ఆశిస్తారు. పూజ, అర్చన, కీర్తన, కర్మకాండ ఈ భావనతోనే చేస్తారు. భగవంతుడిని ప్రశంసించి, ముక్కు పట్టుకుని, లంచం ఇచ్చి అతడిని ప్రసన్నం చేసుకుని తమ పబ్బం గడుపుకోవచ్చని వారు అనుకుంటారు. పూజ ఉపాసనల ఉద్దేశ్యం ఈశ్వరీయ గుణాలను తమ స్మృతిలో బలంగా నిలుపుకోవటం, తమ మనస్సులో అధికారిక నిర్మలత్వం, వివేకం, పవిత్రతలను ఉత్పన్నం చేసుకోవటం.

తమ స్థితి ననుసరించి ప్రతి వ్యక్తి విశ్వమానవుని, జనతా జనార్ధనుని, భావనాత్మక స్థితిని పెంచుటలో ఎంతో కొంత ఇవ్వగలడు. ఈ ప్రయోజనం కోసం సమయం, శ్రమ, బుద్ధి, ధనం మొదలైనవి ఎంత ఇవ్వగలిగితే మనం భగవంతుని ఇచ్ఛాపూర్తికి అంతగా సాహసం చేశామని అనుకోవచ్చు. ఇందుకోసం ఆలోచనలు, మనోభూమి, గుణకర్మలు, స్వభావంలో, కార్యకలాపాలలో అధికాధిక పవిత్రత, ఉదారత, ఉత్కృష్టత, ఆదర్శవాదములను పెంచుకోవాలి. దానితో పాచు మన ప్రతిభ, సామర్థ్యములను లోకకళ్యాణము కొరకు వీలైనంత ఎక్కువగా సమర్పించుకొనుటకు ఉద్యుక్తులము కావలెను.

K K K

**అవకాశం కోసం ఎదురు చూస్తూ కూర్చోవద్దు. నేటి అవకాశమే ఉత్తమోత్తమం.**

# ముఖచిత్ర కథనం

## జ్ఞానయజ్ఞపు ఎర్రకాగడా

జన మానసాన్ని భావనాత్మకంగా నవ నిర్మాణం చేయడం కోసం భావ విప్లవం జరుగుతోంది. జ్ఞాన యజ్ఞం లోపల జ్వలిస్తున్న ఎర్ర కాగడా అదే. దాని వెలుగులో దేశం, సమాజం ఉన్నతి పొందడం నిశ్చయం. స్వతంత్రమైన ఆలోచన లోపించడంతో మనం మూఢత్వం, ఛాందసవాదాల ఊబిలో దిగబడిపోయాం. మానసిక దాస్యం ప్రతి రంగంలో మనల్ని దీనులుగా, హీనులుగా, నిరాశాపరులుగా, నిస్సహాయులుగా తయారు చేసింది. ఈ స్థితి మారనిదే ప్రజా శ్రేయస్సును సాధించలేము. మానసికమైన మూఢత్వంలో మునిగి ఉన్న సమాజానికి ప్రగతి ద్వారాలన్నీ మూసుకుపోతాయి. ప్రగతి ఆలోచనతో ప్రారంభం అవుతుంది. వివేకవంతుడు ప్రయోజనం పొందుతాడు. సమృద్ధి సాహసవంతుని వెన్నాడుతుంది. ఈ వివేక, సాహసాల సత్ ప్రవృత్తులను జన మానసంలో నాటడం, పెంచి పోషించడం మన భావ విప్లవం ముందున్న ఒకే ఒక లక్ష్యం. జ్ఞాన యజ్ఞపు ఎర్రకాగడా ఈ లక్ష్యం కోసమే ప్రజ్వలితం చేయబడింది.

పరమపూజ గురుదేవులు ఇలా వ్రాశారు-

"మా వర్చస్సు అనే నూనెను ధారపోసి మేము నవ నిర్మాణపు ఎర్ర కాగడాను వెలిగించాము. దాన్ని వెలిగించి ఉంచడానికై మా వలెనే తమ అస్తిత్వపు సార తత్వాన్ని ధారపోయడం ఇక పరిజనుల బాధ్యత, శ్రేష్ఠత్వ దిశలో పురోగమించే ప్రవృత్తి మన పరిజనులలో తగ్గదనీ, పెరుగుతుందనీ ఆశిస్తూ పరిజనులను ఈ కర్తవ్యాన్నీ, బాధ్యతనూ అప్పగించి మేము వీడ్కోలు తీసుకుంటున్నాము.

గాయత్రీ తపోభూమిలోని యుగనిర్మాణ యోజన కేంద్రం మేము వెలిగించిన కాగడాను భవిష్యత్తులో మరింత సముజ్వలంగా వెలిగించే సామర్థ్యం కలిగి ఉంటుంది. ఈ యొక్క మా వారసుల యొక్క భావభరితమైన పురుషార్థం అనే ప్రచండ బలం ఉన్నది. ఈ బలం ఆ దైవ కార్యాన్ని తగ్గనివ్వదు. తరగనివ్వదు. ఈ మహోద్యమం వేగం పుంజుకుంటుంది. విశ్వమానవుని భవిష్యత్తును మహోజ్వలం చేసే చరిత్రాత్మక పాత్రను నిర్వహిస్తుంది.

సమర్థవంతంగా గురు దీక్ష ఇవ్వగలిగే యోగ్యుడైన అనుచరుడిని మేము వదలి వెళ్లలేకపోతున్నాము. అసమర్థుడైన వ్యక్తి ఈ మహత్తర బాధ్యతను తన భుజాలపై వేసుకుంటే అతడి నడుము విరిగిపోతుంది. అతడిని ఆశ్రయించిన వ్యక్తి మునిగిపోతాడు. కనుక భవిష్యత్తులో గాయత్రీ మంత్ర దీక్ష తీసుకునే ఆవశ్యకత ఏర్పడినపుడు ఎర్రకాగడా చిహ్నాన్నే గురువుగా స్వీకరించాలి. పై సంస్కార సంకల్పాన్ని ఎవరైనా చేయించగలుగుతారు. అయితే అలా చేయించే వ్యక్తి తాను గురువు కాజాలడు. సిక్కులు గురు గ్రంథ సాహెబ్‌ను గురువుగా స్వీకరించారు. రాష్ట్రీయ స్వయంసేవక సంఘం ధ్వజాన్ని గురువుగా స్వీకరించింది. అలాగే గాయత్రీ పరివార్ యుగనిర్మాణ ఉద్యమంలో ఎర్రకాగడా ప్రతీకకు గురువుగా గుర్తింపు ఇవ్వబడుతుంది. జ్ఞాన విప్లవపు ఎర్రకాగడా యుగశక్తికి ప్రతీకగా రూపొందింది. ఈ ప్రతీక గురించీ దీనితో ముడిపడి ఉన్న దర్శనం గురించీ అందరికీ తెలియాలి.

ఈ ఎర్రకాగడాలో-

జనసమూహం : మంచి కోరిక, సదాలోచన కలిగిన అన్ని వర్గాల స్త్రీ పురుషులు.

చేయి : సమూహం యొక్క సంఘటిత శక్తి.

కాగడా : నవ సృజనకు సంకల్పం.

**కర్మయోగిలో కుటిలత్వం, నీచత్వం, పిసినారితనం, స్వార్థం ఉండకూడదు.**

అగ్ని జ్వాల : నవ సృజన కోసం దివ్య శక్తి అనుదానం.
ప్రభా మండలం : ఈశ్వర చేతన యొక్క నిరంతరం సంరక్షణం.

"జ్ఞాన యజ్ఞం యొక్క ఎర్రకాగడాలో నా ప్రియజనులలో ప్రతిఒక్కరూ శ్రద్ధ అనే నూనెను ధారపోస్తూనే ఉండాలి. ఎట్టి పరిస్థితులలోనూ దీన్ని ఆరిపోనివ్వకూడదు. ఈ నిర్దేశాన్ని తిరస్కరించడం పిసినారితనం అవుతుంది. ఆ పిసినారితనం ఆ పిసినారితనం ఆత్మధిక్కారానికీ, లోకనిందకూ దారితీసి అనుమానపు అగ్నిని రగిలిస్తుంది.

''ఈ రోజుల్లో సృష్టికర్త యొక్క అదమ్యమూ, ప్రచండమూ అయిన అభిలాష ఒకేఒకటి కుళ్లిపోయిన ఈ ప్రపంచాన్ని మార్చడానికై కాయకల్ప చికిత్స వంటి కొత్త ప్రక్రియ అమలు జరగాలన్నది. ఇదే 21వ శతాబ్దం - ఉజ్వల భవిష్యత్తు. ఇదే మనిషిలో దేవత్వం ఉదయించడం. ఇదే ప్రతిభా పరిష్కార మహోద్యమం. దీనినే జనం భావ విప్లవపు ఎర్రకాగడా ప్రజలనం అని కూడా పిలుస్తున్నారు. ఈ దైవ అభిలాషను పూర్తి చేయడంలో ఎవరు ఎంతగా సహాయకులు అయితే వారు అంత సమగ్రంగా కృతకృత్యులు అయిన అనుభూతి పొందుతారు.''

## మన సంకల్పం

లక్ష్యం విశాలమైనది. విస్తృతమైనది. జన మానసాన్ని సంస్కరించడానికై వెలిగించబడిన జ్ఞాన యజ్ఞం, భావ విప్లవం, ఎర్రకాగడా మిణుకు మిణుకుమంటూ ఉంటే పని జరగదు. ఆ ఎర్ర కాగడా వెలుగును తీవ్రతరం చేయడానికై నూనె ధారపోస్తూ ఉండడం అత్యవసరం. పరమ పూజ్య గురుదేవుల సంతానంలోని ప్రతి ఒక్కరి త్యాగ సారమే ఆ నూనె. మనిషిలో దేవత్వం ఉదయించడం అనేది ప్రపంచంలో పండే పంటలన్నింటినీ మించిన పంట. నిష్ఠ కలిగిన కృషీవలుని వలె ఎండకూ వానకూ వెరవకుండా మనం ఈ సేద్యానికి అంకితం కావాలి. భువిపై దివి అవతరణ నందనవనాన్ని నిర్మించడంలో సమానం.

పరమ పూజ్య గురుదేవుల ఆదర్శాల రక్షణ బాధ్యత, యుగ నిర్మాణ యోజనను విశ్వవ్యాప్తంగా ప్రచారం చేసే ప్రసారం చేసే బాధ్యత మనకు అప్పగించబడింది. వ్యక్తిగతమైన కోర్కెలను విడనాడి ఒకే శక్తిగా ఒకే మనస్సుగా రూపొంది ఈ బాధ్యతను నెరవేర్చుతామని, ఈ పనిని పూర్తి చేస్తామని గాయత్రీ తపోభూమికీ, శాంతికుంజ్‌కు చెందిన కార్యకర్తలం మనమంతా ప్రతిజ్ఞ చేస్తున్నాం. పరమ పూజ్య గురుదేవులు నవ జాగరణ అనే కాగడాను మన చేతుల్లో పెట్టారు. మన శరీరాలలో ఒక్క రక్తపు బిందువు మిగిలి ఉన్నంత వరకు మనం ఆ కాగడాను ఆరిపోనివ్వము - మన జీవితమంతా ఆ కృషిలో కృశించి నశించిపోయినా, దగ్ధమైపోయినా.

H H H

## యాచకునికి పునర్జన్మ

టాల్‌స్టాయ్ వద్దకు ఒక యువకుడు వచ్చి, ఒక రూపాయో, అర్థో ఈయమని యాచించాడు. టాల్‌స్టాయ్ మండిపడి "నీ దగ్గర కోట్ల ఆస్తి పెట్టుకొని నన్ను ఒక రూపాయ అడుక్కోవటానికి సిగ్గులేదూ? నీ రెండు కాళ్లు, చేతులు, కళ్లు, ఇలా మొత్తం అవయువాల ధర కట్టి చూడు. ఇంత విలువైన శరీరాన్ని ఉపయోగించుకొని కనీసం నీ దరిద్రాన్నైనా నీవు నిర్మూలించుకోలేనపుడు బ్రతుకెందుకు?'' అని నిలదీసి ప్రశ్నించాడు. వాస్తవాన్ని కళ్లకు కట్టినట్లు చూపించిన టాల్‌స్టాయికి యాచకుడు ప్రణమిల్లి తనను తాను తెలిసికొని బ్రతుకును చక్కబరచుకొన్నాడు. ఇదేదో చిన్న విషయమని భావించకండి. వ్యక్తి విలువను వ్యక్తికి ఎరుకపరచటం పునర్జన్మను ప్రసాదించటమంత ఉత్కృష్టమైనది.

- ప్రజ్ఞాపురాణం నుండి

**వ్యక్తి ఆలోచనలకూ, నమ్మకాలకూ ప్రతీక మాత్రమే.**

# దేవసంస్కృతి విశ్వవిద్యాలయం

# విలువలతో కూడిన విద్యకు మహిమాలయం

సభ్యతా సంక్షోభం నేడు ప్రపంచమంతటినీ కలవరపెడుతోంది. మనిషి నైతికంగా పతనం అవుతున్నాడు. ఆ దురదృష్టకర పరిస్థితి జాతిలో, ప్రపంచంలో భావ మథనాన్ని కలిగిస్తోంది. ఈ దుస్థితిని తొలగించడం ఎలా అని ఆలోచనాపరులు అన్వేషిస్తున్నారు. నేడు వ్యక్తి జీవితంలో భౌతికమైన సుఖ సమృద్ధులు, సౌకర్యాల పేరిట ఎన్నెన్నో కనిపిస్తున్నాయి. మనిషిలో జ్ఞాన కౌశల్యానికి కొదువ లేదు. అయితే నైతిక విలువలు పూర్తిగా దిగజారిపోయి మనిషి ఆ రంగంలో దివాలా అయిపోతున్నాడు. సమాజాన్ని కలిపి ఉంచేవి, నిలిపి ఉంచేవి, ముందుకు నడిపించేవి మూడు రంగాలు - ఆర్థికం, రాజకీయం, నైతికం. వీటిలో రాజకీయ రంగం శిఖరాగ్రంలో ఉంది. ఆర్థిక విధానానిది రెండవ స్థానం. కానీ, నైతికత అన్నది అన్నది కలికానికయినా కానరావడం లేదు. సరస్వతి నదిలా అది అడుగంటిపోయింది.

**మొద్దుబారిన నైతిక స్పందన :-** భోగవాదం ఆధునిక జీవన విధానంపై ఆధిపత్యం చెలాయిస్తోంది. అందువల్ల సిరిసంపదల కోసం, సుఖాలకోసం జనం వెంపర్లాడుతున్నారు. ఈ తాపత్రయంలో, ఈ వేటలో, ఈ పరుగు పందెంలో మంచి చెడులకు, ఉచిత అనుచితాలకుమధ్య గల గీత చెరిగిపోతోంది. ఒక డామ్ నిర్మిస్తే లక్షలాది ప్రజల జీవితాలలో సుఖ సమృద్ధులు వెల్లివిరుస్తాయి. కానీ కొందరు అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కయి, స్వార్థంతో కళ్లు మూసుకుపోయిదాని నిర్మాణంలో అవినీతికి పాల్పడతారు. డామ్ బలహీనంగా తయారవుతుంది. ఒక్క వరదకే అది కొట్టుకుపోతుంది. ఇలా లక్షలాది ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. ఈ స్వార్థపరులు. కరవులు, భూకంపాలు, వరదల వల్ల పీడితులైన ప్రజలకు అందవలసిన సహాయ సామగ్రితో ఇలాంటి వ్యక్తులు తమ ఇళ్లను నింపుకుంటున్నారు. పీడితుల హాహాకారాలు, మరణ వేదనలు వీరి రాతి గుండెలను కరిగించవు. నకిలీ మందులు, కల్తీ మద్యం, కల్తీ ఆహారం వేలాది ప్రజల ప్రాణాలను హరించడం మనం నిత్యం చూస్తూనే ఉన్నాం. కూడబెట్టాలనే దురాశ, అధిక లాభాలకు అర్రులు చాచడం, డబ్బుమీద అంతులేని వ్యామోహం వంటి నీచ ప్రవృత్తులు ఈ ధోరణుల వెనుక పని చేస్తున్నాయి. అవినీతి అంతం కాదని ప్రజలు నమ్మే పరిస్థితి ఏర్పడింది. మన నైతిక స్పందన మొద్దుబారిపోయిందని రుజువు చేస్తున్న విష పరిణామాలు ఇవన్నీ.

**నీతి కథలకు చావుదెబ్బ :-** నైతికతా విలువలు లోపించిన ఈ వాతావరణంలో పెరుగుతూన్న యువతరం ఉన్నత ఆదర్శాలను, సిద్ధాంతాలను పెంచి పోషిస్తుందనీ, మన జాతికీ, సంస్కృతికీ గౌరవాదరాలు కల్పిస్తుందనీ మనం ఎలా ఆశించగలం? వట్టి ఉపన్యాసాల వల్ల, సుదీర్ఘ ఉపదేశాల వల్ల ఈ పరిస్థితి ఎలా చక్కబడుతుంది? ఆచరణలో, నిత్యజీవితంలో ఏయే చర్యలు తీసుకుంటే ఈ పరిస్థితి మారుతుంది? ఇది ఒక గొప్ప సవాలు. గురుతర బాధ్యత. యుగ మనుషులు స్వీకరించవలసిన సవాలు ఇది. వారు నిర్వహించవలసిన బాధ్యత ఇది.

కొద్ది కాలం క్రితం మన వెనుకటి తరం రోజులలో నాయనమ్మలు, అమ్మమ్మలు చెప్పే పురాణ గాథల ద్వారా కుటుంబంలోని పెద్దల అనుభవాల ద్వారా, వారు అందించే సంస్కారాల ద్వారా ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో నైతిక విలువలు సహజమైన రీతిలో పిల్లల పసి మనసులపై చెరగని ముద్ర వేసేవి. ఆనాడు ఆయా సంస్కారాలను అందించే గ్రంథాలు విరివిగా దొరికేవి. మన జాతి, మన సంస్కృతి, మన సంప్రదాయాలు నైతికంగా పతనం కాకుండా చూచేవి ఇవన్నీ. కానీ నేడు పాశ్చాత్య దేశాల అనుకరణ సాగుతుంది. కామిక్స్ బహుళ ప్రచారంలోకి వచ్చాయి. టీవీ ఇంటింటా వెలసింది. ఫలితంగా నీతి కథలు చచ్చి ఊరుకున్నాయి. ఇంటిలోని పెద్దలకు పిల్లలకు మధ్య దూరం పెరుగుతోంది. సంబంధాలు తెగిపోతున్నాయి.

**పశు మనసుకు మేలుకొలుపు :-** ఎలక్ట్రానిక్ మీడియా (టీవీ ఛానెళ్లు) మన మహోజ్వల వారసత్వాన్ని మంటగలుపుతున్నాయి. అంతే కాదు. పిల్లల మెదడులో అరాచకం సృష్టిస్తున్నాయి. వాటిని కుంచింపచేస్తున్నాయి. వినోదం పేరిట ఇవి అశ్లీలాన్ని, అసభ్యతను, చౌకబారుతనాన్ని వ్యాప్తి చేస్తున్నాయి. వైద్య విజ్ఞానం ప్రకారం 15 సంవత్సరాల వరకు మెదడు ఎదుగుతుంది. వికసిస్తుంది. ఆ వయస్సు వరకు మనం పసి మనస్సులో ఎలాంటి సిద్ధాంతాలనైనా, ఎలాంటి నమ్మకాలనైనా ప్రతిష్ఠించగలుగుతాము. మన ప్రాచీన గురుకుల సంప్రదాయంలో జీవితమంతా కలకలలాడే సంస్కారాల పంటకు,

**శీలాన్ని అలవరచాలంటే బోధకుడు ఆదర్శవంతుడై ఉండాలి.**

సౌశీల్యపు పంటకు ఈ సున్నిత దశలోనే విత్తనాలు నాటే వారు.

నేడు ప్రసార మాధ్యమాలు వెదజల్లే వికృత భావాల దుష్ప్రభావం పసి మనసుల మీదనే అత్యధికంగా పడుతోంది. ఇందువల్ల మెదడులోని పశు మనస్సు (ఏనిమల్ బ్రెయిన్) మేలుకుంటుంది. ఈ వాతావరణంలో అపరాధాలు, అత్యాచారాలు, అరాచక ధోరణులు సమాజాన్ని దురాక్రమణ చేయడం సహజమే.

**సామాజిక స్పృహ కల్పించని విద్య :-** రెండవది పిల్లలకు శిక్షణను, సంస్కారాలను ఇచ్చే గురుతర బాధ్యత విద్యా సంస్థలపై కూడా ఉంది. కానీ అవి ఆ పనిలో ఘోరంగా విఫలమవుతున్నాయన్నది జగమెరిగిన సత్యం. విద్య ముందున్న మౌళిక ప్రయోజనం వ్యక్తిత్వాన్ని సర్వతోముఖులుగా వికసింప చేయడం. శారీరకం, మానసికం, బౌద్ధికం, భావనాత్మకం అనే నాలుగు ముఖాలు ఉంటాయి వ్యక్తిత్వానికి. ఈ నాలుగింటి సమన్వయం నేటి విద్యా విధానంలో లోపించింది. నేటి విద్యా విధానంలో నిపుణులైన డాక్టర్లు, ఇంజనీర్లు, అధికారులు, వైజ్ఞానికులు తయారవుతున్నారు. కానీ వారిలో జాతి పట్ల అంకిత భావం లోపిస్తోంది. వారికి సమాజ శ్రేయస్సు కన్నా తమ వ్యక్తిగత సుఖ సంతోషాలు, పేరు ప్రతిష్ఠలు మరింత ప్రముఖమైనవిగా కనిపిస్తున్నాయి. వాస్తవానికి నేడు విద్య పూర్తిగా వ్యాపారంగా మారిపోయింది. వ్యక్తిత్వ సమగ్ర వికాసం మరుగున పడిపోయింది.

నేడు శారీరక వికాసానికీ, బుద్ధి వికాసానికీ ప్రాముఖ్యం ఇస్తున్నారు. భావనాత్మక వికాసాన్నీ, మానసిక వికాసాన్ని ఉపేక్షిస్తున్నారు. సమతూకం లేని ఈ స్థితిలో పూర్ణ మానవుని కల్పనయే అసంభవం అవుతోంది. శరీరాన్ని, బుద్ధినీ మితిమీరి పెంచే అధ్యాపకులను పాఠశాలలో, కళాశాలలో నియమిస్తున్నారు. మిగతా రెండింటినీ అసలు పట్టించుకోవడం లేదు. కానీ పిల్లలు శీలవంతులుగా, సంయమనశీలురుగా, క్రమశిక్షణాయుతులుగా తయారు కావాలని ప్రతి ఒక్కరు కోరుతున్నారు. ప్రస్తుత విద్యా విధానంలో శీల వికాసానికీ, నైతిక వికాసానికీ బీజాలు ఉన్నాయా లేదా అని ఎవరూ ఆలోచించడం లేదు. నేటి విద్యా విధానం పిల్లలలో మానవత్వాన్ని ఎందుకు వికసింపచేయడం లేదని ఎవరూ ప్రశ్నించుకోవడం లేదు.

విద్యా విధానంలోని ఈ లోపం ఆలోచనా పరులను పునరాలోచనకు పురికొల్పింది. ఫలితంగా విలువలపై ఆధారితమైన నైతిక శిక్షణ గరపడం అవసరమని దేశంలో విద్యా విధానంపై నియమించిన కమిషన్‌లు అన్నీ సిఫారసు చేశాయి. విశ్వవిద్యాలయాల గ్రాంట్ల సంఘం కూడా విశ్వవిద్యాలయాల స్థాయి పడిపోవడాన్ని అనైతికత అనే త్రాసుతో తూచింది. విద్యా విధానాన్ని సమీక్షించడానికై **1985**లో ఒక అధ్యయన బృందాన్ని నియమించింది. ఆ బృందం సిఫార్సుల ఆధారంగా సంఘం నైతిక విలువలకు సంబంధించిన పాఠ్య ప్రణాళికను రూపొందించింది.

విద్యతో నైతికతను సమన్వయపరచాలని జాతీయ మానవ హక్కుల సంఘం కూడా సూచించింది. ఎందుకంటే మానవ హక్కులకు నైతికతతో ప్రత్యక్ష సంబంధం ఉంది. నీతిమంతుడైన వ్యక్తి మానవ హక్కులను ఎన్నడూ ఉల్లంఘించడు. మానవతా విలువలు పతనం కావడం వల్లే ప్రపంచంలో యుద్ధం, సంక్షోభం, దోపిడీ పెచ్చు పెరిగాయని యునిసెఫ్ సంస్థ కూడా మహిళల, శిశువుల దురవస్థపై సమర్పించిన నివేదికలో పేర్కొన్నది. కుటుంబాలలో హింసాచర్యలకు కూడా కారణం ఇదేనని ఆ సంస్థ సూచించింది. ప్రపంచ శాంతి కోసం, నవతరం శారీరకంగా, మానసికంగా, భావనాత్మకంగా వికాసం పొందడం కోసం తన సాధన సంపత్తిని వినియోగించాలని ఆ సంస్థ నిర్ణయించింది.

భౌతిక అభివృద్ధి శిఖరాగ్రానికి చేరుకున్న మనిషి తన సుఖ సమృద్ధులను శాంతి సార్థకతలతో జోడించే నైతిక విలువలనే అడుగంటిన జలధారల కోసం ఇలా అంగలార్చుతున్నాడు. విలువలు నశించిపోవడం అనే యక్ష ప్రశ్న ప్రపంచ మేధావులను కుదిపివేస్తోంది. ఈ ప్రశ్నకు జవాబు కోసం, మానవ గౌరవ గరిమ నానాటికీ దిగజారిపోవడాన్ని అడ్డుకోవడం కోసం ప్రపంచంలోని మనుషులు నిర్విరామంగా అన్వేషిస్తున్నారు.

**నైతిక సముద్ధరణలో దేవసంస్కృతి విశ్వవిద్యాలయం :-** యుగఋషి పరమ పూజ్య గురుదేవుల జీవితమంతా ఈ యక్ష ప్రశ్నకు సమాధానం ఇవ్వడానికే సమర్పితం అయింది. తమ జీవన సాధన ద్వారా వారు కొన్ని నిర్ణయాలకు వచ్చారు. అవి ఆధారంగా నైతిక, బౌద్ధిక, సామాజిక విప్లవానికి శంఖాన్ని పూరించారు. ఈ విప్లవ సాధనలోని ఒక అభినవ ప్రయోగం దేవసంస్కృతి విశ్వవిద్యాలయం. ఈ విశ్వ విద్యాలయం పాఠ్య ప్రణాళికలో నైతిక శిక్షణ అంతర్భాగంగా ఉన్నది. సమగ్ర విద్యకు ఆ విశ్వవిద్యాలయం అంకురార్పణ చేసింది. చిన్నదే అయినా సాహసోపేతమైన ముందడుగు ఇది. జాతి నైతిక సముద్ధరణలో, సాంస్కృతిక నవ నిర్మాణంలో ఈ విశ్వవిద్యాలయం భవిష్యత్తులో మహత్తర పాత్రను నిర్వహించడం తథ్యం.

H H H

**ఆత్మవిశ్వాసం కలిగిన వ్యక్తి ఎన్నడూ ఓడిపోడు, ఎన్నడూ చనిపోడు.**

## బోధ కథ

# బంధ విముక్తి

ఆ సాధువు ఒంటరిగా ఉన్నాడు. కౌపీనం మాత్రమే ధరించాడు. చేతిలో ఒక సొరకాయ బుర్ర, జలపాత్ర. తెలుపు రంగు. ఉన్నతమైన నదురు. యౌవనాన్ని దాటి ముసలి తనంలో అడుగు పెడుతున్న వయస్సు. జడలు కట్టిన జుట్టు. తెలుపు, నలుపు, గోధుమ రంగు గల వెంట్రుకలు అల్లుకుని ఉన్నాయి.

ధూళితో నిండిన కాళ్లు. దూరం నుంచి నడిచి వచ్చినందు వల్ల కలిగిన అలసట, దట్టమైన గడ్డం మీద కూడా కొంచెం ధూళి కనబడుతోంది. నుదుటి మీద పెద్దపెద్ద చెమట బొట్లు. మధ్యాహ్నం అవుతోంది. ఎక్కడ విశ్రాంతి తీసుకోవాలా అని ఆయన ఆలోచిస్తున్నట్లు అనిపిస్తోంది.

అయితే ఎదురుగా కనిపించిన దృశ్యం ఆయనకు వింత అనిపించింది. ఇదంతా ఏమిటి? ఈ జనం ఇలా ఎందుకు పరుగులు పెడుతున్నారు? వీళ్లంతా ఎందుకు ఆందోళన చెందుతున్నారు? సాధువులు ఇతరుల వ్యవహారాలలో తల దూర్చకూడదు. కానీ ఇతరుల ఆపదలు హృదయాన్ని ఆర్ద్రం చేయకపోతే తాను సాధువు ఎలా అవుతాడు? ఏదో పెద్ద ఆపదే వచ్చి ఉంటుంది. లేకపోతే గ్రామంలోని జనమంతా ఇలా గాభరాగా ఎందుకు పారిపోతున్నారు?

ఆ సాధువు గ్రామ సమీపంలో ఒక మర్రిచెట్టు క్రింద ఉన్న రచ్చబండ మీద కాసేపు విశ్రమించాడు. ఎవరూ ఆయన దగ్గరికి రాలేదు. గ్రామం పెద్దదే. సంపన్నమైన గ్రామంగా కనబడుతోంది. దూరంగా గ్రామ అధిపతి భవనం ఎత్తుగా కనిపిస్తోంది. అయితే ఇక్కడ అంతా హడావుడిగా ఉంది. సామానులను బండ్లమీదికి ఎక్కిస్తున్నారు. పశువులను తోలుకు వస్తున్నారు. ఇళ్లలో ఉన్న సామాను మొత్తం గుర్రపు బళ్ల మీదకు హడావుడిగా చేర్చుతున్నారు. జనమంతా అంతటా ఒకటే కంగారు. ఒకటే తొందర.

'విషయం ఏమిటి బాబూ! మీరంతా ఇంతగా ఉరుకులు పరుగులు తీస్తున్నారెందుకు?' సాధువు వారిలో ఒక వ్యక్తి వద్దకు వెళ్లి అడిగాడు.

ఆ వ్యక్తి సాదరంగా సాధువు పాదాలకు వంగి ప్రణామం చేశాడు. 'స్వామీ! మమ్మల్ని క్షమించండి. మీకు సేవ చేయగలిగిన స్థితిలో మేము ఇప్పుడు లేము'

'మీకు వచ్చిన ప్రమాదం ఏమిటి! చెప్పడానికి మీకు అభ్యంతరం లేకపోతే....'

'పిండారీలు (బందిపోటు దొంగలు) వస్తున్నారు. పేరు మోసిన క్రూర పిండారీ భీమపాల్ తన మొత్తం దళంతో వచ్చిపడుతున్నాడు. అతడి వెంట కొన్ని వందల మంది గుర్రపు రౌతులు ఉన్నారు. అతడు వట్టి రాక్షసుడు స్వామీ. మీరు కూడా దూరంగా ఎటైనా వెళ్లిపోతే మంచిది. సాధువులను సైతం హత్య చేసి ఆనందించే పిశాచం వాడు. వాడు దోపిడీ చేసి ఊరుకోడు. ఇళ్లు తగలబెడతాడు, ఇళ్లు కూల్చివేస్తాడు. అందిన వాళ్లను చిత్రహింసలు పెట్టి చంపి ఆనందించే కరకు కసాయివాడు.' అని ఆ వ్యక్తి సమాధానం చెప్పాడు.

'మహాకాలుని చరణాలను ఆశ్రయించే వ్యక్తి మనుషుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడడు' అన్నాడు సాధువు. ఒకసారి ఆకాశం వైపు చూసి ఇలా అన్నాడు-'ఆ మృత్యుంజయుడిని స్మరించగానే భయం పలాయనం చిత్తగిస్తుంది. అది సరే. నేను మీ గ్రామాధిపతిని కలుసుకోవాలి. నాకు ఆయన ఇల్లు చూపించగలవా?'

'అలాగే తమరు నాతో రండి స్వామీ'

పిండారీ భీమపాల్ మహాక్రూరుడు. కానీ అతడు మోసగాడు కాదు. అతడు ఎవరినీ దగా చేయడు. ఈ సాధువును గ్రామాధిపతితో కలిపినంత మాత్రాన వచ్చే ప్రమాదం ఏదీ లేదు. అయినా ఈ సాధువు ఒంటరి వాడు. ఆయుధాలు లేని వాడు. ఈయన ఏమి చేయగలడు- అని ఆ వ్యక్తి అనుకున్నాడు.

కొద్ది క్షణాలలో సాధువు గ్రామాధిపతిని కలుసుకున్నారు.

'పిండారీలు వస్తున్నారని మీకు ఖచ్చితంగా తెలుసా?' అని సాధువు సూటిగా ప్రశ్నించాడు.

గ్రామాధిపతి కూడా సూటిగానే ఇలా జవాబిచ్చాడు. 'మూడు రోజుల క్రితం మాగ్రామం యువకుడు ఒకడు పిండారీలకు పట్టుబడ్డాడు. అతడు ఏదో విధంగా తప్పించుకున్నాడు. పిండారీలు ఆ గ్రామాన్ని పూర్తిగా ధ్వంసం చేశారు. ఆ గ్రామంలో ఇపుడు మొండి గోడలు మాత్రమే మిగిలాయి. ఆ విధ్వంసం ఇంకా పగ వస్తోంది. ఎందరు చనిపోయారో తెలియలేదు.'

'మీరు మీ గ్రామ వాసులను రక్షించరా?' సాధువు మాటల్లో

**ఇంద్రియాలలో సుఖం కనబడితే, కళ్లపై తెర క్రమ్మినట్టే.**

ఎత్తిపొడుపు లేదు. అది మామూలుగా ఉంది.

బాధ నిండిన స్వరంతో గ్రామాధిపతి ఇలా చెప్పుకుపోయాడు - ఆ ప్రయత్నమే చేస్తున్నాను. క్షత్రియుణ్ణి. చావుకు భయపడను. కానీ, నేను నా సైనికులతో సహా మరణించినా నా ప్రజలను రక్షించగలననే ఆశ నాకు లేదు. ఈ కొద్ది మంది వీరులూ వీరికి వందరెట్లు బలమైన ఆ పిండారీలను అడ్డుకుపోలేరు. కనుక మేము గ్రామాన్ని ఖాళీ చేస్తున్నాము. ఇళ్లపై వ్యామోహాన్ని ప్రజలు వదులుకోక తప్పదు. చరాస్తులన్నిటినీ మేము మా వెంట తీసుకువెళతాం. పొలాలలో ఇపుడు పంటలు లేవు.

'మరి మీరు తప్పించుకోగలుగుతారా?' ప్రశ్న ఎంత సూటి అయినదో జవాబు చెప్పడం అంత కఠినమైనది.

గ్రామాధిపతి స్వరంలో తీవ్ర నిరాశ ఉంది. 'ఆ అవకాశం తక్కువ. వారి గుర్రాలకు అడవి దారులన్నీ కొట్టిన పిండి. వాటికి తెలియని దారి లేదు. గ్రామం ఖాళీగా ఉండడం చూచి వాళ్లు మండిపడతారు. ఈ ప్రాంతంలో గ్రామాలు దూరదూరంగా ఉంటాయి. ఆకలితో వస్తారు. వాళ్ల గుర్రాలకు దాణా అవసరం అవుతుంది. చాలా దూరం వెళితే కానీ వారికి, వారి గుర్రాలకు ఆహారం దొరకదు. కనుక వాళ్లు మమ్మల్ని వెంట తరుముతారు. అది ఖాయం. కానీ మాకు మరో దారి లేదు. రేపు ఉదయానికి వారు ఇక్కడికి చేరుకుంటారు. అప్పటిలోగా మేము ఎంత దూరం వెళ్లగలిగితే......'

'అంత దూరం వెళ్లవలసిన అవసరం లేదు' అని సాధువు అతడికి భరోసా ఇచ్చాడు. ఆయన ఇంకా ఇలా అన్నాడు- 'నేను మిమ్మల్ని ఆపను. మీరు ఆగితే ఇక్కడా భగవంతుడు మీ అందరినీ రక్షిస్తాడు. నా మాట మీద అంత నమ్మకం లేకపోతే మీరు ఓ పని చేయండి. మీరంతా కొద్ది దూరం వెళ్లి ఆగండి. పిండారీలు తిరిగి వెళ్లిపోయిన వెంటనే మీరు ఇక్కడికి వచ్చి మీ ఇళ్లు వాకిళ్లు చక్కదిద్దుకునేందుకు వీలుగా బాగా దగ్గరలోనే ఆగండి.'

గ్రామాధిపతి వేదన నిండిన స్వరంతో ఇలా అన్నాడు- 'తమకు వాళ్ల స్వభావం ఎలాంటిదో తెలియదు. చక్కదిద్దుకోవడానికి అసలు ఇళ్లు మిగిలితే కదా. అలా ఇళ్లను ఉన్నవి ఉన్నట్లు వదలివేసే సౌమ్యత ఆ పిండారీలలో ఏ ఒక్కరికీ లేదు.'

"నాకు విశ్వనాథుడైన ఆ పరమేశ్వరుని స్వభావం ఎలాంటిదో బాగా తెలుసు. తనను ఆశ్రయించిన వారికి ఉపేక్షించడం ఆయనకు చేతకాని పని. రేపు మూడవ జాముకు చెక్కు చెదరకుండా మీ ఇళ్లు మీకు లభిస్తాయి. శుభం. ఇక మీరు వెళ్లిరండి.''- సాధువు స్వరంలో అచంచలమైన విశ్వాసం ధ్వనించింది.

గ్రామాధిపతి ఎంత ఒత్తిడి చేసినా సాధువు భోజనం చేయడానికి ఒప్పుకోలేదు. ఆయన సరాసరి మర్రిచెట్టు క్రిందికి వచ్చాడు. అక్కడ తపస్సు ప్రారంభించాడు. ఇక్కడ ఆ తపస్సులో ఏకాగ్రత, తన్మయత్వం తీవ్రతరం కాసాగింది. అక్కడ - గ్రామంలోని దృశ్యం మారిపోసాగింది.

మహా బలిష్టుడైన భీమపాల్ ఎదుట అతడి సైనికులు వణుకుతున్న గొంతులతో ఇలా విన్నవించుకుంటున్నారు - "మేము గ్రామం మొత్తం గాలించి తిరిగి వచ్చాం. గ్రామంలో ఒక్క నరమానవుడు లేడు. ఇళ్ల తలుపులన్నీ తెరచి ఉన్నాయి. ఇళ్లలో ఒక విరిగిన నులక మంచమైనా లేదు.'

భీమపాల్ ఇంకా తన నల్ల గుర్రం మీదనే ఉన్నాడు. అతడు కర్కశంగా ఇలా హుకుం జారీ చేశాడు-'వాగుడు కట్టిపెట్టండి. గుర్రాలకు దాణా అవసరం. సైనికులందరికీ భోజనం, విశ్రాంతి అవసరం. ఇళ్లు ఖాళీగా ఉన్నాయి. పాడుపడిన ఇళ్లలో తలక్రిందులుగా వ్రేలాడడానికి మేము గుడ్ల గూబలము కాము. ఆ ఇళ్లను తగులబెట్టి చేతులు వెచ్చబెట్టుకునే పని ఆ తర్వాత. మొదట ఆ పారిపోయే వాళ్లను వెదకి పట్టుకోండి.'

ఒక సైనికుడు ఇలా అన్నాడు- 'ఒక వ్యక్తి ఉన్నాడు. గోచీ కట్టుకున్న సాధువు. ఆ మర్రి చెట్టు క్రింద కళ్లు మూసుకు కూర్చున్నాడు.'

'లాక్కురండి వాణ్ణి'

ఆ ఆజ్ఞ జారీ అయిందో లేదో - మూడు నాలుగు గుర్రాలు దౌడు తీశాయి.

'గ్రామం జనం ఎక్కడికి వెళ్లారు?' తాళ్లతో బంధించబడి ఎదుట నిలబెట్టబడిన సాధువును పిండారీ భీమపాల్ ప్రశ్నించాడు. బంధించబడినప్పటికీ సాధువు ప్రసన్నంగా ఉండడం, తన ప్రశ్నకు జవాబు ఇవ్వక పోవడం చూచి అతడు ఆశ్చర్యపోయాడు.

'ముక్త పురుషుడు బందీలకు వివరణ ఇవ్వడు. బందీల ప్రశ్నలకు జవాబివ్వడం తప్పనిసరి అయే పరిస్థితి అతడికి ఎప్పుడూ రాదు.'- సాధువు నమ్రంగా అయినా స్థిరంగా చెప్పాడు.

'బందీ ఎవరు?' అని భీమపాల్ అడిగాడు. అతడికి సాధువు మాటలు వింతగా తోచాయి.

'పారిపోవడం తప్పనిసరి అయినవాళ్లు. గుర్రాలు ఎక్కి

**సన్మార్గంలో నడిస్తే ఆత్మబలం పెరుగుతుంది.**

పారిపోయి వచ్చిన వాళ్లు. ప్రపంచంలో వాసనలతో బంధించబడి పారిపోతున్న వాళ్లు.'

'త్రాళ్లతో బంధించబడిన వ్యక్తి నా ఎదుట ఉన్నాడు.' అంటూ పిండారీ పగలబడి నవ్వాడు.

సాధువు చిరునవ్వుతో ఇలా అన్నాడు. 'ఈ త్రాళ్లు మట్టిని బంధిస్తున్నాయి. విశ్వనాథుని సేవకుణ్ణి, పరమేశ్వరుని సేవకుణ్ణి బంధించే శక్తి ఈ త్రాళ్లకు లేదు. నీవు బంధించగలవా ప్రళయంకరుడైన పరమేశ్వరుని సేవకుణ్ణి? అసలు నీవు నీ బంధనాల నుండి విడిపించుకోలేవు. ఈ సాధువు సహాయం లేకపోతే.'

'నేను బంధించబడ్డానా? నీ ప్రలాపాలకు మోసపోయే వాణ్ణి కాను నేను. గ్రామం నుంచి పారిపోయిన వారి ఆచూకీ నీవు చెప్పితీరాలి.'- అని పిండారీ అరిచాడు.

'నీ బంధనాలను నీవు చూడడం అనేది నా ఆరాధ్యుని కృప లేకుండా ఎలా సాధ్యపడుతుంది?'

పిండారీ చేసిన సైగ ప్రకారం ఇద్దరు గుర్రాలు దిగి కొరడాలు పుచ్చుకుని సాధువుకు ఇరువైపులా నిలబడ్డారు. సాధువు వారిని చూచీ చూడనట్లు ప్రశాంతంగా ఉన్నాడు. అతడు ఒకసారి ఆకాశం వైపు దృష్టి సారించి 'అశుతోష్' (పరమశివా) అన్నాడు.

అంతే మరుక్షణంలో ఒక పరమాద్భుతం జరిగింది. భీమపాల్ ఒక్కసారిగా గుర్రం నుండి క్రిందికి ఉరికాడు. సాధువు కాళ్లపై తన తల ఉంచాడు.

'ఈ భయంకర సర్పాలు! పడగలు విప్పి, మండుతూన్న కళ్లతో నన్ను కాటువేయడానికి ముందుకు వస్తూన్న ఈ నల్లత్రాచులు! తమరు నన్ను వీటినుండి రక్షించండి. నన్ను క్షమించండి.' అంటూ భయకంపితుడై ప్రార్థించాడు.

ఎవరికీ ఏమీ అర్థం కావడం లేదు. ఎవరికీ ఏదీ కనబడడం లేదు. ఆ సాధువు మామూలు మనిషి కాడని మాత్రం పిండారీ సైనికులకు అర్థం అయింది. ఆయన ఏదో చేసి ఉంటారని, ఏదో అద్భుతం చేసి ఉంటారని వారు అనుకున్నారు.

'ఇవి నన్ను చుట్టుకున్నాయి. నా ఎముక ఎముకను విరిచివేస్తున్నాయి. నన్ను వీటి విషం దహించి వేస్తోంది. నన్ను కరుణించండి! నన్ను రక్షించండి! నన్ను క్షమించండి.' - అంటూ భీమపాల్ ప్రాధేయపడుతున్నాడు. కాళ్లూ, చేతులూ కొట్టుకుంటున్నాడు. బాధతో మెలితిరిగి పోతున్నాడు. దిక్కు తోచని స్థితిలో విలవిలలాడిపోతున్నాడు. సాధువు కాళ్లమీద తన తల మళ్లీమళ్లీ కొట్టుకుంటున్నాడు.

సాధువు ప్రశాంతంగా, ప్రసన్నంగా నిలబడి ఉన్నాడు. ఆయన ఇలా అన్నారు - ఈ నాగుబాములు నిన్ను ఇపుడే బంధించలేదు. ఇవి ఎపుడూ నిన్ను బంధించే ఉన్నాయి. ఈ నల్ల పాములు, తెల్ల పాములు, పసుపుపచ్చ పాములు, రంగురంగుల పాములు నీ కామ క్రోధ లోభాలు. విషయాలపై నీలో ఉన్న తృష్ణలు. ఎన్నటికీ తీరని భయంకర తృష్ణలు. ఇవి నిన్ను ఎప్పటి నుంచో పట్టి పీడిస్తున్నాయి. వీటి విషం నిన్ను ఎప్పటి నుంచో నిన్ను దహించి వేస్తోంది. నేడు ప్రభువు కృప వల్ల నీవు నీ బంధనాలను చూడగలుగుతున్నావు.'

పిండారీ అవాక్కయ్యాడు. 'విషయాల పట్ల అనురాగం కలిగి ఉన్న వ్యక్తి బంధితుడే'- అనే సంస్కృతి, అనే సత్యం అతడికి ఇప్పుడు అనుభవమవుతోంది. 'నేను నిజంగా కళ్లు తెరిచింది ఈ రోజునే.' అంటూ అతడు సాధువుకు కట్టిన కట్లు తన చేతులతో విప్పాడు. మరోమారు సాధువు పాదాల మీద పడి ఇలా అన్నాడు - 'ప్రభూ! నా బంధనాలను చూడడానికి నాకు మీరు కళ్లు ఇచ్చారు. వాటిని విడిపించుకోవడానికి కూడా మార్గం చూపి పుణ్యం కట్టుకోండి. అంతవరకు మీ పాదాలు వదలను'సాధువు చిరునవ్వు నవ్వుతూ ఇలా అన్నాడు- 'బంధనాలను చూచిన వ్యక్తి వాటి నుండి విడివడడానికి సరంజామా సేకరించుకున్నాడని తెలుసుకో. వాటి పట్ల ఆసక్తి నశిస్తే, మనస్సు ప్రశాంతత వహిస్తే బంధనాలు తెగిపోతాయని భావించు.'

కొద్దిసేపు తన స్నేహమయ హస్తాన్ని అతడి శిరస్సుపై ఉంచి సాధువు వెళ్లిపోయాడు. అయితే ఆ కొద్ది క్షణాలలోనే ఏదో విశేషం జరిగిపోయింది.

గ్రామ ప్రజలు నాటి సాయంత్రం తిరిగి వచ్చారు. భీమపాల్ వచ్చి వెళ్లినందుకు గుర్తుగా వారికి గుర్రపు లద్దెలు తప్ప మరేమీ కనిపించలేదు. వారి ఇళ్లలో పూచిక పుల్ల అయినా పోలేదు. ఆ సాధువూ వారికి కనిపించలేదు.

ఆంగ్లేయ ప్రభుత్వానికి పక్కలో బల్లెంగా తయారైన భీమపాల్ పిండారీ దళం పేరు మళ్లీ ఎక్కడా వినిపించలేదు.

అయితే పై సంఘటన జరిగిన కొద్దిరోజుల తర్వాత ఒక ధృఢకాయుడైన సాధువు చిత్రకూటంగా కనిపించాడు. ఆయన భీమపాల్‌ను పోలి ఉన్నాడు. ఆ సాధువు ఇప్పుడు బంధనాల నుండి విముక్తుడు. ఆ ముక్తిని ఉపదేశించే గురువు. మోక్ష రహస్యం ఆయన జీవితంలో జాలువారుతోంది.

H H H

**లక్ష్యాన్ని ఎల్లప్పుడూ ముందుంచుకో, సాఫల్యానికి కీలకం ఇదే.**

మనం - మన ఆరోగ్యం

# దీర్ఘ జీవనానికై మానసిక సంతులనం

కొలంబియా విశ్వవిద్యాలయానికి చెందిన జీవశాస్త్ర వైజ్ఞానికుడు డా॥ హెచ్. సిక్స్ తన పరిశోధనల ద్వారా మనిషి తన శరీరాన్ని రసాయనిక దోషాలు, జటిల వ్యాధుల నుండి రక్షించుకోగలిగితే అతడు 800 సంవత్సరాలు సునాయాసంగా బ్రతకవచ్చని చెప్పాడు. అధికంగా పని చేయడం, పరుగు, ఉత్తేజం, వేడి, కఠిన శ్రమ శరీరాన్ని వేడెక్కించి దాని జీవన శక్తి భాండాగారాన్ని త్వరగా ఖర్చు చేస్తాయని ఆయన ఉవాచ. లోపలి అవయవాలపై అదనపు భారం పడకుండా, వాటిని స్వాభావికంగా, సరళమైన రీతిలో పని చేయిస్తే అవి చావు పుట్టుకల ప్రక్రియను నెమ్మదిగా జరపగలిగేటంత శక్తివంతంగా తయారవుతాయి. కోరికలు, క్రోధం, చింత, ఆవేశం చాలా హానికరమైనవి. శాంతమైన, సరళమైన సంతృప్తితో కూడిన, ప్రసన్న జీవితాన్ని జీవిస్తే నిరర్థక ఉద్వేగాల నుండి రక్షింపబడవచ్చు. జీవన శక్తి క్షీణతను కాపాడి దీర్ఘ జీవనాన్ని పొందవచ్చు.

ఉద్వేగ పరిచే ఆహారం, ఉద్విగ్న ఆలోచనలు నాడీ కేంద్రాలను తపింపచేసి మనిషిని బలహీనపరుస్తాయి. పూర్ణాయుష్షును దూరం చేస్తాయి.

మానవ శరీర ఉష్ణోగ్రత సుమారు 98.6 ఫారన్ హీట్ డిగ్రీలు ఉంటుంది. దీనిని సగానికి అనగా 49కి తగ్గించగలిగితే ఆయుష్షును అద్భుతంగా పెంచవచ్చు. సుమారు 2000 సంవత్సరాలు చేయవచ్చు. డాక్టర్ లూవే క్రొత్తగా కనుగొన్న సత్యం- శరీరాలలోని జీవకోశాల చావుపుట్టుకల క్రమం 98 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద ఏ విధంగా ఉంటుందో ఉష్ణోగ్రత సగానికి సగం అయినపుడు అంతకంటే 20రెట్లు అధికంగా సాగుతుంది. దీనితో ఆయుష్షు పెరగడం తథ్యం. అన్ని కోశాలూ నశించిపోవడమే మృత్యువు. పాత జీవకోశాలు మరణించి కొత్తవి జన్మిస్తూ ఉంటాయి. ఈ కోశాల చావు పుట్టుకలు ఉన్నంత వరకు మృత్యువు అన్న ప్రశ్న తలెత్తదు. జీవకోశాలు బలహీనపడకుండా ఉండడం. వాటి నశింపు స్వల్పంగా ఉండడం. నూతన కోశాలు ఉత్పన్నమయ్యే క్రమం శిథిలం కాకుండా ఉండడం. ఇవే దీర్ఘ జీవనానికి మూలాధారాలు. ఈ వ్యవస్థను బాహ్య తాపాన్ని, ఆంతరిక సంతాపాన్ని తగ్గించుకోవడం ద్వారా తయారు చేసుకోవచ్చు. ఇప్పటి కంటే ఎన్నో రెట్ల కాలం జీవించడం సంభవం కావచ్చు.

అమెరికాలోని రాక్‌ఫెల్లర్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన జీవశాస్త్ర విభాగంలో చాలాకాలం నుండి జీవాణువుల జీవన చర్యను తెలుసుకునే ప్రయత్నం జరుగుతున్నది. అమీబా, పైరామీశియా జీవాణువులకు ఆహారాన్ని అందచేస్తూ ఒత్తిడి కలుగనీయకుండా, నశించకుండా జాగ్రత్తలు తీసుకోవడం జరిగింది. ఒక కోశం 900 కోశాలకు జన్మనిచ్చింది. వాటి జీవనం అవిచ్ఛిన్నంగా సాగుతోంది. ఆవశ్యక సౌకర్యాలు దొరికితే ఈ జీవకోశాన్ని ఇంకా ఎక్కువ కాలం సజీవంగా ఉంచవచ్చు. ఇలాంటి దశలో మనిషి అతి దీర్ఘకాల ఆయుష్షును పొందవచ్చు. దాదాపు అమరత్వ స్థితికి చేరవచ్చు.

భారతీయ యోగశాస్త్రం ఈ సత్యాన్ని ఎల్లపుడూ అంగీకరిస్తూనే వచ్చింది. సిద్ధపురుషులు నిరాహారులుగా ఉండి కూడా దీర్ఘజీవనాన్ని పొందారు. పాము వాయువును మాత్రమే సేవించి బ్రతుకుతుంది. తాబేలు అంగాలను ముడుచుకుని ఉంటుంది. యోగి కూడా అలా చేయవచ్చు.

ఎలుగుబంటి మంచు తుఫానుల సమయంలో తన బిలంలోకి వెళ్లి దాక్కుంటుంది. ఋతు పరివర్తన జరిగిన తర్వాతనే ఆహారాన్ని వెదుక్కోవడానికి బయటికి వస్తుంది. కొండచిలువ లాంటి ఉదాహరణలు కూడా ఉన్నాయి. శీతల ప్రాధాన్యత, అధిక విశ్రాంతి జీవకణాల నశింపును ఆపుతాయనేది నిశ్చయం.

ఆరోగ్యకరమైన, పరిపుష్టమైన దీర్ఘజీవనం కోసం ఆహార నియమాలను వెదకడం, పౌష్టిక భోజనాన్ని తీసుకోవడం, డాక్టర్లు, కెమిస్టుల సలహాలను వేదవాక్యాలుగా ఆచరించడమే చాలదు. అందుకోసం ఇంకా లోతుగా వెళ్లాలి. ఆరోగ్యకరమైన జీవన మర్మాన్ని అర్థం చేసుకోవాలి.

ఆహారము, మందుల మీదే ఆరోగ్యం ఆధారపడి ఉంటే ధనవంతుడైన ఏ వ్యక్తి అయినా బలహీనంగా కనబడడు. రోగాలు, అర్ధాయుష్షు బారిన పడడు. వారి వద్ద ధనం అధికంగా

**జ్ఞాన సంపదను మించిన సంపద లేదు.**

ఉంటుంది. ఎంత ఖరీదైన వస్తువులనైనా ఎంత ఎక్కువగానైనా కాని తినగలరు. వారు కావాలంటే బంగారాన్ని కూడా తనగలరు. ఆహారం మీదనే ఆరోగ్యం ఆధారపడి ఉంటే సంపన్నులైన వ్యక్తులు డాక్టర్ల ద్వారా ఆమోదించబడిన పదార్థాలను తిని శారీరక సుఖాలను అనుభవించాలి. నిర్ధనులైనవారు ఆకలితో పొట్ట నింపుకోలేని స్థితిలో రోగగ్రస్తులై బలహీనంగా ఉండాలి. కాని జరిగేది సరిగ్గా దీనికి వ్యతిరేకం. టానిక్కులు, విటమిన్లు, మినరల్స్, పౌష్టికాహారం అమ్మేవారు ఇతరులను బలవంతులుగా, పహిల్వానులుగా చేసేవారు, ఔషధ విక్రేతలు, వైద్యులే కాక సంజీవనీ మూలికలు తయారు చేసేవారు ఖచ్చితంగా రోగాలు లేనివారై ఉండాలి. కాని ఇలాంటి వారిని అన్వేషిస్తే డాక్టర్లు, వారి కుటుంబీకులు ఇతర రోగుల కంటే మంచి స్థితిలో దొరకరు. అంతకంటే ఎక్కువ దుర్దశలో ఉండే వారు కూడా వారిలో ఉంటారు.

ఇక్కడ సమతుల్య పౌష్టిక ఆహారాన్ని నిందించడంలేదు. మందులు నిరర్థకమనీ చెప్పడంలేదు. సమయానుగుణంగా ఒక పరిమితికి లోబడి అవి ఉపయోగపడవచ్చు. అయితే ఆరోగ్యానికి ఆధారం అంత తేలికైనది కాదని అర్థం చేసుకోవాలి. అందుకు అంతరంగ జీవనంతో సంబంధం ఉన్నదని గుర్తించాలి. వాస్తవానికి మనం బయట చూసేదంతా ఆంతరంగిక స్థితికి ప్రతిక్రియ మాత్రమే.

అంతఃచేతన స్థాయికి అనుగుణంగా మనస్సు, మస్తిష్కం, నాడీ మండలం, అవయవాల క్రియాకలాపాల రూపురేఖలు నిర్మితమవుతాయి. ఆ మార్గంలోనే పని చేస్తాయి. ఆంతరంగిక ఉద్వేగం ఆ రూపురేఖల మొత్తాన్ని ప్రభావితం చేస్తుంది. దీనితో జీవన తత్వం కొలిమిలో వేగే శనగల తరహాలో తన కోమలత్వాన్ని, సరసత్వాన్ని కోల్పోతుంది. మనోవికారం లోపల్లోపలే కాల్చివేసే ఒకరకమైన అగ్ని. ఇది ఆరోగ్యానికి బాధ్యత వహించే తత్వాలను నశింపచేస్తూ ఉంటుంది. భోగలాలస, అధిక ధనసంపాదనా కాంక్ష-వీటినే కోరిక, తృష్ణ అంటారు. ఇవి ఎన్నటికీ ఆరిపోని అగ్నిశిఖలు. వీటిలో జ్వలించేవారు తమ శాంతిని సమభావాన్ని నిరంతరం కోల్పోతూ ఉంటారు.

చింత, భయం, క్రోధం, దుఃఖం ఎవరిలో ఉంటాయో వారు నిరాశతో నాశనం అంచుకు చేరతారు. ఈర్ష్య, ద్వేషం, ప్రతీకారం, కపటం, మాత్సర్యం వంటి దుష్ప్రవృత్తులు గలవారి అంతఃకరణం నిరంతరం ఉద్విగ్నతకు గురవుతూ ఉంటుంది. మనసులో కొంచం కూడా సంతోషం, సంతృప్తి లభించవు. ఈ ఉద్విగ్నత అంతరంగం మొత్తాన్ని ఆటుపోటులకు గురి చేస్తుంది. ఈ విషమ స్థితిలో పడ్డవారి ఆరోగ్యం సమతుల్యంగా ఉండదు.

అధిక శ్రమ, నిరంతర సంభ్రమం శక్తికోశాలను నశింపచేస్తాయి. మనిషి రోజురోజుకు డొల్లగా తయారవుతాడు. నియమిత, వ్యవస్థిత దినచర్య లేకపోవడం కూడా చెడు ప్రభావాన్ని చూపిస్తుంది. శరీరాన్ని స్థిరంగా ఉంచే అంతరంగ ప్రణాళిక ఒక పద్ధతిని అవలంబించినపుడు అన్నీ సక్రమంగానే జరుగుతాయి. కాని ప్రతిరోజు క్రొత్తక్రొత్త దినచర్యలు, క్రమవ్యవస్థ, రీతి-నీతి మారుతూ ఉంటే లోపల కూడా ఏ ప్రణాళికా నిర్ధారణ కాదు. ఆ అవ్యవస్థ వలన జీర్ణ వ్యవస్థ మొదలుకుని నాడీ మండలం వరకు అన్నింటిలో అనిశ్చిత స్థితి ఉత్పన్నమవుతుంది. ఆరోగ్య రక్షణకు నియమిత, నిర్ధారిత దినచర్య అవసరం.

అనవసరమైన తాపాన్ని ఉత్పన్నం చేసే మనోవికారాలు, విక్షోభాలు, ఉద్దేశ్యాల నుండి బయటపడి, శాంత, సమతుల్య, సంతుష్ట జీవితాన్ని నవ్వుతూ, ఖుషీగా ఉండే నియమిత జీవనాన్ని గడపడానికి ప్రయత్నం చేయాలి. ఆహారాన్ని పరిమితంగా సమయానికి తీసుకోవాలి. సాదా అయిన అనుత్తేజక పదార్థాలతో ఆకలి కంటే తక్కువ మోతాదులో తీసుకోవాలి. ఇలా చేస్తే నాలుగింట మూడు వంతుల మంది జీవన శక్తిని నాశనం చేస్తున్న తాపం కడుపులో ఉత్పన్నం కాదు.

అంతరంగంలో పెరిగే ఉత్తేజం ఉచ్ఛ్వాస, నిశ్వాసల గతిని తీవ్రం చేస్తుంది. కోప సమయంలో నాడులు, హృదయ గతి బాగా ఎక్కువవుతాయి. కామక్రీడలో కూడా ఈ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. పెరిగే శ్వాస వేగం జీవన శక్తిని తగ్గిస్తుంది. ప్రాణాయామం, వ్యాయామం ద్వారా ఊపిరితిత్తులను పరిపుష్టంగా చేసే ప్రక్రియ చాలా ఉత్తమం. అయితే ఇది పరిమిత ప్రయోజనం కోసం, పరిమిత సమయం వరకు మాత్రమే ఉండాలి. అధిక సమయం శరీరాన్ని ఉత్తేజపరిస్తే శ్వాసగతి ఎక్కువగా ఉండడం వలన అనావశ్యక తాపం ఉత్పన్నమవుతుంది. దాని పరిణామం అనారోగ్యానికి దారితీస్తుంది. మనసునే కాక శరీర స్థితిని కూడా సమతుల్యంగా ఉంచుకోవాలి.

**తప్పును ఒప్పుకోవడం గొప్ప సాహసం.**

ఉచ్ఛ్వాస నిశ్వాసాల తీవ్ర - మంద ప్రక్రియలకు కూడా ఆయుష్షుతో సంబంధం ఉన్నది. శ్వాసను వేగంగా తీసుకునే జీవులు ఎక్కువ కాలం జీవించవు. వాటి ఆయుష్షు త్వరగా అంతమవుతుంది. శ్వాస నెమ్మదిగా తీసుకునే ప్రాణులు ఎక్కువ కాలం జీవిస్తాయి. ఈ సందర్భంగా కొన్ని ప్రాణుల శ్వాసల సంఖ్య వాటి ఆయుః ప్రమాణం ఈ క్రింద ఇవ్వబడింది.

| **జీవి** | **నిమిషానికి శ్వాసల సంఖ్య** | **ఆయుష్షు (సం॥లలో)** |
|---|---|---|
| తాబేలు | 5 | 150 |
| పాము | 7 | 120 |
| ఏనుగు | 12 | 100 |
| మనిషి | 12 | 100 |
| గుర్రం | 18 | 50 |
| పిల్లి | 25 | 12 |
| మేక | 25 | 12 |
| కుక్క | 26 | 13 |
| పావురం | 36 | 9 |
| కుందేలు | 32 | 8 |

ఎంతో మంది సిద్ధపురుషులు ఇప్పుడు కూడా దీర్ఘకాలం వందల సంవత్సరాలు జీవించేస్తున్నారు. దానికి కారణాలు శీతల ప్రదేశంలో నివాసం, మానసిక శాంతి, సమతుల్యత, అనవసరమైన క్షోభసంతాపాలకు దూరంగా ఉండడం. వారు తమ ఆహారవిహారాలను నియమితంగా ఉంచుకుంటారు. ప్రాణాయామ విద్యద్వారా శ్వాస ప్రక్రియను నియంత్రించుకుని జీవించడానికి కావలసినంతవరకే దాని గతిని నియంత్రించుకుంటారు. అనవసర శక్తి క్షయాన్ని కొంచెం కూడా ఉపేక్షించరు.

శక్తివంతమైన దీర్ఘజీవనం కోసం ఆహార విహారాలలో సమతుల్యత పాటించాలి. ఆంతరిక శాంతికి, సమభావాలకు ఆరోగ్యంతో అవిచ్ఛిన్న సంబంధం ఉంటుందని గుర్తించాలి. మానసిక ఆరోగ్యంతోనే శారీరక ఆరోగ్యాన్ని సురక్షితంగా ఉంచుకోవచ్చు.

అనువాదం : డి.వి.ఆర్. మూర్తి

H H H

## అతి తెలివి

మనిషి కూర్చొన్నా, నించున్నా ఏవో పనికిమాలిన ఆలోచనలు చేస్తూనే ఉంటాడు. వాటికి ఒక సక్రమమైన దిశను ఈయటానికి బదులు కుతర్కాలతో, మస్తిష్క సామర్థ్యాన్ని నశింపచేసి కొంటున్నాడు.

సృష్టికర్త సృష్టినిర్మాణాన్ని ప్రారంభించినపుడు అతని లోటుపాట్లను తెలియజేయటానికి ఒక ఆలోచనా పరుని సహకారం అవసరమైంది. తక్షణం అటువంటి వ్యక్తిని సృష్టించి, దగ్గర ఉంచుకొన్నాడు. అతడు సృష్టికర్త ప్రతి పనిలోను ఏదో ఒక లోటుని వెదికి చూపుతూ, నిలదీస్తూ ఉండేవాడు. చివరకు బ్రహ్మ విసిగిపోయి - నిన్ను సృష్టించటంలో నేను చేసిన పొరపాటేమిటో చెప్పమని ప్రశ్నించాడు. దానికి అతడు - మీరు నా మస్తిష్కంలో ఒక కిటికీని నిర్మించి ఉంటే దానిద్వారా నేను చెప్పేదానికి, ఆలోచించే వాటికి మధ్య గల వ్యత్యాసాన్ని గమనించగల్గి ఉండేవారు. అది చేయకపోవటమే మీ పెద్ద పొరపాటని బదులు పలికాడు. బ్రహ్మ హైరానపడి అతనిని వదిలించుకోటానికి మార్గం తోచక శంకరునికి ఒప్పగించాడు. శంకరుడు వీరభద్రుని పిలిచి గణాలతో కలిపి ఇతనికి క్రమశిక్షణతో కూడిన శిక్షణను ఈయమని ఆజ్ఞాపించాడు.

తామేదో పెద్ద తెలివైనవారమని భావించేవారంతా అతి తెలివితో కూడిన దుష్ట చింతనలవల్ల తాము ఎక్కిన కొమ్మను తామే నరుక్కొన్న పరిస్థితిని తెచ్చుకొంటారు.

- ప్రజ్ఞాపురాణం నుండి

**జ్ఞానాన్ని మించిన పెట్టుబడి లేదు.**

సమాజ నిర్మాణం

# యుగ సమస్యలకు పరిష్కారాలు - మన కర్తవ్యం

**రాజకీయ పతనం :-** నేటి భయంకర పరిస్థితులలో రాజనీతి రాజ అనీతికి బలైపోయింది. సమాజాన్ని కులం, మతం, సంప్రదాయం, ప్రాంతం, వర్గం ఆధారాలుగా సమాజాన్ని చీల్చి తన పబ్బం గడుపుకుంటోంది. సజ్జనులు రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఫలితంగా - కులపరమైన హింస, మతోన్మాదం, గూండా రాజ్యం, మాఫియా రాజ్యం, దోపిడీ, సామూహిక నరసంహారంవంటి దుర్మార్గాలను జాతి మొత్తం భరించవలసివస్తోంది. విదేశీ శక్తులకూ, బహుళజాతి సంస్థలకూ దేశాన్ని దోచుకునే అవకాశం కల్పించి, అందుకు ప్రతిఫలంగా తమ జేబులు నింపుకుంటూన్న రాజకీయ నాయకులను మనం చూస్తూనే ఉన్నాం. ప్రజాప్రతినిధులు పలువురు అవినీతి ఊబిలో పీకలవరకు కూరుకుపోయి ఉన్నారు. బహుళజాతి సంస్థల, బడా వాణిజ్య సంస్థల చేతుల్లో ఆర్థిక వ్యవస్థ చిక్కుకుని ఉన్నది. మన చిన్నతరహా పరిశ్రమలు సర్వనాశనం అవుతున్నాయి. ఫలితంగా నిరుద్యోగం పెరుగుతోంది. యాంత్రీకరణవల్ల మనిషి ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయి.

**విద్యావిధానంలో వికృతి :-** సాంకేతిక పరిజ్ఞానం లోపించిన నేటి విద్యా వ్యవస్థలో తయారవుతూన్న నవతరంవారు గుమాస్తా ఉద్యోగాలకు తప్ప మరెందుకూ పనికిరాకుండా పోతున్నారు. వీళ్లు శారీరక శ్రమకు పనికిరారు. చదువులో, పరీక్షలలో మునిగిపోయిన వీరికి శరీర వ్యాయామానికి తీరిక ఉండడం లేదు. అంతే కాదు. శారీరక శ్రమ చేసేవారు అల్పులనీ, శారీరక శ్రమ చేయనివారు అధికులనే ఒక అభిప్రాయం సమాజంలో వ్యాపించి ఉంది. ఇది నవతరం మనస్తత్వాన్ని దెబ్బతీస్తోంది. ఈ అభిప్రాయం సోమిరితనాన్నీ, కష్టపడకుండా డబ్బు రావాలనే భావాన్నీ, పని ఎగవేత ధోరణినీ పెంచుతోంది. ఫలితంగా అరాచక వాతావరణం సమాజంలో వ్యాపిస్తోంది. రాజకీయవాదులూ, ప్రభుత్వాధికారులూ, ప్రభుత్వోద్యోగులూ, వ్యాపారస్థులూ, పారిశ్రామిక వేత్తలూ, శ్రామిక వర్గమూ, సమాన్య వ్యక్తులూ ఈ మనస్తత్వానికి లోనయిపోతున్నారు. అంతటా అశాంతి, భయం, దోపిడీ, దగా, మోసం, అపనమ్మకాలతో నిండిన వాతావరణం వ్యాపిస్తోంది. చట్టం, పోలీసు శాఖ ఆశించిన ఫలితాలను సాధించలేకపోతున్నాయి. ఎందుకంటే - మన విద్యా విధానం వ్యక్తి సమగ్ర వికాసానికి దోహదం చేయలేకపోతోంది.

**భోగవాద సిద్ధాంతం :-** భోగవాద సిద్ధాంతం మన కళారంగాన్ని తన విస్తరణకు సాధనంగా వాడుకుంటోది. సినిమా, టివిల ద్వారా దుష్ట ప్రవృత్తులను రెచ్చగొడుతోంది ఆ సిద్ధాంతం. లూటీలూ, హత్యలు బలాత్కారాలు, దొంగతనాలు, బందిపోట్లు, జేబు దొంగతనాలు, ముఠా కక్షలు, అపహరణలు, దగా, మోసం, దౌర్జన్యకాండ, ఫ్యాషన్ వంటివాటిని ప్రదర్శించే సినిమాలు, నాటకాలు, సీరియల్‌లు నవతారాన్ని భోగవాదంవైపు మళ్లిస్తున్నాయి. 'సాదా జీవితం, ఉదాత్త ఆలోచన' అన్న సిద్ధాంతం గ్రంథాలలో ఒక అందమైన సూక్తిగా నేడు మిగిలిపోయింది. ఈ ఆదర్శం జీవితంలో ఎక్కడా కానరావడం లేదు. మరోప్రక్క భోగవాద సంస్కృతి సమాజాన్ని బాహ్య ఆడంబరాల పరుగులోకి నెట్టివేస్తోంది. ఫలితంగా- పెళ్లిళ్లలో ఆడంబరాలకు డబ్బును మంచినీళ్లలా ఖర్చు చేస్తున్నారు. భారీ విందులు, శ్రాద్ధ భోజనాలు, గ్రుడ్డి నమ్మకాలు, దురాచారాలు సమాజాన్ని దొలిచివేస్తున్నాయి. జాతి లోపల లోపల క్రుంగి కృశిస్తూ, పైకి నవ్వులు పులుముకుంటూ ఆత్మవంచన చేసుకుంటోంది. వాస్తు శాస్త్రాన్ని మన అవసరాలకు, ఆరోగ్యానికి, సౌకర్యాలకు అనుగూణంగా కాక గొప్పకోసం, ఆధునికలుగా చెలామణీ కావడం కోసం నేడు భవన నిర్మాణం జరుగుతోంది. ఇలాంటి భవనాలలో పరిశుభ్రమాన గాలీ, వెలుతురూ, ఎండా సహజంగా వచ్చే ఏర్పాటు ఉండడం అంతా కృత్రిమత్వమే. అలాంటి భవనాలలో నివసించేవారు రోగాల పాలయి, మందులకు బానిసలై రోజులు భారంగా వెళ్ల దీస్తూ ఉంటారు. అక్కడ సుఖము ఉండదు శాంతీ ఉండదు. కుటుంబాలలో స్నేహం, సౌజన్యం, శ్రద్ధ, విశ్వాసం అడుగంటి పోతున్నాయి. ఇలాంటి వాతావరణంలో పెరిగే పిల్లలు విచ్చలవిడిగా, అహంకారులుగా, విలాసవంతులుగా తయారవుతున్నారు. కుటుంబాన్నీ, జాతినీ ఇబ్బంది పెడుతున్నారు. ఇలాంటి సంతానంవల్ల తల్లిదండ్రులు నరకయాతన అనుభవిస్తున్నారు. అయినా, సంతాన వ్యామోహంలో పడి వారికి మంచి చెడ్డలను గుర్తించడం లేదు. కూర్చుని తిన్నా

**ధర్మం నమ్మేది కాదు-ఆచరించేది, అన్వయించుకునేది.**

ఏడు తరాలవరకు సరిపడే ఆస్తిపాస్తులు కూడబెడుతున్నారు. వారిని సోమరిపోతులుగా తయారుచేసి వారి జీవితాలను నాశనం చేస్తున్నారు.

**ప్రకృతిని కొల్లగొట్టే 'అభివృద్ధి' :-** పకృతి మనకు మాత. మన ప్రస్తుత అభివృద్ధి ప్రక్రియ అంతా ప్రకృతిని నాశనం చేయడంపై ఆధారపడింది. మన ఖరీదైన ఫర్నిచర్, డబుల్‌కాట్‌లు, డ్రెస్సింగ్ టేబుల్‌లు, డైనింగ్ టేబుల్‌లు, సోఫాసెట్‌లు, బీరువాలు - ఇవన్నీ మన సంపదను నాశనం చేయడం ద్వారా తయారైనవే. రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండిషనింగ్, ఫోమ్, థర్మోకోల్, రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు - వీటన్నిటినుండి వెలువడే విషవాయువులు పృథివికి రక్షా కవచంగా ఉన్న ఓజోన్ పొరను నాశనం చేస్తున్నాయి. ఓజోన్ పొర చిల్లుపడుతోంది. ఫలితంగా ప్రమాదకరమైన సూర్యకిరణాలు సరాసరి పృథివిమీద పడుతున్నాయి. ఫలితంగా పెను తుఫానులు వస్తాయి. అపార నష్టం కలిగిస్తాయి.

మెరుస్తూన్న కార్లు, బస్సులు, మోటారు సైకిళ్ళు, ఇతర ప్రయాణ సాధనాలు, కర్మాగారాలు - వీటన్నిటి నుండి వెలువడే పొగలు, జనరేటర్ సెట్ నుండి వెలువడే పొగ, రొద, విమానాలనుండి వెలువడే వాయువులు, ధ్వనులు, బీడీలు, సిగరెట్లు, అగ్గిపుల్లలు వెలిగించడంవల్ల వెలువడే నికోటిన్‌తో విషవాయువులు, అణుశక్తి కేంద్రాలనుండి వెలువడే అణుధార్మిక కణాలు వాతావరణం మొత్తాన్ని కలుషితం చేస్తున్నాయి. ఆమ్ల వర్షాలు కురుస్తున్నాయి. ఫలితంగా - భూములు బంజర్లుగా మారుతున్నాయి. దుర్లభములు, ఉపయేగకరములు అయిన దివ్య వనస్పతులు నాశనం అవుతున్నాయి. వృక్షాలకు కొత్త కొత్త రోగాలు వస్తున్నాయి. చిత్ర విచిత్రమైన సూక్ష్మక్రియులు పుట్టుకువస్తున్నాయి. సంద్రచెట్లు ఎండిపోతున్నాయి. రాజస్థాన్‌కు కల్పవృక్షం అయిన జమ్మిచెట్టు నశించిపోతోంది. ఔషధపు మొక్కలు, వనమూలికలు నామరూపాలు లేకుండా పోతున్నాయి. కలుషితమైన గడ్డి తిని చనిపోయిన పశువుల కలుషిత మాంసం తినడంవల్ల పక్షి జాతులు నశిస్తున్నాయి. జటాయువు సంతతి అయిన గ్రద్ద ఇప్పుడు ఆకాశంలో కానరావడం లేదు. కొద్ది సంవత్సరాల క్రితం గ్రద్దల గుంపులు ఆకాశంలో ఎగురుతూ ఉండేవి గ్రద్ద దాన్ని తినివేస్తుంది. ఫలితంగా చెడు వాసన వ్యాపించదు. ఈ గ్రద్దలు నశించడంవల్ల చనిపోయిన పశువులు కుళ్లిపోయి దుర్గంథం వ్యాపిస్తోంది.

**మత్తు పదార్థాల వ్యాప్తి :-** పైన చెప్పిన కారణాలవల్ల మనిషి మానసిక ఉద్రిక్తతలలో మునిగిపోతున్నాడు. ఈ బలహీనతను వాడుకుని విదేశీ శక్తులూ, అధిక లాభాలు సంపాదించాలనే ప్రలోభంలో పడ్డ వ్యక్తులు నైతిక విలువలకు నీళ్లు వదిలి సమాజంలో మత్తు పదార్థాలను నింపుతున్నారు. మద్యం, సిగిరెట్, నల్లమందు, గంజాయి, భంగు, బీడి, కారా, టీ, కాఫీ, గుట్కా, పాన్‌మసాలా, శీతల పానీయాల వాడకం పెరిగిపోయింది. దురదృష్టం ఏమంటే - ఇదంతా అధికార యంత్రాంగం సంరక్షణలో సాగుతోంది. చట్టం దీనికి రక్షణ ఇస్తోంది. ఇందువల్ల ప్రజల ఆరోగ్యం, మానసిక బౌద్ధిక సామర్థ్యం దెబ్బతింటున్నాయి. ఈ మాదక ద్రవ్యాలు ప్రజల ఆదాయాన్ని హరించివేసి, వారిని రోగంలో, దుఃఖంలో, పతనంలో, పరాభవంలో ముంచుతున్నాయి.

**వాణిజ్య ప్రకటనల మాయాజాలం :-** నేడు ఫాస్ట్ ఫుడ్‌ల పేరిట ఆహార పదార్థాలలో ప్రమాదకరమైన రసాయనాలు కలుపుతున్నారు. శీతల పానీయాలలో విషాక్తమైన రసాయనాలు కలసి ఉంటున్నాయి. వీటిలో శరీరానికి పోషణ ఇచ్చే వస్తువులేవీ ఉండవు. అయినా, వాణిజ్య ప్రకటనస మాయాజాలంలో చిక్కుకుని మనం చెమటోడ్చి సంపాదించిన డబ్బు ఖర్చుచేసి వీటిని కొని అకాల మరణాన్ని ఆహ్వానిస్తున్నాం. నేడు ఆహార పదార్థాలను నిల్వ ఉంచడానికీ, వాటి రుచి పెంచడానికీ, అవి అందంగా కనపడేటట్లు చేయడానికీ, వాటినుంచి సువాసన రావడానికీ కృత్రిమ రసాయనాలను వాడుతున్నారు. వినియోగదారులను మభ్యపెట్టడానికి మత్తు పదార్థాలను వాడుతున్నారు. తాజా పండ్లు, కూరగాయలు, పాలు, పెరుగు వంటి ఆహార పదార్థాలు వాడకాన్ని నిరుత్సాహపరుస్తున్నారు. ఫలితంగా శరీరంలో ముఖ్యమైన అవయవాలు దెబ్బతింటున్నాయి. మొట్టమొదట జీర్ణకోశం చెడిపోతుంది. జీర్ణక్రియ దెబ్బతిని కొత్తరక్తం పట్టడానికి ఆటంకం ఏర్పడుతుంది. శరీరం పాలిపోతుంది. అసాధ్య రోగాలకు నిలయం అవుతుంది. ఆతర్వాత నాడీమండలం దెబ్బతింటుంది. ఎందుకంటే - ప్రమాదకరమైన ఈ రసాయనాల ప్రభావంనుండి తప్పించుకోవడానికై శరీరం వీటిని వెంటనే బయటికి పంపివేస్తుంది. ఇందువల్ల మూత్రపిండాలకు పనిలేకుండా పోతుంది. మనకు మృత్యువు సమీపిస్తుంది. పెయిన్ కిల్లర్ (నొప్పిని తెలియకుండా చేసే మందులు)లు, కృత్రిమ శీతల పానీయాలు మూత్రపిండాలు

**మనసును క్షాళన చేసుకోవడం ఒక తపస్సు.**

చెడిపోవడంలో ప్రముఖ పాత్ర వహిస్తాయి.

శారీరిక బలహీనతను తొలగించడం కోసం, మందులపేరిట, టానిక్‌ల పేరిట, ఆహార పదార్థాల పేరిట వచ్చే వాణిజ్య ప్రకటనల మాయాజాలంలో చిక్కుకుని బలంకోసం జనం వెదుకుతారు. నిస్తేజమైన శరీరాన్ని, దిగాలుపడిన ముఖాన్ని అందంగా కనిపింపజేయడానికి సౌందర్య సాధనాల వాణిజ్య ప్రకటనలను నమ్మి జనం మోసపోతున్నారు. ప్రకృతికీ, ప్రకృతి సంపదకూ దూరమై, వాణిజ్య ప్రకటనల వలలో చిక్కుకుని జనం డబ్బుపోసి రోగాలు కొనుక్కుంటున్నారు. కొరతలతో సతమతమవుతూ, ఎడుస్తూ, అడ్డదారులు పట్టి డబ్బు సంపాదించాలని జనం ప్రయత్నిస్తున్నారు. అయినా మనం నాగరికులమనీ, అభివృద్ధి పొందుతున్నామనీ గొప్పలు చెప్పుకుంటున్నాం.

**విషమిస్తూన్న ఆరోగ్య సమస్య :-** విషాక్తమైన రసాయనాలతో తయారైన ఆహారాన్నీ, నీటినీ, గాలినీ వినియోగించి బ్రతుకుతూన్న మనం ఆరోగ్యప్రదమైన జీవితాన్ని ఊహించగలమా? ఆరోగ్యం మనకు వెయ్యి ఆమడల దూరంలో ఉంది. వ్యక్తి రోగాలమధ్య పుట్టుతున్నాడు. రోగాలమధ్య మందులు తింటూ త్రాగుతూ పెరుగుతున్నాడు. వార్ధక్యానికి ముందే అకాల మరణం పాలవుతున్నాడు. ఇదీ ఈనాటి అభివృద్ధి కథ. సభ్య సమాజంగా పరిగణించబడుతూన్న సమాజపు పతనానికి సాక్షి ఇది. నేడు హెచ్చుమంది మలబద్ధం, గ్యాస్, నడుం నొప్పి, తలనొప్పి, రక్తపు పోటు, గుండె జబ్బు, మధుమేహం, బ్రెయిన్ హెమరేజ్, ఎసిడిటీ, కీళ్ళవాతం, నిద్రపట్టక పోవడం వంటి అనేక శారీరిక, మానసిక రోగాలతో బాధపడుతున్నారు. ఈ రోగాలు జీవితంలో అంతర్భాగాలు అయిపోయాయి. మనిషి మందులకు బానిస అయిపోయినాడు. ధనాన్నీ, జీవితాన్ని నాశనం చేసుకుంటున్నాడు. అతడికి ఆశారేఖ ఎక్కడా కానరావడం లేదు.

**విలువను కబళిస్తూన్న మార్కెట్ సంస్కృతి :-** శాస్త్ర విజ్ఞానం మనిషికి అందించిన అభివృద్ధి ప్రక్రియలన్నీ ఆర్థిక వ్యవస్థ అనే కేంద్ర బిందువుచుట్టూ తిరుగుతున్నాయి. ఈ అభివృద్ధిని పొందేందుకు సాధనం వినియోగదారు, కనుక అన్ని వ్యవస్థలూ అతడిని నిర్మించడానికి నడుం కట్టాయి. ఈ వ్యవస్థలు అన్నింటికీ కూడలి మార్కెట్. ఈ మార్కెట్‌ను స్వంతం చేసుకోవడానికే జరుగుతున్నాయి - అంతర్యుద్ధాలు, ప్రచ్ఛన్న యుద్ధాలు - దీని ఫలితాలే ఉగ్రవాదం, నక్సలైట్ హింసాకాండ, దౌర్జన్యవాదం, దీని ఫలితాలే ప్రపంచంలో అశాంతి, ప్రగతికి నిరోధం, పర్యావరణ సమతూకం దెబ్బతినడం. నేడు మనం మన సహజ స్వభావాన్ని, పర్యావరణాన్ని, జీవన విలువలను విస్మరించాము. మిథ్య సభ్యత ముసుగు ధరించి, కారు చీకటిలో మ్రగ్గుతూ, మనం మన జీవితాన్ని, జీవన విలువలను పీక నులిమివేసి, ప్రకృతి అంతటితో పాటు సామూహిక ఆత్మహత్య వైపు పరుగులు తీస్తున్నాము.

**భారతీయ సంస్కృతికి గొడ్డలిపెట్టు :-** నేడు సమాజం సంకుచితత్వం అనే చక్రవ్యూహంలో చిక్కుకున్నది. "వసుధైవ కుటుంబకమ్" అని ప్రబోధించే మన ధర్మ సంస్కృతులలోని సిద్ధాంతాన్ని వదులుకుంటున్నాం. "విశ్వమంతా ఒకే కుటుంబం" అనే శంఖారవం మనది. "విశ్వం మనదే, ధరిత్రి మనదే, మనమీ ధరిత్రి సంతానం, ఈ భూమిని దివిగా మార్చుదాం" - అనే ఉదాత్త భావన మన మనసులో, మన హృదయపులోతులలో మన నరనరంలో పొందిపొరలేది.

ఆనాడు ప్రపంచంలోని ప్రతి సంస్కృతికి చెందిన వ్యక్తీ మన సంస్కృతి అనే పరుసవేదిని తాకి స్వర్ణమయం అవుతూవచ్చాడు. శ్రేష్ఠుడు అవుతూవచ్చాడు. ప్రపంచంలోని ధర్మ సంస్కృతుల నదులు భారతీయ సంస్కృతీ మహాసముద్రంలో కలసిపోతూవచ్చాయి. ప్రపంచం ఈ దేశ ప్రజలను 33 కోట్ల దేవతలుగా కొలిచింది. త్యాగులు, తాపసులు అయిన ఇక్కడి మహర్షులు జ్ఞాన విజ్ఞానాల పరిశోధనద్వారా, శిక్షణద్వారా ఈ దేశాన్ని జగద్గురు పీఠంపై ప్రతిష్ఠించారు. జీవన విలువలతో నిండిన శిక్షణ వ్యవస్థ ఆధారంగా జాతిని ఆర్థికరంగంలో స్వర్ణభూమిగా తీర్చిదిద్దారు.

రెండువందల సంవత్సరాల పూర్వం ఈ దేశంలో దొంగతనం, అబద్ధం, మోసం, సోమరితనం, అప్పనంగా ఏదో వస్తుందని ఆశపడటంవంటి దుర్గుణాలు ఆలోచనలలో కయినా వచ్చేవి కావు. మరి ఈ రెండువందల సంవత్సరాలలో ఈ చెడు లక్షణాలు సమాజానికి జీవన విలువలుగా ఎలా తయారైనాయి? జవాబు స్పష్టమే. భారతీయ సంస్కృతిలోని సమగ్ర విద్యా విధానాన్ని వదులుకోవడం, రాజకీయరంగంలో, మత రంగంలో, సామాజిక సంస్థలలో, ఉద్యోగుల సంఘాలలో, కుటుంబ వ్యవస్థలో - అంతటా పచ్చి స్వార్థమే రాజమేలుతోంది.

**సాధన అంటే- కష్టాలతో పోరాడుతూ సత్కర్మను కొనసాగించడం.**

"పరోపకారాన్ని మించిన ధర్మ సూత్రం లేదు" అనే సూక్తి పాటలలోనే ఉండిపోయింది. ఆస్తికులకు వినోద సాధనంగా మిగిలిపోయింది. పురాణ ప్రవచనాల పేరిట, నామ సంకీర్తనల పేరిట సినిమా పాటల నకళ్లు, పిట్ట కథలు, చమత్కారాలు, హాస్య వినోదాలు, చిహ్న పూజ, చరిత్రలో పాతిపెట్టబడిన శవాలను వెలికితీయడం ప్రాచుర్యం పొందుతున్నాయి. కానీ, ప్రస్తుత సమస్యల పరిష్కారాలను గురించిన విశ్లేషణ ఎక్కడా జరగడం లేదు. మత వేదికలపై చెప్పబడే సిద్ధాంతాలు సమాజంలోని పురుషార్థపరాయణత్వాన్నీ, కార్యశూరతనూ నిర్వీర్యం చేస్తున్నాయి. దురాచారంతో పోరాడే సామర్థ్యాన్ని వమ్ము చేస్తున్నాయి. ఫలితంగా దురాచారం అడ్డూఆదుపూ లేకుండా పెచ్చుపెరిగి పోతోంది. అంతటా భయాందోళనలు రాజ్యమేలుతున్నాయి. సమాజం అంతాట విస్తరించిన దోపిడీకి బలి అవుతున్నది. ఆరిథకంగా బలహీనపడుతున్నది.

భారతీయ సమాజంలో 'సాదా జీవితం, ఉదాత్త భావన' అనే సిద్ధాంతం అములుజరుగుతూ వచ్చింది. ప్రకృతిని మాతగా పూజించే తత్వం మన నరనరాల్లో జీర్ణించి ఉండేది. ప్రకృతిని నాశనం చేయడం ద్వారాకాక దాని సహకారంద్వారా, దాని వరాలను అందుకోవడం ద్వారా జీవితాన్ని సాగించే సంప్రదాయ్ ఉండేది. భోగంకాక త్యాగం జీవితానికి ఆదర్శంగా నిలచి ఉండేది. భోగపరాయణత్వంకాక ప్రకృతి వనరులను సద్వినియోగం చేసుకోవడం జీవన దృక్పథంగా ఉండేది.

అయితే, పాశ్చాత్యదేశాలలో జరిగిన పారిశ్రామిక విప్లవం ఫలితంగా భారీయెత్తున తయారైన ఉత్పత్తులను అమ్మి అధిక ధనం సంపాదించడం కొత్త ఆర్థిక విధానానికి మూలాధారం అయింది. ఇందుకోసం మార్కెట్లు నిర్మాణం జరిగింది. వాణిజ్య ప్రకటనల మాయాజాలంతో సమాజాన్ని బందీని చేసి, సమాజంలో కృతిమ అవసరాలను పెంచడం, ఆ అవసరాలను తీర్చే ఉత్పత్తుల అమ్మి సొమ్ము చేసుకోవడం ఈ మార్కెట్ల లక్ష్యంగా తయారయింది. ఈ విధానాలవల్ల కంపెనీల మార్కెట్లను విస్తరించాయి. కృత్రిమ ఉత్పత్తుల ప్రాబల్యం ప్రాచుర్యం పెరిగాయి. ఫలితంగా మనం ప్రాకృతిక జీవన విధానాన్ని విస్తరించాం. ఖర్చులు పెరిగియా. ఆదాయాలు తగ్గాయి. ఫలితంగా దారిద్ర్యం పెరిగింది. నిరుద్యోగం పెరిగింది. ఈ వాతావరణంలో ఆక్రోశం, విశృంఖలత్వం, విచ్చలవిడితనం, అనాచారం, విద్వేషం పెచ్చుపెరిగాయి. ఈ పరిణామం ఉగ్రవాదానికీ, విధ్వంసకాండకూ జన్మ నిచ్చింది.

ఈ సమస్యల పరిష్కారానికై మనం జన చైతన్యాన్ని మేలుకొలపాలి. భారతీయ సంస్కృతిలోని ఆదర్శాలపై, సిద్ధాంతాలపై ఆధారపడిన జీవన విధానమే మానవాళికి సుఖ సంతోషాలను ప్రదానం చేస్తుందని వ్యక్తి వ్యక్తికీ తెలియజెప్పాలి. మనం తిరిగి ప్రకృతివైపు మళ్లవలసి ఉంది. ప్రాకృతిక ఆహార విహారాలు మనల్ని ఆరోగ్యంగా, సుఖంగా ఉంచుతాయి. ప్రాకృతిక ఆచరణలూ ఆలోచనలూ మనకు సంతోషాన్నీ, శాంతినీ ప్రసాదిస్తాయి. పాశ్చాత్య సంస్కృతి భారతీయ జీవన విధానానికి అనుగుణం కాదు. ధర్మం ఆధారంగా, ధర్మ ఆదర్శంగా మన ప్రజాశిక్షణ కార్యాన్ని నిర్వహించాలి. ఇందుకోసం ధర్మానికి విశ్వజనీనమైన, ప్రపంచమంతటికీ వర్తించే స్వరూపాన్ని కల్పించడం అవసరం. సంప్రదాయాలు వేర్పాటును సృష్టిస్తాయి. 'సాదా జీవితం, ఉదాత్త భావన' అనే సిద్ధాంతాన్ని జీవితంలో ఆచరించి చూపాలి. ధనికులు మాత్రమే సేవ చేయగలుగుతారనే భ్రమను సామాన్య ప్రజల మనస్సులనుండి తొలగించాలి.

**పరివర్తకు ప్రాతిపదిక :–** నేటి పరిస్థితి వంటి విషమ పరిస్థితులలో మనిషి నిస్సహాయుడు అయిపోతాడు. సమాజం మొత్తం నిరాశా నిస్పృహలలో మునిగిపోతుంది. ఇదంతా మన దురదృష్టం అనుకుని మనిషి కార్యశూరతను కోల్పోతాడు. ఈ విషమ పరిస్థితిలో ఎవరో దేవ మానవులు ప్రబలమైన ఒక సిద్ధాంతం రూపంలో, భావతరంగం రూపంలో ఈశ్వరీయ చేతన వ్యక్తం అవుతుంది. ఈ ఈశ్వరీయ చేతన ప్రచండమైన ఆత్మవిశ్వాసంతో, ప్రచండమైన తపోబలంతో విజృంభిస్తుంది. చూస్తూ ఉండగానే సమస్య లన్నింటికీ పరిష్కారాన్ని చూపుతుంది. ఆ మహామానవులు క్రియాశీలురుగా ఉంటారు. ఒంటరిగా ముందుకు సాగుతారు. దానికి అనుగుణంగా పడుగూ పేకా అల్లుకుంటూ పోతాయి. ఇది ఎలా జరిగిందని జనం ఆశ్చర్యపోతారు. అయితే అది దైవీ చేతన చేస్తూన్న పని. కనుకనే జరిగిపోతుంది. ఈ దేవీ చేతన మొదటి దశలో దేవమానవులలోనే వ్యక్తమవుతుంది. వారే దీనిని అర్థం చేసుకోగలుగుతారు. వారే తమ సర్వస్వాన్నీ బలిదానం చేసి పరమాత్మ కృపకు పాత్రులు అవుతారు. ఆత్మసంతృప్తితో జీవిస్తారు. కీర్తి స్తంభంగా నిలచి ప్రపంచానికి ప్రేరణ ఇస్తారు.

**అశా కిరణం :–** ఈవిధంగా చీకటి చీల్చుతూ ఒక కాంతి పుంజం

**ఆత్మ నిర్మాణమే అదృష్ట నిర్మాణం.**

వెలికివచ్చింది. అది తన ఈ గత వాగ్దానాన్ని తిరిగి చేసింది -

**యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత ।**
**అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహం ॥**

అనగా -

**ఎప్పుడెపుడు ధర్మానికి గ్లాని జరుగుతుందో అధర్మం ప్రబలుతుందే అప్పుడప్పుడు నేను అవతరిస్తాను.**

ఆయన వాగ్దానం చేశారు - వినాశనాన్ని సృజనగా మార్చుతానని. తలక్రిందులు అయినదానిని తలక్రిందులు చేసి సవ్యంగా సక్రమంగా నిలిపి ఉంచుతానని.

వినాశనం కాక సృజన మన భవిష్యవిధానం. 21వ శతాబ్దం ఉజ్వల భవిష్యత్తును వెంటతీసుకువస్తోంది. విశ్వమంతా ఒకే జాతి అవుతుంది. ఒకే సంస్కృతి నిర్మాణం అవుతుంది.

ఇలాంటి సత్తా రూపంలో వ్యక్తం అయినారు. యుగఋషి వేదమూర్తి తపోనిష్ఠ పండిత శ్రీరామశర్మ ఆచార్య, వందనీయ మాతా భగవతీ దేవి శర్మలు. వారు యుగనిర్మాణ యోజన ద్వారా సమాజానికి ఒక కొత్త దారి చూపారు. వారు ప్రకటించారు-'భారతీయ సంస్కృతి శంఖారావం వసుధైవ కుటుంబం' అని. జీవితంలో ఈ దర్శనం అన్వయించడం అంతఃజాగరణ ద్వారా లోపలి మేలుకొలుపు ద్వారా జరుగుతుంది. ఈ జాగరణకు మూలాధారాలు రెండు. భారతీయ సంస్కృతికి తల్లితండ్రులుగా చెప్పబడిన గాయత్రి యజ్ఞం.

గాయత్రీ మంత్రం మనిషిని బ్రహ్మపరాయణుడుగా చేస్తుంది. శ్రేష్ఠుడుగా చేస్తుంది. గాయత్రీ సద్బుద్ధి, సత్ప్రేరణ. కనుక అది వేదమాత, జ్ఞానమాత. అది దేవత్వాన్ని ఇస్తుంది. ప్రపంచానికి ఇచ్చే సామర్థ్యాన్ని ఇస్తుంది. కనుక అది దేవమాత. అది ప్రపంచమంతటికీ కళ్యాణాన్ని అందిస్తుంది. కనుక అది విశ్వమాత.

యజ్ఞం మనిషిని ఋషిని చేస్తుంది. తేజస్విని చేస్తుంది. పాపాలను నాశనం చేస్తుంది. సదుపయోగాన్ని నేర్పుతుంది. సత్ కర్మలు చేయిస్తుంది. సృష్టిని పోషిస్తుంది. ప్రకృతిలోని సమతూకాన్ని నిలిపి ఉంచుతుంది. కనుక అది తండ్రి.

**మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి :-**

1. మానవాళి పట్ల మనకు ఏదైనా కర్తవ్యం ఉన్నదా?
2. మనం ప్రపంచానికి కొంత సేవ చేద్దామా?
3. మానవ సేవకై మనం ఏదైనా సిద్ధాంతాన్ని రూపొందించామా, స్వీకరించామా?

**అయితే నేటినుండీ, ఇప్పటినుండీ :-**

1. మీ జీవితంలో నిరాడంబరత్వాన్ని అవలంబించండి. సంయమనంతో, త్యాగంతో కూడిన జీవితాన్ని గడపండి. సదా జీవితాన్ని అనుసరించగానే ఉదాత్త భావాలు వాటికవిగా మీలో ఉదయిస్తాయి. మానవాళికి అన్నిటినీ మించిన సేవ ఇది.
2. సమయదానం ఇచ్చి, అంశదానం ఇచ్చి జ్ఞానదాన కార్యక్రమంలో పాల్గొనండి. అన్ని దానాలలో జ్ఞానదానం గొప్పది. ఎందుకంటే - జ్ఞానం జీవితంలోని అన్ని సమస్యలకూ పరిష్కారం చూపుతుంది. ఇతర దానాల ఫలితం ఇతర జీవులకుకూడ అందవచ్చు. కానీ, జ్ఞానదాన ఫలితం మనిషికి తప్ప ఇతర జీవులకు అందదు. కనుక, జ్ఞానదానం చేసేవారు తర్వాతి జన్మలో మానవులుగా పుట్టడం ఖాయం.

**సమయదానం :-**

1. కనీసం రెండు గంటలు సమయ దానం ఇవ్వాలి.
2. యుగ సాహిత్య స్వాధ్యాయం 45 నిమిషాలు దానిపై చింతన, మననం 15 నిమిషాలు సమాజాన్ని సమున్నతం చేసే పని ఒక గంట.
3, ఉదయం ముందుగా నిద్రలేచి, రాత్రి పడుకోబోయే ముందు, భోజనం తర్వాత, విశ్రాంతి సమయంలో, ప్రయాణ సమయంలో స్వాధ్యాయం చేయండి. సమాజ కార్యంకోసం మీ వీలునుబట్టి సమయదానం ఇవ్వండి (రోజూ, వారం వారం, లేక నెల నెలా)

**ఒక గంటలో ఏమి చేయాలి :-** సమాజసేవకు కేటాయించిన గంటలో దిగువ కార్యక్రమాలలో ఏదైనా చేయవచ్చు -

1. గోడలమీద అందంగా, ఆకర్షకంగా ప్రేరణ ఇచ్చే సద్ వాక్యాలు వ్రాయండి.
2. గృహాలలో అందంగా సద్ వాక్యాలు (పోస్టర్లు లేక స్టిక్కర్లు) అమర్చడం.
3. ఇళ్లలో తులసి, తిప్పతీగ, జ్వరాంకుశం వంటి మొక్కలు, కూరగాయలు, పండ్లు, పువ్వుల మొక్కలు, విత్తనాలు లభించేటట్లు చేయడం.

**నీవు పొగడే వ్యక్తి గుణాలను అలవర్చుకో.**

4. సంచీ పుస్తకాల ద్వారా సత్ సాహిత్యాన్ని ఇంటింటికీ అందించడం. ఆయా పుస్తకాలు చదివేందుకు ప్రేరణ ఇవ్వడం.
5. మంచిమంచి ఉపన్యాసాల, పాటల క్యాసెట్లను ఇంటింటికీ అందించడం. ఇళ్లలో గ్రంథాలయాలు ఏర్పరచుకునేందుకు ప్రేరణ ఇవ్వడం.
6. ఆరోగ్య పరీక్ష జరపడం. ఆరోగ్య సమస్యలను పరిష్కరించడం.
7. బాల సంస్కార పాఠశాలలు స్థాపించడం. చిన్న పిల్లలకు ప్రతిరోజూ సాయంత్రం పూట సామూహికంగా మహామానవుల జీవిత చరిత్రలు, కథలు వినిపించడం. వాటిపై ప్రశ్నలు అడగడం. పిల్లల చేత హోమ్ వర్క్ చేయించడం.
8. ఇళ్లలో యజ్ఞాలు, దీప యజ్ఞాలు చేయించడం.
9. రోజూ ఒక గంటసేపు శరీర యోగం, ప్రజ్ఞాయోగం, ధ్యాన యోగం నేర్పడం. సామూహికంగా యోగం చేయించడం.
10. రోజూ సాయంత్రం పూట పేటల వారీగా యువజనుల గోష్ఠి నిర్వహించడం. అందులో చింతన, ఆలోచనా మథనం, సమస్యల పరిష్కారం కోసం చర్చ జరపడం.
11. నిరక్షరాస్యులకు చదువు చెప్పడానికి ఒక గంటసేపు తరగతి నిర్వహించడం. (మహిళలకు మధ్యాహ్నం, పురుషులకు రాత్రి).
12. ఆరోగ్య పరిరక్షణకై యువకులకు, జిజ్ఞాసువులకు ఒక గంటసేపు తరగతి నిర్వహించడం.
13. అగ్నిహోత్ర మహా విజ్ఞానం గ్రంథాన్ని ఇంటింటా స్థాపన చేయడం. అగ్నిహోత్రం నుండి ప్రయోజనం పొందే పద్ధతిని నేర్పడం.
14. జనజాగరణ కోసం ప్రభాత ఫేరీ (ఉదయం ఊరేగింపు) నిర్వహించడం నిర్ణీత సమయానికి గంటసేపు క్యాసెట్లు వినిపించడం తద్వారా అమృతవాణి ప్రసారం.
15. రోజూ విద్యాలయాలకు వెళ్లి పిల్లలకు శ్రేష్ఠ సంస్కారాలను గురించి తెలియపరచడం.
16. గ్రామాలలోని పక్కా గృహాలలో, పేటలలో సత్‌చింతన బోర్డులు ఏర్పరచడం. రోజూ వాటిమీద సద్వాక్యాలు వ్రాయడం.
17. బహిరంగ స్థలాలో మొక్కలు నాటడం, వాటి సంరక్షణకు ఏర్పాటు చేయడం.
18. నిషా విముక్తి కోసమై ప్రత్యేక గోష్ఠులు నిర్వహించడం. మహిళలలో మేలుకొలుపు తేవడం.(తర్కం, వాస్తవాలు, ప్రమాణాల ద్వారా).

**అంశదానం :-** సంపాదనలో ఒక నిర్ణీత భాగాన్ని (కనీసం రోజుకొక రూపాయి) విశ్వ కళ్యాణం కోసం కేటాయించాలి. మన సంస్కృతి, మన విజ్ఞానం బోధించే ప్రక్రియ ఇది. ఈ అంశదానాన్ని జ్ఞానదానానికీ, విద్యాదానానికీ వినియోగించాలి. సత్‌సాహిత్య వితరణలో, గ్రంథాలయ స్థాపనలో, విద్యాదానం చేసే విద్యా సంస్థల నిర్మాణంలో, సత్‌సాహిత్య ప్రచురణలో. ఇది సహజసిద్ధమైన ధార్మిక వ్యవస్థ. అంశదానం చేయకపోతే మీకు ఆత్మగ్లాని కలుగుతుంది. మనస్తాపం కలుగుతుంది. మనస్తాపం కలుగుతుంది. సమాజ ఋణాన్ని తీర్చుకోవడం తప్పనిసరి. మన ధనాన్ని, సాధన సంపత్తినీ జ్ఞానదానం కోసం సమర్పించడం వల్ల మీకు సంతృప్తి కలుగుతుంది. మీ అంతఃకరణలో సంతోషం అనుభవం అవుతుంది. మీరు శారీరకంగా, మానసికంగా, ఆత్మపరంగా ఆరోగ్యంగా ఉంటారు.

**మీకు హార్దిక విజ్ఞప్తి :-** మానవీయ విస్తరణ కోసం మీ స్థలంలో ఇలాంటి శిక్షణ వ్యవస్థ విస్తరణకై మీకు పరమేశ్వరుడు ఇచ్చిన జీవితాన్ని, భూమిని, భవనాలను, సాధనాలను, ధనాన్ని, సమయాన్ని, ప్రతిభను, శ్రమను, జ్ఞానాన్ని అంకితం చేయండి. ఇది నేటి యుగ ధర్మం. విశ్వ మానవులకు ఉత్తమోత్తమ సేవ.

మీరు జాతీయవాదాన్ని అధిగమించి విశ్వమానవతావాదులు కండి. వసుధైవ కుటుంబం అన్నది భారతీయ సంస్కృతికి మూలాధారం. మీరు మతవాదపు అడ్డుగోడలను భేదించండి. ఎందుకంటే మతవాదం సమగ్ర జ్ఞానపు ద్వారాన్ని మూసివేస్తుంది. మానవుని బుద్ధిని ఒక ప్రత్యేక స్థలంలో ఖైదు చేస్తుంది. సమగ్ర వ్యక్తిత్వ నిర్మాణానికి ఇది అవరోధం.

**యుగఋషి నిర్దేశం :-** మానవాళి ఎదుర్కొంటూన్న సమస్యలు అన్నింటికీ శాశ్వత పరిష్కారం పొందాలంటే - భారతీయ సంస్కృతిపై ఆధారపడిన శిక్షణ ప్రక్రియకు విశ్వవ్యాప్తమైన వ్యవస్థను నిర్మించడం తప్పనిసరి. నేడయినా వేయి సంవత్సరాల తర్వాత అయినా ఈ పని జరిగితీరవలసిందే.

HHH

**భక్తి వల్ల ప్రీతి, దయా ప్రవృత్తి బలపడతాయి.**

## నావారితో నామాట- 1

# దేవసంస్కృతి విశ్వవిద్యాలయంలో కొత్తకోర్సులు

నేటి సాధన సంపన్నులకు విభిన్నంగా, తనదైన సాధన సంపత్తితో విలక్షణంగా దేవసంస్కృతి విశ్వవిద్యాలయం రెండు సంవత్సరాల క్రితం ప్రారంభమయింది. సాధన, ఆరోగ్యం, స్వావలంబన, విద్యలు కేంద్రబిందువులుగా వివిధ శాఖలు నిర్మాణం అయినాయి. రెండు సంవత్సరాల యాత్రలో విశ్వవిద్యాలయం సాధించిన సాఫల్యాలు అభినందించతగ్గవి. నవరత్నముల, దేవమానవుల టంకశాలగా, ఉత్పత్తి కేంద్రంగా రూపొందిన విశ్వవిద్యాలయం ఇది. దీని సాఫల్యానికి మూలాధారం పరమపూజనీయ గురుదేవులు, పరమ వందనీయ మాతాజీల శక్తి. వారి సంరక్షణలో జీవన విద్యను ఈ కాంతి కేంద్రం ఉదయించింది. మనమంతా దీనికొక రూపం ఇచ్చాము. కనుక మనం గురువరుల ఆశీస్సులకు పాత్రులము.

విశ్వవిద్యాలయ ప్రథమ స్నాతకోత్సవం జూలై నెలలో జరిగే అవకాశం ఉంది. ఆ ఉత్సవంలో శిక్షణ, విద్యల సార్థక సమన్వయాన్ని జీవితంలో అన్వయించుకున్న పట్టభద్రులకు, పోస్ట్‌గ్రాడ్యుయేట్‌లకు విశిష్ట అతిథుల సమక్షంలో డిగ్రీలు ప్రధానం చేస్తారు. వీరంతా ఆ తర్వాత ప్రజాసేవకుల పాత్ర నిర్వహిస్తారు. తమ కాళ్లమీద నిలబడతారు. జాతి గౌరవాన్ని శిఖరాగ్రానికి చేర్చుతారు. మామూలు విశ్వవిద్యాలయాలలో ఉండే కోర్సులు ఈ విశ్వవిద్యాలయంలో లేకపోవడానికి కారణం ఇదే. విశ్వవిద్యాలయంలో చేరడానికి వచ్చిన విద్యార్థులు తమకు తాముగా వచ్చారు. మంచి ఆదాయం, ప్రతిష్ఠ కలిగిన ఉద్యోగాల పట్ల వ్యామోహాన్ని వదులుకుని వచ్చారు. కనుక ఇక్కడ విద్యాభ్యాసం చేసిన పోస్ట్‌గ్రాడ్యుయేట్‌లు నలంద, తక్షశిల విశ్వవిద్యాలయాల సంప్రదాయాన్ని తిరిగి నిర్మాణం చేస్తారని మనం ఆశిస్తున్నాము.

విశ్వవిద్యాలయంలో ఇంతవరకు 1.యోగం, విజ్ఞానం 2.పర్యటన యాజమాన్యం 3.రోగ నిదాన మనస్తత్వ శాస్త్రం, భారతీయ సంస్కృతి మానవీయ చేతన అనే విషయాలలో ఎమ్.ఎ, ఎమ్.ఎస్.సి కోర్సులు ప్రారంభించారు. వీనిలో మొదటి రెండు కోర్సుల మొదటి బ్యాచ్ ఈ సంవత్సరం డిగ్రీలు అందుకుంటుంది. మూడవ భారతీయ సంస్కృతి కోర్సు గత సంవత్సరం ఆరంభమయింది. దీని మొదటి బ్యాచ్ వచ్చే సంవత్సరం డిగ్రీలు తీసుకుంటుంది. యోగ విజ్ఞానం, ఆంగ్ల భాషలలో ఒక సంవత్సరం పిజి డిప్లొమా కోర్సు గతంలో వలె ఈ సంవత్సరం కూడా నడుస్తుంది. యోగ విజ్ఞానం, సమగ్ర ఆరోగ్య యాజమాన్యం (హోలిస్టిక్ హెల్త్ మేనేజ్‌మెంట్), మత విజ్ఞానం (థియాలజీ) లలో ఆరునెలల సర్టిఫికెట్ కోర్సు గతంలో వలెనే నడుస్తుంది. ఈ సంవత్సరం దిగువ కొత్త కోర్సులు ప్రారంభం అవుతున్నాయి. వాటి వివరాలు-

**1.గ్రామ యాజమాన్య ప్రమాణ పత్రం కోర్సు :-** ఇది ఆరునెలల కోర్సు. గ్రామాలలో కుటీర పరిశ్రమల ప్రారంభం, గోశాల నిర్మాణం, గ్రామాల పారిశుద్ధ్యం, ప్రకృతి ప్రకోపాల సమయంలో సహాయ చర్యలు, గ్రామాల సమగ్ర వికాసం అనే విషయాలను ఈ కోర్సులో నిష్ణాతులైన నిపుణులు బోధిస్తారు. పరమ పూజ్య గురుదేవులు ఒక గ్రామం (ఆవల్ ఖేడా, ఆగ్రా జనపదం, ఉత్తర ప్రదేశ్)లో జన్మించారు. పట్టణాల వికృత బలుపు తగ్గాలని, గ్రామాలలో చక్కగా తీర్చిదిద్ది ఈ అదనపు జనసంఖ్యను అక్కడ నివసింపచేయాలనీ వారు జీవితమంతా వ్రాస్తూ వచ్చారు. సాధనాల కొరత వల్ల ప్రజలు గ్రామాలు వదలి పట్టణాలకు వలస పోతున్నారు. గ్రామాలు కాలనీలుగా, కాలనీలు పట్టణాలుగా, పట్టణాలు మహానగరాలుగా మారిపోతున్నాయి. ఈ ఆరునెలల సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసిన ఇంటర్ విద్యార్థులు గ్రామాలకు వెళ్లి స్వావలంబన వ్యవస్థను నిర్మాణం చేయగలుగుతారు. గ్రామాల సమస్యలను పరిష్కరించ గలుగుతారు. గ్రామాల నుండి యువశక్తి వలసను నిరోధించగలుగుతారు.

అందుకు అవసరమైన సమగ్ర శిక్షణ ఈ కోర్సులో ఇవ్వబడుతుంది. గో విజ్ఞాన సమన్వయం ద్వారా ఔషధాల తయారీ, ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగం, వైదిక వ్యవసాయ సూత్రాలు కూడా వీరికి బోధిస్తారు. మత వ్యవస్థ ద్వారా ప్రజాశిక్షణలో కూడా వీరు నైపుణ్యం సంపాదిస్తారు. ఫలితంగా వీరు గ్రామాలలో సర్వమత సమభావన వాతావరణాన్ని నిర్మించగలుగుతారు. ఈ పాఠ్యక్రమాన్ని

**ప్రతి జీవి తన ఆత్మ సంస్కరణకు తానే బాధ్యుడు.**

అండర్ గ్రాడ్యుయేట్ డిప్లొమా స్థాయికి పెంచే యోజన ఉన్నది.

**2. గృహోపకరణాల మరమ్మత్తు, మైంటెనెన్స్- (కన్స్యూమర్ హోమ్ ఎప్లైయెన్సెస్ అండ్ మైంటినెన్స్) :-** ఈ కోర్సులో మేకింగ్ (వండడం), క్లీనింగ్ (శుభ్రపరచడం), కూలింగ్ (శీతలీకరణ) ఉపకరణాల మరమ్మత్తు, మైంటెనెన్స్ నేర్పుతారు. భారత ప్రభుత్వ కార్మిక మంత్రిత్వ శాఖవారి ఎడ్వాన్స్ ట్రయినింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఎ.టి.ఐ) సహకారంతో ఈ కోర్సును నిర్వహిస్తారు. విశ్వవిద్యాలయం డిగ్రీ లభిస్తుంది. ఇంటర్ (ఫిజిక్స్‌తో) ప్యాసయిన, బి.ఎస్.సి ప్యాసయిన విద్యార్థులు ఈ కోర్సు ద్వారా ఒక అదనపు నైపుణ్యాన్ని పొందగలుగుతారు. స్వయం ఉపాధి కల్పించుకోగలుగుతారు. ఫ్రిజ్, వాటర్‌కూలర్, ఎయిర్‌కూలర్, ఎయిర్‌కండిషనర్, గీజర్, టోస్టర్, మైక్రోవేవ్ ఓవెన్, ఫ్రూట్ ప్రాసెసర్ మున్నగునవి, వాషింగ్ మెషీన్, వాక్యూమ్ క్లీనర్, డిష్ వాషర్ మున్నగు పరికరాల మరమ్మత్తులో శిక్షణ ఇస్తారు. ఈ కోర్సులో అర్హత ఆధారంగా 20మంది విద్యార్థులను చేర్చుకుంటారు. అందరికి ఎంట్రన్స్ పరీక్ష ఉంటుంది. విద్యార్థులు కొంత సమయం గాయత్రీ కుంజ్‌లో, కొంత సమయం డెహ్రాడూన్‌లోని ఇన్‌స్టిట్యూట్‌లో ఉంటారు. గాయత్రీ కుంజ్‌లో క్రొత్తగా కొనుగోలు చేసిన స్థలంలో గ్రామ యాజమాన్యంపై ఒక విరాట్ వ్యవస్థ నిర్మాణం అవుతోంది.

**3.పిజి డిప్లొమా బయోకెమికల్ సిస్టమ్స్ :-** ఇది ఒక కొత్త కోర్సు. డెహ్రాడూన్‌లోని ఎ.టి.ఈ తో కలసి దీన్ని ప్రారంభిస్తున్నారు. బయోమెడికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ మరమ్మత్తు, మెయింటెనెన్స్‌లలో శిక్షణ ఇస్తారు. ఇది సంవత్సరం (52 వారాలు) కోర్సు. దీనిలో డాక్టర్లు, నర్సింగ్‌హోమ్‌లు, పెద్ద పెద్ద ఆసుపత్రులు ఉపయోగించే ఈ.సి.జి డిఫ్రిబెలేటర్‌ల నుండి టెలిమెట్రీ ఈ.ఈ.జి. సీటీ స్కానర్‌ల వంటి అన్ని ఉపకరణాల మరమ్మత్తులో శిక్షణ ఇస్తారు. 20 మంది విద్యార్థులకు అవకాశం ఉంది. బి.ఇ, బి.టెక్ (ఎలెక్ట్రానిక్స్-ఇన్‌స్ట్రుమెంటేషన్ లేక జుఖ।జాఊజా/జుఖ।జా) స్థాయి కలిగిన అర్హులైన విద్యార్థులు ఈ కోర్సుకు దరఖాస్తు చేయవచ్చు. నేడు వివిధ స్థలాలలో పెక్కు యంత్రాలు చెడిపోయి పడి ఉంటున్నాయి. భారత ప్రభుత్వ కార్మిక మంత్రిత్వ శాఖ సహకారంతో ఈ శిక్షణ కార్యక్రమం రూపొందింది. ఇందువల్ల ఉపాధికి కొత్త అవకాశం లభిస్తుంది.

**4.బయో ఇన్ఫర్మేటిక్‌లో పిజి డిప్లొమా :-** జీవశాస్త్ర గణాంకాలపై (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) ఆధారంగా నడిచే ఈ కోర్సు నేడు ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటుంది. సంవత్సరం కోర్సు ఇది. ఉపాధికి చక్కని అవకాశం ఇచ్చే కోర్సు ఇది. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీలలో బి.ఎస్.సి, కంప్యూటర్ శిక్షణ పూర్తయిన విద్యార్థులకు ఈ కోర్సులో ప్రవేశం ఉంటుంది. పెద్దపెద్ద ఫార్మస్యూటికల్ కంపెనీలలో (దేశ విదేశాలలోనివి), ప్రభుత్వ పరిశోధన (ఆర్ & డి) సంస్థలలో, సాఫ్ట్‌వేర్ కంపెనీలలో ఈ కోర్సు చదివిన వారికి మంచి అవకాశాలు ఉంటాయి. కంప్యూటర్లు, గణిత శాస్త్రం, గణాంక శాస్త్రములను జీవశాస్త్ర సూచనలతో సమన్వయం చేసే ప్రక్రియలో శిక్షణ ఇది. ఈ సంవత్సరం కోర్సు చేసిన విద్యార్థికి వెంటనే ఉపాధి లభిస్తుంది. కొయెడాలోని దేవసంస్కృతి విశ్వవిద్యాలయం బయో ఇన్ఫర్మేటిక్స్ సంస్థ ఈ శిక్షణ నిర్వహిస్తుంది.

గ్రామీణ యాజమాన్యం, మత విజ్ఞానం కోర్సులో 30 సీట్లు, ఇన్ఫర్మేటిక్స్ యొక్క రెండు సర్టిఫికెట్ కోర్సులలో 20,20 సీట్లు ఉంటాయి. విద్యార్థులందరికీ ఇంటర్న్‌షిప్ తప్పనిసరి. ప్రాజెక్టు నిర్వహించడానికి వారికి స్థలాన్ని కూడా నిర్దేశిస్తారు. దేశ విదేశాలలోని విద్యార్థినీ విద్యార్థులు ఈ కోర్సులకు దరఖాస్తు చేయవచ్చు. ఈ కోర్సులన్నింటికీ నిర్దేశ పుస్తకాలు, దరఖాస్తు పత్రాలను కులసచివ్, దేవ సంస్కృతి విశ్వవిద్యాలయం పేర 100 రూపాయల డిమాండ్ డ్రాఫ్ట్ పంపి లేదా 50 రూపాయల నగదు ఇచ్చి పొందవచ్చు. ఏప్రిల్ 15న వీటి అమ్మకం ప్రారంభం అవుతుంది. పూర్తి చేసిన దరఖాస్తులు చేరడానికి ఆఖరు తేదీ 1-6-2004.

ఇలా ఈ సంవత్సరం మొత్తం 12 కోర్సులు ప్రారంభం అవుతున్నాయి. ఈ విశ్వవిద్యాలయం అందిస్తూన్న నిష్కామ సేవ ప్రయోజనాన్ని అందరూ పొందుతారనీ, ఈ కోర్సుల సమాచారాన్ని వీలైనంత హెచ్చుమందికి అందిస్తారనీ ఆశిస్తున్నాము. కోర్సుల వివరాలను ఇంటర్‌నెట్‌పై w.w.w.d svv.org పై కూడా చూడవచ్చు. ఫోన్ నంబర్లు 01334-260723, 262094, 261367 ప్రస్తుతం ఇక్కడ శిక్షణ పొందుతూన్న విద్యార్థినీ విద్యార్థులు తాము అదృష్టవంతులమని భావిస్తున్నారు. మన పత్రిక పాఠకులకు కూడా ఆ అదృష్టం కలగాలన్నది మా కోరిక.

H H H

**కార్యశీలత లేని జీవితం ఒక గుదిబండ.**

వ్యక్తి నిర్మాణం

# మధ్యేమార్గంలో మనశ్శాంతి

జీవితంలో అడుగడుగునా సుఖదుఃఖాల అనుభూతి కలుగుతూనే ఉంటుంది. ఫలానాఫలానా వస్తువులు మనకుంటే ఎంత సంతోషంగా ఉంటుంది అనుకుంటాము. తీరా ఆ వస్తువులు లభ్యమయ్యాక వాటిని ఎలా కాపాడుకోవాలా అని ఆలోచిస్తుంటాము. వాటిని పోగొట్టుకుంటామేమో అనే భయం వెన్నాడుతూ ఉంటుంది. మనం స్వార్థం కోసం ఎవరి ముందో చేయి చాపుతాము. వారు నిర్లక్ష్యం చేస్తే వారు అవమానించారని బాధ పడుతాము. పొగడ్త పొందడం అనే ఆకలి మనల్ని దహిస్తుంది. లోభ మోహాల వ్యాప్తి వల్ల మనల్ని ఉద్ధరించవలసిన శక్తి కూడా దురుపయోగం అవుతుంది. ఫలితంగా మనకేదీ దక్కదు. వార్ధక్యం దగ్గర పడే కొద్దీ మన దోషాల బరువు పెరిగి మానసిక ఉద్వేగం ఎక్కువవుతుంది.

శక్తిని దుర్వినియోగం చేయకుండా వాడడం అత్యవసరం. అనవసర ప్రసంగాలు మానకపోతే క్షేమం ఉండదు. విరక్తి భావాలు క్షేమకరం. సాధు ఫకీర్ల వస్త్రధారణ చేసుకుని లోలోపల విరక్తి భావనలు లేకుండా లోభమోహాలతో అస్తవ్యస్తమవుతుంటే మనకు సుఖశాంతులు లేశమైనా ఉండవు. భోగాల నుండి విడిపడాలంటే సాధన చేయాలి. అప్పుడే మిగిలిన పనులన్నీ సులభ మవుతాయి.

మనస్సును స్వాధీనపరచుకున్న తర్వాత ఈ జీవితం క్షణభంగురమన్న విషయం అవగతమౌతుంది. నెమ్మదినెమ్మదిగా మోహం తొలగిపోయి జ్ఞానప్రాప్తి కలుగుతుంది. జ్ఞానాన్ని పొందడానికి వేరే ప్రయత్నాలేవీ చేయనవసరం లేదు. శరీరం అశాశ్వతమనీ, ఆత్మయే శాశ్వతమనే దృష్టి నిరంతరం కలిగి ఉంటే భయాందోళనలతో క్రుంగిపోవలసిన పని ఉండదు. భోగలాలసలు నిన్ను కల్లోలపరచలేవు. ఏది ఏమయినప్పటికి శరీరాన్ని, ఆత్మను వేర్వేరుగా దర్శించే ప్రయత్నం చేస్తుండాలి. ఈ విధంగా చేస్తే వాస్తవం అవగతమవుతుంది.

ప్రపంచంలో మనం చేయవలసిన పనులను సంతోషంగా సక్రమంగా చేయాలి. కానీ మనస్సు మాత్రం ఎప్పుడూ అంతర్ముఖంగానే ఉండాలి. ఈ ప్రక్రియ వల్ల ఆత్మకళ్యాణం కలుగుతుంది. పనులు నిర్వర్తించే సమయంలో మన దోషాలు కన్పిస్తే వాటిని తెలుసుకోవాలి. అప్పుడే దోషాలు దూరం కాగలవు.

శక్తి సదుపయోగం కావాలంటే సాంసారికమైన పనులను తటస్థ భావంతో చేసే ప్రయత్నం చేయాలి. దీని వలన పని భారమనిపించదు. ప్రాపంచిక విషయాల్లో కూరుకుపోము. వినోభాభావే ఇలా చెప్పేవారు-"మనం సముద్రం గట్టున నిలబడి చూచినపుడే అలల సౌందర్యాన్ని తిలకించగలము. అలల్లో మునిగిన వ్యక్తి అలల సౌందర్యాన్ని ఎలా చూడగలడు?" అలాగే మనం కూడా అభ్యాసం ద్వారా వైరాగ్యం ద్వారా మనస్సును అదుపు చేసే ప్రయత్నం చేయాలి. అప్పుడు శక్తి అరుగుదలను అరికట్టగలం. ఈ శరీరమూ, ప్రపంచమూ అశాశ్వతమనీ, మృత్యువు మనల్ని అంటిపెట్టుకునే ఉన్నదన్న వాస్తవాన్ని తెలుసుకున్నపుడు పనులను నిశ్చింతగా చేయగలమనీ ప్రాపంచిక విషయాల్లో కూరుకుపోమనీ మహాత్ములు బోధించారు. మనకు సంక్రమించిన పనులను మనం ఉల్లాసంగా, సక్రమంగా చేయాలి. ఆధ్యాత్మికతను మరువకూడదు. మనస్సు చాలా చంచలమైంది. అది ఒక మాయబొమ్మ. అది మనల్ని ఆడిస్తుంటుంది. ఈ మనస్సు వశపరచుకోవడానికి ఆధ్యాత్మికత అవసరం. మనస్సుకు అనుకూలంగా లేని పరిస్థితితో క్రోధం గానీ, బాధ గానీ కనపరచకూడదు. ప్రతి ఒక్కరి జీవితంలోనూ ఆశ నిరాశలు, సుఖదుఃఖాలు ఉంటాయన్న విషయం అవగతం చేసుకోవాలి. దీనినెవరూ తప్పించుకోలేరు. కనుక సుఖదుః ఖాలకతీతంగా ఉండే కళను సాధన చేయాలి.

లభించిన వాటితో మనం తృప్తి పడాలి. భగవంతుడు దయాస్వరూపుడు కనుకనే ఈనాడు ఈ వస్తువులకు నన్ను అధికారిని చేశాడని అనుకోవాలి. మనకంటే ఎక్కువగా ఉన్నవారిని గాక మన కంటే తక్కువగా ఉన్నవారిని చూచినపుడు, అంత తక్కువలో కూడా వారు జీవితాన్ని ఎలా గడుపుకున్నా అనేది మనకు తెలుస్తుంది. మనం వారి కంటే కూడా ఎంతో అదృష్టవంతులం కదా అనే భావన కలుగుతుంది. భగవంతుడిని ఏదైనా కోరవలసి వచ్చినపుడు "ఓ భగవాన్ ! మాకు సుఖదుఃఖాలను ధైర్యంగా ఎదుర్కొనే శక్తిని ప్రసాదించు. మాకు ప్రాప్తించిన వాటితో మేము సంతోషంగా ముందుకు సాగాలి"-అని వేడుకోవాలి. ఈ విధమైన శక్తి కొరకు అర్థించినపుడు అంతరంగంలో శాంతి కలిగి, ఉద్వేగాల నుండి రక్షణ కలుగుతుంది.

అన్ని విధములైన యోగ్యత, శక్తి ప్రాప్తించినపుడు అహంకారానికి లోను కాకూడదు. అహంకారం కలిగిందంటే ఒక్కొక్కటిగా దుర్గుణాలు ప్రవేశించి మనల్ని శక్తిహీనుల్ని చేస్తాయి. మనలో అశాంతి చోటు చేసుకుంటుంది. ఇటువంటి పరిస్థితి నుండి విడివడి నమ్రతను పెంపొందించుకోవడం అత్యవసరం. అప్పుడే అధిక శాంతి లభిస్తుంది. సజ్జనుల సాంగత్యం వారిచ్చే శిక్షణను సులభంగా హృదయంగమం చేసుకోగలుగుతాము. నమ్రత వల్ల సురక్షితంగా ఉండగల కళ అలవడుతుంది. మహత్తర సంతోషం, శాంతి లభ్యమై ఈ సంసారాన్ని సులభంగా దాటగలము. ఒకవేళ ఏదైనా భయాందోళనలు కలిగినా సులభంగా వాటిని తొలగించు కోగలుగుతాము.

అనువాదం-కె.అరవిందమ్మ.

**దైవంపై భారం ఉంచు, క్లిష్ట సమయాలలో మంచి సలహా పొందు.**

## శతసూత్ర కార్యక్రమం: 61-68

# సామాజిక పరివర్తనలో కళ

మనిషి అంతఃకరణకు పులకింపజేసే సామర్థ్యం, దానిని పరవశింపజేసే సామర్థ్యం కళకు ఉన్నది. నేడు వాసనలను రెచ్చగొట్టడానికీ, మనోవికారాలను ఉద్రేకపరచడానికీ కళను నిర్మాణానికీ, సమాజ రచనకూ వినియోగించవలసి ఉన్నది. కళ శాశ్వతమైనది. దానిలో ఎలాంటి దోషమూ లేదు. పైగా- మనిషి అంతఃకరణను సూటిగా స్పర్శించే సామర్థ్యం కలిగి ఉన్నందున అది ఆవశ్యకమూ, అభినందనీయమూకూడా. మనం వ్యతిరేకించవలసింది కళను దుర్వినియోగపరచడాన్ని మాత్రమే. ఆ ధోరణిని నిరోధించాలి. జనమానసాన్ని శ్రేష్ఠత్వంవైపు మళ్లించడానికి కళలోని సృజనాత్మక శక్తిని వినియోగించాలి. ఇందుకు ఎనిమిది సూచనలు దిగువ ఇస్తున్నాం-

**వక్తృత్వ కళ వికాసం :-** మాట్లాడడం ప్రపంచంలోని కళలన్నింటిలో గొప్పది. వ్యక్తిగత జీవితంలో ప్రజల సహకారాన్ని పొందడం ప్రధానంగా మాట్లాడే తీరుపై సంభాషణ శైలిపై ఆధారపడి ఉంటుంది. తియ్యగా మాట్లాడడంవల్ల పరాయివాళ్లు మనవాళ్లు అవుతారు. కటువుగా మాట్లాడడంవల్ల మనవాళ్లు పరాయివాళ్లు అవుతారు. జీవనం ప్రగతి పొందడంలో శిష్టమూ, మధురమూ, ఉదారమూ, పరిష్కృతమూ అయిన వాణిని మించిన దోహదకారి మరొకటి ఉండదు. అలాగే, సామాజిక జీవనంలో సాఫల్యం వక్తృత్వంపై కొంతవరకు ఆధారపడి ఉంటుంది. సంస్కారంతోకూడిన సంభాషణ శైలి కలిగి ఉన్న వ్యక్తి తన భావాలను సక్రమంగా, యుక్తియుక్తంగా, బలంగా ప్రతిపాదించగలుగుతాడు. యుగ నిర్మాణంలో మనమంటూ మొదట ఈ శాస్త్రాన్ని అమలుచేవయవలసి ఉంటుంది. వ్యక్తిగత సంభాషణలోనూ, బిహరంగ సభలలో ప్రసంగించే సమయంలోనూ ఏయే విషయంపై దృష్టి పెట్టడం అవసరమో, ఏయే విషయాలను అభ్యసించడం అవసరమో యుగనిర్మాణ పరివార సభ్యులకు క్రమ పద్ధతిలో శిక్షణ ఇవ్వవలసి ఉంది. లేని పక్షంలో, ఈ భావ విప్లవ మహోద్యమం ఎలా విస్తరిస్తుంది?

**గాయకుల సమీకరణ :-**వక్తలకువలె గాయకులకూ ప్రాధాన్యం ఉంది. రసవత్తరంగా పాడిన పాట మనిషి హృదయాన్ని పులకింపజేస్తుంది. భావాలను మార్చే శక్తి ఉపన్యాసంలో ఎంత ఉన్నదో, భావనలను ఉగ్రాతలూగించే శక్తి పాటకు అంత ఉన్నది. కనుక గాయకులను సమీకరించాలి. యుగ నిర్మాణ భావనలకు అనుగుణమైన పాటలను నేర్చుకుని పాడేందుకు వారికి ప్రేరణ ఇవ్వాలి.

ప్రతి ఊరిలో పెక్కు భజన మండలులు ఉంటాయి. అవి విడివిడిగా పనిచేస్తూ ఉంటాయి. వాటిని ఒకత్రాటిమీదకు తేవడం మంచిది. గాయకులకు తమ కళద్వారా సామాజిక ప్రయోజనాన్ని సాధించాలనే ప్రేరణ కలిగించాలి. వివిధ సమయాలలో బృందగాన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలి. ఆ బృందగానాలను ఉత్కృష్ట భావనలకు ప్రాధాన్యం ఉండేలా ప్రయత్నించాలి.

**సంగీత శిక్షణకు వ్యవస్థ :-** కొందరి గొంతులలో మాధుర్యం ఉంటుంది. వారిలో జనాన్ని ప్రభావితం చేసే ప్రతిభ ఉంటుంది. అయితే పాడడంలో, వాద్య పరికరాలను వాయించడంలో క్రమబద్ధమైన శిక్షణ లేకపోవడం వల్ల వారిలోని కళ వికాసం పొందదు-మామూలు పాటలు పాడడంలో మామూలు వాద్యాలు వాయించడల శిక్షణ ఇవ్వడం పెద్ద పేనేమీ కాదు మాములు పరిజ్ఞానం కలిగినవారైనా ఆ పని చేయగలుగుతారు. ఢపిలీ, కంజీరా, తాళం, మంజీరా, ఢోలక్,ఏకతారవంటి వాద్యాలను వ్యక్తులు ప్రత్యేకంగా నేర్చుకోకుండానే చూచి, విని, వాయించగలరు. క్రమబద్ధమైన శిక్షణ ఇస్తే, ఎందరో ఆ ప్రయోజనం పొందగలుగుతారు. పలువురు కొత్త గాయకులూ, వాదకులూ తయారవుతారు.

**చిత్రకళ ప్రయోజనం :-** అలంకరణ చిత్రాలను వాడే ధోరణి ఇప్పుడు బాగా పెరిగిపోయింది. గదులలో, పుస్తకాలలో, పత్రికలలో, దుకాణాలలో, క్యాలెండర్లలో, వాణిజ్య ప్రకటనలలో - అంతటా చిత్రాల వాడకం హెచ్చుగా ఉంది. అయితే వీటిలో హెచ్చుగా నీచమైన అభిరుచులు అశ్లీలాలు ఉంటున్నాయి. ఇవి చాలావరకు నిరర్థకాలుగా ప్రేరణ రహితులుగా ఉంటున్నాయి. వీటికి బదులు- మహాపురుషుల, త్యాగమూర్తుల, ప్రజాసేవకుల, ఆదర్శ వ్యక్తుల, ప్రేరణ ఇచ్చే ఘట్టాలు చిత్రాలు విరివిగా రావాలి. వాటిని చూచినప్పుడు శ్రేష్ఠత్వాన్ని మేలుకొలిపే సంస్కారాలు ఏర్పడతాయి. తమ కళద్వారా జన మానసంలో ఉదాత్త భావనలను వ్యాప్తి చేసే చిత్రకారుల సహకారాన్ని ఈ పరివర్తనకోసం సమీకరించాలి. భావ భరితమైన ఇలాంటి

**ఆత్మ నిర్మాణపు నియమావళియే సాధన.**

చిత్రాలు భారీయెత్తున తయారుకావాలి. సద్ వాక్యాలను, మహనీయులు మహితోక్తులను కళాత్మకంగా ప్రదర్శించాలి. అవినీతిని ఖండించే వ్యంగ్య చిత్రాలకు కూడ ఎంతో ప్రయోజనం ఉంది. కళాకారులు ఇలాంటి చిత్రాలను చిత్రించాలి. జన మానసాన్ని మార్చివేయడంలో మహత్తర సహకారం అందించాలి.

పైవిధమైన చిత్రాల ప్రచురణ పరిశ్రమను భారీయెత్తున ప్రారంభించి, వాటిని మరింత చౌకగా, మరింత అందంగా తయారుచేయడం ద్వారా సమాజానికి గొప్ప సేవ చేయచ్చు. చిత్రాల ప్రచురణ ఒక లాభసాటి పరిశ్రమ. ప్రభావం కలిగించే పరిశ్రమ కూడా చిత్రకారులద్వారా బొమ్మలు గీయించడం, వాటిని ముద్రించడం, విక్రయదారులకు పంపడం, అమ్మడం మున్నగు పనులలో పలువురికి ఉపాధికూడ లభిస్తుంది.

**ప్రదర్శనాల ఏర్పాటు :–**వివిధ స్థలాలలో ప్రదర్శనలను ఏర్పాటు చేయాలి. ఈనాడు సామాజిక దురాచారాలు కారణంగా, నైతిక దురాచారాలు కారణంగా కలుగుతున్న దుష్పరిణామాలను పెద్ద పెద్ద చిత్రాలలో చూపి వాటిని కళాత్మక రీతిలో ప్రదర్శించాలి. ఆ చిత్రాలు ఆధారంగా దర్శకులకు వాస్తవికత స్థితిగతులను వివరించాలి. ఆ ప్రక్రియ దర్శకులను హెచ్చుగా ప్రభావితం చేస్తుంది. దురాచారాలు పెరగడం వల్ల సమాజం ఏ విధంగా పతనం అవుతున్నదో ప్రజలకు వివరించడం అత్యవసరం. ఇందుకోసమై వార్తాపత్రికలలో ప్రచురితమైన వార్తలను సేకరించి చిన్నచిన్న అక్షరాలలో చిత్రాల వలెనే కళాత్మకంగా ప్రదర్శించవచ్చు.

అలాగే పెరుగుతూన్న మంచి పనులను, జరుగుతూన్న మంచి సంఘటనలను తెలిపే చిత్రాలను, వాక్యాలను కూడా ప్రదర్శించాలి. సేవ, త్యాగం, ప్రేమ, ఔదార్యం వంటి భావనలను ప్రదర్శించడానికీ, మంచి పనులు చేయడానికీ అందువల్ల ప్రజలకు ప్రేరణ కలుగుతుంది. ఉత్సవాలలో, తిరునాళ్లలో ఈ ప్రదర్శనలను ఏర్పాటు చేయాలి. అందుకు తగిన పథకాలను రూపొందించాలి. ఇవన్నీ భావనలు ఉదాత్తం కావడానికి ఇవన్నీ దోహదం చేస్తాయి.

**నృత్య ప్రదర్శనలు :–**వివిధ స్థలాలలో రామకథపై, కృష్ణలీలలపై నృత్య ప్రదర్శనలు భారీ యెత్తున జరుగుతూ ఉంటాయి. వీటిలో నిరర్థకమైన వాటికీ, వినోదాత్మకమైన వాటినీ తగ్గించి, ప్రబోధాత్మకమైన వాటినీ, ప్రేరణ ఇచ్చేవాటినీ పెంచడానికి వీటి నిర్వాహకులు ప్రయత్నించాలి. సామాన్య ప్రజలకు అర్థం కావడానికై వీటిని సంస్కరించే కృషి కూడా జరగాలి.

వివిధ స్థలాలలో ఉత్సవాలు, తిరునాళ్లు జరుగుతూ ఉంటాయి. వీటి వెనుక ఏదో ఒక చరిత్ర, ఏదో ఒక సంప్రదాయం ఉంటుంది. లీల, నృత్యం, ఏకాంకిక, ప్రదర్శనం, గానం, సంగీతం, పోస్టర్ మున్నగు రూపాలలో దానిని ప్రదర్శించాలి. అందువల్ల ఆయా తిరునాళ్లలో పాల్గొనే ప్రజలకు వాటి వెనుక ఉన్న మూల కారణం తెలుస్తుంది. వారు ఆ తిరునాళ్ల ద్వారా కొంత భావనాత్మక ప్రయోజనం పొందుతారు. ఇందువల్ల తిరునాళ్ల ఆకర్షణ పెరుగుతుంది. ప్రచారం క్రమబద్ధంగా జరుగుతుంది.

**నాటకాలు, ఏకాంకికలు :–**నాటక సమాజాలు కూడా సామాజిక పరివర్తన మహోద్యమంలో పాల్గొనవచ్చు. చిన్నచిన్న నాటక సమాజాలు కొద్దిపాటి సాధనాలతో రంగస్థలాన్ని నిర్మించుకుని మహాపురుషులు జీవిత ఘట్టాలు, చారిత్రక ఘట్టాలు, సామాజిక స్థితిని ప్రతిబింబించే సన్నివేశాలను చిత్రించే నాటకాలు ప్రదర్శించాలి. వాటిని సామాన్య ప్రజలకు వినోద సాధనాలుగా మలచవచ్చు. వృత్తి ప్రాతిపదికపై ఇలాంటి నాటక సమాజాలను ఏర్పరచవచ్చు. ఆ సమాజాలు పరిస్థితిని బట్టి ఖర్చు చేస్తూ, నాటకాలను చౌకగా, ప్రజారంజకంగా ప్రదర్శించవచ్చు.

చిన్నచిన్న కార్యక్రమాలలో ఏకాంకిక/ప్రదర్శన బాగా సఫలమవుతుంది. వీటిని ఇతర ఉత్సవాల సందర్భంగా కూడా ప్రదర్శించవచ్చు. నైతిక విప్లవంలో, భావ విప్లవంలో అంతర్భాగాలైన అంశాలు ఇతివృత్తాలుగా, కథావస్తువులుగా ఇలాంటి ఏకాంకికలను, నాటకాలను రచించి ప్రదర్శించవచ్చు.

**అత్యాధునిక కళారూపాలు :–** శాస్త్ర విజ్ఞానం ఆధారంగా కొన్ని కళలు ఎంతగానో వికాసం పొందుతాయి. ప్రజలు వాటిని వినియోగిస్తున్నారు. అయితే వాటి నిర్మాణం ఉన్నత స్థాయిలోనే జరిగే అవకాశం ఉంది. ఆడియో వీడియో క్యాసెట్లు, సిడిలు, చలనచిత్రాలు జనమానసంపై విశేష ప్రభావం చూపుతాయి. దేశంలో వేలాదిగా సినిమా హాళ్లు ఉన్నాయి. వీటిలో లక్షలాదిగా సినిమాలను ప్రదర్శిస్తున్నారు. వీటిని కోట్లాది మంది చూస్తున్నారు. ఆ దృశ్యాలలో ఉన్న భావాలను, సందేశాలను ప్రజలు గ్రహిస్తున్నారు. మనిషి మెదడును ప్రభావితం చేసే అత్యధునాతమైన సాధనాలు ఇవి. అయితే విచారకరమైన విషయం ఏమంటే వీటి దురుపయోగమే హెచ్చుగా జరుగుతోంది. వీటి సదుపయోగం జరిగితే జన జాగరణలో శీల నిర్మాణంలో ఎంతో ప్రగతి సాధ్యమౌతుంది.

H H H

**సంతోషం మహత్తర సంపద. అసంతోషం కృత్రిమ దారిద్ర్యం.**

మహిళా జాగరణ

# వేదకాలంలో మహిళ

ఒక దేశ ప్రగతికి ఆ దేశంలో ఆ సమాజంలో స్త్రీకి ఇవ్వబడిన స్థానం ఒక సూచిక. ఈ సూచికను పరిగణనలోనికి తీసుకుని పరిశీలిస్తే వేదకాలం నాటి భారతీయ సమాజం ప్రపంచంలోనే అన్ని సమాజాల కంటే అత్యంత అభివృద్ధి చెందినదనీ, నాగరికమైనదనీ చెప్పవచ్చు. వేదకాలంలో స్త్రీలకు అత్యంత గౌరవనీయమైన స్థానాన్ని ఇచ్చారు. కౌటుంబిక వ్యవహారాలలో గాని, సామాజిక సంస్థలలో గాని, విద్యారంగంలో గాని, రణరంగంలో గాని, తాత్త్విక చర్చలలో గాని స్త్రీలు నిర్వహించిన పాత్రను గురించి ప్రశంసాపూర్వకంగా ఉల్లేఖించారు.

శతపథ బ్రాహ్మణం ఇలా చెప్పింది. "పిల్లలకు తల్లి మొదటి గురువు మాత్రమే కాదు. ఉత్తమమైన గురువు కూడా. స్త్రీని పురుషునికి ఆనందాన్ని పంచిపెట్టే వస్తువుగా మాత్రమే చూడకూడదు. పురుషుని ఆధ్యాత్మిక జీవనంలో ఆమె సహధర్మచారిణి.''

## విద్యారంగం

బాలురతో పాటు బాలికలకు కూడా విద్యను అభ్యసించడానికి సమానావకాశాలుండేవి. అంతే కాదు. ఎవరికైనా వివాహం చేసుకోకుండా జీవితమంతా విద్యాసముపార్జనలోనే గడపాలనే కోరిక ఉంటే దానికి కూడా అవకాశాలుండేవి. విద్యార్జన చేసే స్త్రీలను సూచించటానికి రెండు పదాలుండేవి. 'సద్యోద్వాహ' అంటే వివాహం అయ్యేదాకా విద్యనార్జించే స్త్రీ, బ్రహ్మవాదిని అంటే సాధారణంగా వివాహం చేసుకోకుండా జీవితమంతా అధ్యయనంలోనే గడిపే స్త్రీ. వైదిక సాహిత్యంలో ఋషులైన స్త్రీల గురించి, వేదమంత్ర ద్రష్టలైన స్త్రీల గురించి చెప్పారు. అథర్వణ వేదంలో వేదవిద్య ప్రాముఖ్యత వివరించబడింది. వేదవిద్యను అభ్యసించిన వారు ఆధ్యాత్మికంగానే భౌతికంగా కూడా గొప్పవారే. రైతులు, వీరులు, వేదపండితులు, రాజులు మొదలైన వారంతా తమతమ రంగాలలో విజయాన్ని సాధించటానికి ప్రధాన కారణం వారు వేద విద్యను కూడా అభ్యసించటమే. వేద విద్యార్థి తన దేశంలోనే కాదు విదేశాలలో కూడా గౌరవాన్ని పొందుతాడు. 'విద్వాన్ సర్వత్ర పూజ్యతే'. అతడు సముద్రాన్ని దాటి ఇతర ప్రదేశాలను ప్రభావితం చేస్తాడు. వేదవిద్యలో పాండిత్యం వలన బాలికలకు భర్తలు లభిస్తారు. వీరుడు రాణిస్తాడు. కృషీవలుని కృషి ఫలిస్తుంది. సమావర్తనోత్సవం విద్యాభ్యాసం పూర్తి అయిన తరువాత చేస్తారు. ఆ ఉత్సవ వివరాలను పరిశీలిస్తే విద్య అందరికీ అందుబాటులో ఉండేదని తెలుస్తోంది.

స్త్రీలు విద్యను అభ్యసించటమే కాదు, ఇతరులకు నేర్పే వారు కూడా. 'ఆచార్య' పదానికి స్త్రీ లింగం 'ఆచార్యాణి' అని చెప్తూ అయితే ఆచార్యుని భార్యను మాత్రమే ఆచార్యాణి అనాలని సూచించాడు. ఒక ఆశ్రమాన్ని గురుకులాన్ని (పాఠశాలను) నిర్వహిస్తూ విద్యాబోధన చేసే స్త్రీని ఆచార్య అనే పిలవాలట. అలా విద్యాబోధన చేసే స్త్రీల వద్ద చాలా మంది చదువుకున్నారు. వారిని ఫలానా ఆచార్యుని శిష్యులని గుర్తించటానికి వీలుగా వేరువేరు పేర్లు వారికిచ్చారు.

వేద మంత్ర ద్రష్టలైన స్త్రీలు దాదాపుగా ముప్పై మంది ఉన్నారు. ఈ ఋషుల సంఖ్యను కొంతమంది వర్గీకరించి, తక్కువ చేసి చెప్పటానికి ప్రయత్నించారు. అయినా వాస్తవమేమిటంటే ఋగ్వేద మంత్ర ద్రష్టలుగా ముప్పది మంది ఋషికలు కనపడుతున్నారు. పండితులు వర్గీకరించిన ఋషికల పేర్లు ఇక్కడ ఇస్తున్నాం. అయితే ఈ పేర్లన్నీ ఋగ్వేదంలోనివే. ఇతర వేదాలకు చెందిన గార్గి, మైత్రేయి, వాడవ, అరణ్యాని, విష్పల మొదలగు ప్రఖ్యాత ఋషికల పేర్లను ఇక్కడ ఇవ్వటం లేదు.

దేవతలకు చెందిన లేదా దేవతలైన ఋషికలు : ఇంద్రమాతర, ఇంద్రస్నుశ, ఇంద్రాణి, అదితి, సూర్య, సావిత్రి, యమి, వైవస్వతి, శచి, పౌలోమ.

ఋషులకు, రాజులకు చెందిన వారు : అగస్త్యవాస, అపల, ఆత్రేయి, శాశ్వతి, అంగీరస ఘోష , కాక్సివతి, జూహు, బ్రహ్మజయ, రోమశ, లోపాముద్ర, విశ్వవర

అప్సరసలైన ఋషికలు : ఊర్వశి, శింఖండిన్య, కాశ్యపి

మానవేతర ప్రాణుల పేర్లు కలిగిన ఋషికలు : దేవాసురె, శరమ, గోధా, సర్పరజని

జడపదార్థముల పేర్లు కలిగిన ఋషికలు : నాద్యః, రాత్రి, దక్షిణ

అరూప్య పదార్థముల పేర్లు కలిగిన ఋషికలు : వాక్, శ్రద్ధ

ఖిల సూక్తానికి చెందిన ఋషికలు : శ్రీ, లక్ష్య, మేథ, ఉపనిషత్, నిషాద

**సత్కర్మలుగా రూపొందినపుడే సద్జ్ఞానానికి సార్థక్యం.**

కూతురికి దేవతల పేర్లు, అరూప్య భావనల పేర్లు పెట్టుకోవటం సహజమే. అందువలన పైన పేర్కొన్న పేర్లను ఊహాజనితాలుగా భావించకూడదు. ఉదాహరణకు వాక్ అనే పేరు గల ఋషిక అంభ్రిణి ఋషి కుమార్తె. అందువలన ఆమెను ఊహాజనితం అనలేము కదా! వేదకాలంలో కొంత మంది స్త్రీలు కూడా బ్రహ్మజ్ఞాన సిద్ధిని - అహం బ్రహ్మాస్మి అనుభూతిని - పొందారు. ఋగ్వేదంలోని దశమ మండలంలో (10.125) ఋషిక వాక్ ప్రోక్తమైన దేవీ సూక్తముంది. అది అత్యంత అద్భుతం.

చాలా మంత్రాలలో ఈ దేశపు పురుషులకు ధైర్యసాహసాలను, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని, పవిత్రతను, బౌద్ధిక ఔన్నత్యాన్ని స్త్రీలే ఇచ్చారని చెప్పబడింది.

కొంతమంది పండితులు ఋషికలు ద్రష్టలైన మంత్రాలలో సూక్తాలలో స్త్రీ సహజ భావాలు మాత్రమే ఉన్నాయంటారు. కాని నిష్పక్షపాతంగా చూస్తే ఉన్నతమైన విషయాలు ఎన్నో తెలుస్తాయి. కాక్షీవతుని కుమార్తె అయిన ఘోష ఒక సూక్తానికి ఋషిక. అందులో కుటుంబ సంతతి అందరికీ సద్విద్య లభించాలని ప్రార్థించబడింది. వేదకాలంలో స్త్రీ ఒక తల్లిగా జ్ఞాన సముపార్జన అత్యంత అవసరమని భావించిందని మనకు తెలుస్తోంది. 136వ సూక్తంలో దృఢమైన భక్తిని గోదా మెచ్చుకుంటుంది. అత్రి ఋషి కుటుంబానికి చెందిన విశ్వవర ఋగ్వేదంలో అయిదవ మండలంలో ఆరు శ్లోకాలలో వైవాహిక జీవనంలో ప్రేమాభిమానాలు, సుఖసంతోషాలు ఉండాలని ప్రార్థించింది. ఇందులో 'మా వైవాహిక జీవనంలో సంయమనాన్ని' ప్రసాదించమని ప్రార్థిస్తుంది. వివాహం ముఖ్యోద్దేశం తెలిసిన వారికి ఆ ప్రార్థన విలువ తెలుస్తుంది.

అశ్వలాయన గృహసూత్రాల ప్రకారం (3-4-4) గార్గి, వాచక్నవి (ఋషి వచక్నువు కుమార్తె), వాదన ప్రతిథేయి, సులభ, మైత్రేయి మొదలగు వేగకాలపు స్త్రీలు బ్రహ్మయజ్ఞం చేసేటపుడు స్మరించుకోవలసిన నిత్య ప్రాతఃస్మరణీయులు.

స్త్రీలు బహిరంగ చర్చలలో పాల్గొనేవారు. గార్గి ఉదాహరణ అందరికీ తెలిసినదే. యాజ్ఞవల్క్యునితో వాదించే వారు లేనందున గార్గి అతనితో వాదించటానికి ముందుకు వచ్చింది. చివరకు అతనిని బ్రహ్మవేత్తగా అంగీకరించమని ఇతరులకు సూచించింది. సులభ జనకుల సంవాదం కూడా మనకు చాలా విషయాలను తెలియజెప్తుంది. ఇంతవరకు ఎందుకు వివాహం చేసుకోలేదని జనకుడు ప్రశ్నిస్తే తనతో పాటు సమానంగా ఆధ్యాత్మిక జ్ఞానాన్ని సంపాదించిన పురుషుడు తటస్థించలేదని చెప్పింది. కౌషితకీ బ్రాహ్మణం (7-6)లో పత్యస్వస్థి అనే విద్వాంసురాలు ఉత్తర ప్రాంతానికి విద్యార్జనకై వెళ్లి 'వాచ్' అనే బిరుదును తన పాండిత్యంతో సంపాదించుకున్నట్టుగా ఉంది.

## వివాహం

స్త్రీలకు వివాహమేమీ తప్పనిసరి కాదు. వాళ్లు కావాలనుకుంటే ఆధ్యాత్మిక జీవనం గడపవచ్చు. పిల్లలు లేని వితంతువులు మళ్లీ వివాహం చేసుకోవచ్చు. అలా మళ్లీ వివాహం చేసుకోవటం ఇష్టం లేని వితంతువులు పిల్లలు కావాలనుకుంటే నియోగ పద్ధతి ద్వారా పిల్లల్ని పొందవచ్చు.

అన్ని కర్మకాండలలో గృహస్థుకు భార్య ఎప్పుడూ ప్రక్కనే ఉండాలి. విధురుడైన పురుషుడు ధార్మికమైన యజ్ఞయాగాదులను నిర్వహించకూడదు. దేవతాగృహ నిర్మాణంలో మొదటి రాయి భార్య మాత్రమే వేయాలి. యజ్ఞం సమయంలో సామవేదాన్ని సాధారణంగా స్త్రీలు పఠించేవారు. స్త్రీకి అత్తగారింట్లో అమితమైన గౌరవం లభించేది. కుటుంబంలో గౌరవనీయమైన స్థానముండటమే కాదు. భర్తమీద, మామగారిమీద, మరిదిమీద పెత్తనం చెలాయించే అధికారం ఉండేది. (ఋగ్వేదం 10-85, 86, అథర్వవేదం 1-4-1)

తండ్రి తన కుమార్తె వివాహ సమయంలో, అల్లునితో తన కుమార్తె అతనికి 'కులపాలిక' అవుతుందని చెప్తాడు. అంటే అతని కుటుంబ సంరక్షకురాలు అవుతుందన్నమాట. వివాహమొక పవిత్ర బంధం. దానిని మానవ మాత్రులు తెంచలేరు. పెండ్లికుమార్తెను గాని, పెండ్లికుమారుని గాని ఎంచుకునే సందర్భంలో కుటుంబంలోని పెద్దల మాటలకు విలువనిచ్చేవారు. అయితే రాజకుమార్తెలకు వారి వివాహ విషయంలో పూర్తి స్వాతంత్ర్యము ఉండేది. స్వయంవరాల గురించి అందరికీ తెలుసు. భార్య నిర్వహించవలసిన బాధ్యతల వివరాలు అథర్వవేదంలో ఇచ్చారు. అవి చదువుతుంటే ఆశ్చర్యకరంగా ఉంటుంది. పిల్లల తల్లిగా స్త్రీ నిర్వహించవలసిన బాధ్యతలకు ఎక్కువ ప్రాముఖ్యతను ఇచ్చారు. సత్పుత్రులకు జన్మనివ్వటం ద్వారా దేశం పట్ల తన బాధ్యతను ఆమె నిర్వహిస్తోంది. భార్యాభర్తలిద్దరికీ ఉపయోగించే 'దంపతి' పదానికి అర్థం గృహానికి ఇద్దరూ యజమానులే అని. యజ్ఞనిర్వహణలో, పిల్లలకు చదువు చెప్పించటంలో, యుద్ధాలు చేసేటపుడు భర్తకు భార్య సహాయపడుతుంది. భర్తతో వేదాంత చర్చలలో కూడా పాల్గొంటుంది. భార్యా భర్తలైన యాజ్ఞవల్క్య మైత్రేయిల సంవాదమే బృహదారణ్యకోపనిషత్ అయింది. అలా

**సమయమే అత్యుత్తమ బహుమతి, అత్యుత్తమ సంపద.**

ధర్మ సంస్థాపనకై స్త్రీపురుషులిద్దరూ కలిసి పని చేసేవారు. చివరకు మోక్షాన్ని కూడా సాధించేవారు.

**సామాజిక జీవనం:-** విద్యాసముపార్జనకు అన్ని అవకాశాలకు ఉన్నందున, సమాజాభ్యున్నతికై స్త్రీ కూడా తోడ్పడగలదని భావించినందున సమాజంలో ఆమెకు సముచితమైన స్థానాన్ని ఇచ్చారు. కుటుంబంలో ఆడపిల్ల పుడితే ఎంతో సంతోషకరమైన విషయంగా భావించేవారు. వరాహ గృహ్యా సూత్రాల ప్రకారం వధువు దుందుభి, గోముఖం మొదలైన సంగీత వాయిద్యాలను వాయించటం నేర్చుకుంటే మంచి సంతానం, ముఖ్యంగా పుత్రికా సంతానం కలుగుతుందట.

స్త్రీ మనోబలాన్ని ఎప్పుడూ తక్కువగా అంచనా వేయలేదు. సోదరులెవ్వరూ లేని స్త్రీ వివాహానంతరం కూడా తన తల్లితండ్రులకు అంతిమ సంస్కారం చేయగలిగేది. వివాహం కాని స్త్రీలు తల్లితండ్రులతో, సోదరులతో కలిసి జీవించేవారు. తండ్రి ఆస్తికి వారసులు కూడా అయ్యేవారు. అంటే కుమార్తెలు కుమారులతో సమానమైన ఆదరణను పొందేవారు.

స్త్రీలు అలంకరించుకునే వివిధ ఆభరణాల వర్ణన మనకు లభిస్తోంది. యజ్ఞయాగాదుల సందర్భంలో విలువైన ఆభరణాలను దుస్తులను స్త్రీలు ధరించేవారు. రణరంగంలో కూడా తమ బలాన్ని తెలివితేటలను ధైర్యసాహసాలను ప్రదర్శించి సమధర్మిణులుగా స్త్రీలు నిరూపించుకున్నారు.

పతంజలి రచనలలో కత్తిని ఝుళిపించే స్త్రీకి 'శక్తికి' అనే పేరును ఉపయోగించడం మనం చూడవచ్చు. ఋగ్వేదంలో వధ్రీమతి, విష్పల, ముద్గలని, దాను, శశియసి మొదలగువారు యుద్ధం చేసినట్లు పేర్కొనబడింది. వారిలో కొంతమంది సైనికాధికారులు కూడా వీరోచితంగా యుద్ధం చేశారు. ముద్గలని, ముద్గలుని భార్య. అతను యుద్ధం చేస్తుంటే ఆమె రథానికి సారథిగా చాకచక్యాన్ని ప్రదర్శించింది. వధ్రీమతికి యుద్ధంలో చేతులు పోతే బంగారంతో చేసిన చేతులను అమర్చారు. విష్పలకు ఒక కాలు యుద్ధంలో పోతే ఉక్కు పాదాన్ని అమర్చారట. ఆమె ఆ తరువాత నడవగలిగేది.

అలా వేదకాలంలో ఆదర్శవంతమైన స్త్రీలను వర్ణించటం కాదు. వాస్తవంగా అటువంటి వాళ్లు ఉన్నారు. ఋగ్వేదంలో దేవత అయిన ఇలాను ఆనంద నిలయంగా వర్ణించారు. యజ్ఞవల్క్యుడు స్త్రీలను భూమిమీద దేవతా లక్షణాలు గలవారిగా అభివర్ణించాడు. సోముడు పారిశుద్ధ్యాన్ని, గంధర్వులు వచోమాధుర్యాన్ని, అగ్ని పవిత్రతను స్త్రీలకివ్వటంతో వారెప్పుడు పరిశుద్ధంగానే ఉంటారని యాజ్ఞవల్క్యుడు అన్నాడు. అటువంటి స్వాతంత్ర్యంతో వేదకాలంనాటి స్త్రీ సామాజిక జీవనంలో తనకు ఇష్టమైన వృత్తిని చేపట్టగలిగేది. లేదా ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని పొందగలిగేది.

- బి. నివేదిత

## నవ్వు, నవ్వించు

ప్రారంభంలో చందమామ చాలా అందంగా ఉండేదట, ప్రతీ క్షణం ప్రసన్నంగా, వికసించిన కమలంలా సుందరంగా ఉండే జాబిల్లిలో కొంతకాలం తర్వాత ఉదాసీనత ప్రవేశించింది. అందువల్లే కళలు క్షీణించి ముఖం ముకుళించుకొనిపోయి, క్రమంగా క్షీణ దశకు చేరుకొని అమావాస్య వచ్చేసరికి పూర్తిగా కురూపిగా తయారైంది. ఆ విధంగా కళలు కోల్పోయిన చందమామ చీకటి గుహలో జీవించసాగింది. సృష్టికర్త ఈ దుర్దశను చూచి సహించలేక "ఓ చందమామా! నీవు తిరిగి చిరువ్వులు చిందించు. అవి లేకుండా జీవించే జీవితం శుద్ధ దండగ. ఉదాసినతవల్ల బ్రతికినా చచ్చినట్లే రోజులు గడపవలసి వస్తుంది'' అని హెచ్చరించాడు. సృష్టికర్త మాటలకు స్పందించిన చందమామ తన తప్పును దిద్దుకొని తిరిగ ప్రసన్నతతో చిరునవ్వులు చిందించ నారంభించింది. అలా పూర్ణిమ వచ్చేసరికి పూర్తి కళలతో, వికసించిన పద్మంలాగ వెలగసాగింది.

ప్రసన్నతతోను, చిరునవ్వులతోను జీవించగలవారు ధన్యులు. వారు తమతోపాటు పరిసరాలను కూడా ఆరోగ్య ప్రదంగానూ, ఆనందమయంగాను ఉంచగలరు. నవ్వుతూ నవ్వించే జీవితమే సార్థకం.

- ప్రజ్ఞాపురాణం నుండి

**మన అంతఃకరణను ప్రభావితం చేసే భావం మన శీలాన్ని సంస్కరించగలుగుతుంది.**

జీవన పథం

# నవ్వు నాలుగు విధాల మేలు

**హాస్యచికిత్స** :- ప్రముఖ వైద్య నిపుణుడు డా॥ శామ్సన్ వద్దకు ఒక రోగిని తీసుకువచ్చారు. అతడి పరిస్థితి చాలా ప్రమాదకరంగా ఉంది. కుటుంబ సభ్యులు అతడిపై ఆశలు వదులుకున్నారు. వైద్యం చేసేముందు ఆ డాక్టరు రోగితో సంభాషణ మొదలుపెట్టాడు. ఎంతో ఆత్మీయతతో, చిరునవ్వులు చిందిస్తూ ఆయన మాట్లాడుతూ ఉండడంతో, రోగి ముఖంలో కూడా చిరునవ్వు తొంగిచుచింది. 'మీరు గాబరాపడవలసిన అవసరం లేదు. రోగికి జబ్బు నయమవుతుంది. ఎందుకంటే ఇతనికి నవ్వే సామర్థ్యం ఇంకా మిగిలి ఉంది' - అని డాక్టరు రోగితో వచ్చినవారికి ధైర్యం చెప్పాడు. కొద్ది కాలం చికిత్స తర్వాత ఆ రోగి జబ్బు నయమయింది. రోగికి మందు మాకులు ఇవ్వడం, చికిత్స చేయడంకన్న అతడికి ఉల్లాసం కలిగించడం, అతడు నవ్వుతూ తుళ్ళుతూ ఉండడం, చిరునవ్వుతో కబుర్లు చెప్పడం మరింత ముఖ్యమైనవని డాక్టర్ శామ్సన్ నమ్మకం. నవ్వు మందులకన్న మిన్నగా పనిచేసిందని రుజువయింది.

**నవ్వులో యవ్వనం** :- తత్వవేత్త బైరన్ ఇలా వ్రాశాడు - నవ్వు యౌవనం లోని ఆనంద రేఖ. యౌవన సౌందర్యం. యౌవన శృంగారం. ఈ సౌందర్యాన్నీ, శృంగారాన్నీ అనుభవించని వ్యక్తి యౌవనం నిలచిఉండదు.

స్టర్న్ ఇలా వ్రాశాడు - వ్యక్తి నవ్వినప్పుడల్లా, హసించినప్పుడల్లా అతడు దానితోపాటు తన ఆయుష్షును పెంచుకుంటున్నాడని నా నమ్మకం. విరగబడి నవ్వడంవల్ల, ఎప్పుడూ ఉల్లాసంగా సంతోషంగా ఉండడంవల్ల మనిషి శరీరంలోని జీర్ణ క్రియ మెరుగుపడుతుందనీ, రక్త కణాలు వృద్ధిపొందుతాయనీ, స్నాయు వ్యవస్థలో తాజాతనం వస్తుందనీ, ఆరోగ్యం పెరుగుతుందనీ డా॥ విలియం తన ప్రయోగాలు ఆధారంగా బుజువుచేశాడు.

**నవ్వు జీవన సౌరభం** :- గలగలా నవ్వడం, హాస్య వినోదాలు, చిరునవ్వులు చిందించడం - ఇవి మనిషి ఆరోగ్యాన్ని చక్కబరచే అద్భుత ఔషధాలు. నువ్వు జీవన సౌరభం. జాజి మొగ్గ సహజంగా విచ్చుకున్నప్పుడు దాని అందం చూడముచ్చటగా, మనోహరంగా వెలిగిపోతుంది. దర్శకుని మనస్సు దానిపట్ల ఆకర్షితం అవుతుంది. జీవితంలోని ఉపద్రవాలలో, పెనుతుఫానులలో చిక్కుకున్న మనిషికి ఆ దృశ్యం కొద్ది క్షణాలపాటు కొత్త జీవాన్ని జవాన్నీ ఇస్తుంది. పసిపాపలా చిరునవ్వు నవ్వడము, హాస్య వినోదాలు చూచినప్పుడు నిరాశతో నీరసించిన వ్యక్తులలో సైతం కొత్త ఆశలు చిగురిస్తాయి. సహచరుల హాస్యవినోదాల గలగలలమధ్య మనిషి తనదుఃఖాన్ని, విషాదాన్నీ మరచిపోతాడు.

**సంత్ ఎమర్సన్ భావన** :- ప్రముఖ తత్వవేత్త ఎమర్సన్ ఇలా అన్నారు. వాస్తవానికి హాస్యం చతురుడైన ఒక రైతు. మానవ పథంలోని ముళ్లను, కలుపును ఏరివేసి, సద్గుణాలతో గుబాళించే మొక్కను నాటి, మన జీవన యాత్రను ఒక పర్వంగా, ఒక ఉత్సవంగా మార్చే రైతు. భయం, చింత మున్నగు మనో వికారాల వల్ల మనిషి శరీరంలో ఉత్పన్నమయ్యే విషాన్ని క్షాళన చేసేందుకు హాస్యం ఒక అద్భుత ఔషధం - అని మనస్తత్వ శాస్త్ర నిపుణులు, శరీర శాస్త్ర నిపుణులు తమ ప్రయోగాలు, పరిశోధనలు, అనుభవాల ద్వారా రుజువు చేశారు.

**నవ్వు నాలుగు విధాల మేలు** :- గలగలా నవ్వడం వల్ల మనిషి యొక్క శారీరక, మానసిక వ్యవస్థలలో ఉన్న ఒత్తిడి ఇట్టే మాయమౌతుంది. నవ్వడం వల్ల నరాలూ, కండరాలు ప్రత్యేకంగా ప్రభావితం అవుతాయి. క్రియాశీలకం అవుతాయి. జీర్ణ రసాన్ని సమృద్ధిగా విడుదల చేస్తాయి. ఊపిరితిత్తులలో రక్తప్రసరణ వేగంగా పెరుగుతుంది. ఉచ్ఛ్వాస నిశ్వాసాల వేగం కూడా పెరుగుతుంది. అందువల్ల శరీరం ప్రాణవాయువును మరింతగా స్వీకరిస్తుంది. రక్తశుద్ధి కూడా వేగంగా జరుగుతుంది. శరీరంలోని జీవనతత్వం క్రియాశీలం అవుతుంది. అందువల్ల ఆరోగ్యం మెరుగవుతుంది. జీవితంలో ఎదురయ్యే కష్టనష్టాలు, దిగుళ్ళు, సమస్యలు సృష్టించే విచారాలు, విషాదాలు, మానసిక అసంతులనం మున్నగు అనేక చిక్కుముడులు హాస్య వినోదాల స్పర్శ తగలగానే మటుమాయం అయిపోతాయి. హాస్య ప్రధానుడైన వ్యక్తి జీవితంలోని పెద్ద పెద్ద ఇక్కట్లను, విషమ సమస్యలను చక్కగా ఎదుర్కోగలుగుతాడు. జీవన సంగ్రామంలో నవ్వుతూ విజయం సాధించగలుగుతాడు.

H H H

స్వాధ్యాయం శిక్షణను పరిపూర్ణం చేస్తుంది.

బ్రహ్మాండంలో సమానుభూతి

# ఖగోళ విజ్ఞానానికి కొత్త కోణం

మన భూగోళం అంతరిక్షంలోని అతి పెద్ద సౌర కుటుంబానికి చెందిన ఒక చిన్న భాగం. ఈ సౌర కుటుంబంలోని గ్రహములన్నీ ఒకే సూత్రంతో కట్టుబడి ఉన్నాయి. అవి తమతమ కక్ష్యలలో తిరుగుతూ సూర్యునికి ప్రదక్షిణ చేస్తుంటాయి. ఈ సూర్యుడు తన కుటుంబానికి చెందిన గ్రహ ఉపగ్రహములతో పాటు మహా సూర్యునికి ప్రదక్షిణ చేస్తుంటాడు. ఈ విధంగా సూర్యుడు ఒక క్రమ పద్ధతిలో ముందుకు సాగుతూ బ్రహ్మాండపు నాభిగా పిలువబడే మహా ధృవం వరకు ప్రయాణిస్తాడు. ఇంత క్లిష్టమైన వ్యవస్థా క్రమం ఏర్పడి ఉన్నందువలన గ్రహ నక్షత్రాల గతులలో ఎటువంటి గందరగోళము ఏర్పడడంలేదు. ఒకదాని ప్రభావం మరొకదాని మీద పడుతూ పరస్పర సమన్వయంతో నడుస్తున్న సువ్యవస్థ ఈ సౌర కుటుంబం. దీనిని బ్రహ్మాండపు ప్రాణధార అని అనవచ్చు.

నేటి వైజ్ఞానిక యుగంలో ఖగోళ శాస్త్రాన్ని కొత్తకోణం నుండి తెలుసుకునే ప్రయత్నం తప్పనిసరి అయింది. విజ్ఞాన రంగంలో దీనికి అత్యుత్తమ స్థానమున్నది. ఋతువుల పరివర్తనలు, వర్షాలు, తుఫానులు, వాయుగుండాలు, హిమపాతాలు, భూకంపాలు వంటి ప్రకృతి గతమైన అనుకూలత-ప్రతికూలతల గురించిన అనేక వివరాలు విశ్వగ్రహగమనముల ఆధారంతో పొందుతున్నారు. ఖగోళ భౌతిక వాదుల అభిప్రాయం ప్రకారం భూమి మీద ఋతువుల పరిస్థితి అంతరిక్షం నుండి వచ్చే ప్రాణశక్తి ప్రవాహాల సంతులనము - అసంతులనముల మీద ఆధారపడి ఉంటుందని. సామాన్యంగా భూమిలోని ధృవప్రాంతాల మీదనే అంతరిక్షపు ప్రాణశక్తి ప్రోగుపడి ఉంటుంది. ఉత్తర ధృవం నుండి మొదలై భూమికి లభించే అసంఖ్యాక సూక్ష్మశక్తులు, సంపదలు బ్రహ్మాండమంతా వ్యాపిస్తాయి.

వీటి నుండి ఉపయుక్తమైన వాటిని భూమి తనలోకి జీర్ణించుకుని పనికిరాని వాటిని దక్షిణధృవ ద్వారం నుండి అనంతాకాశంలోనికి నెట్టి వేస్తుంది. వర్షాల ప్రభావం ఏ విధంగా జీవకోటి మీద, వనస్పతుల మీద పడుతుందో, అదే విధంగా విశ్వగ్రహ మండలముల సూక్ష్మ ప్రవాహాల ద్వారా లభించిన శక్తి కూడా భూమి మీద పడుతుంది. ఇది చెట్టు చేమలనే కాక ప్రాణికోటిని కూడా ప్రభావితం చేస్తుంది. ఈ ప్రక్రియ వలన మానవుల శారీరక, మానసిక పరిస్థితి కూడా చాలావరకు ప్రభావితమవుతుంది. జ్యోతిర్విద్యకు సంబంధించిన వివరాలు చెపుతున్నది ఇది. వర్తమాన స్థితి, భవిష్యత్తు కల్పనలకు సంబంధించి ఈ విజ్ఞానాన్ని ఆధారం చేసుకుని జరిగే సంఘటనల ద్వారా కలిగే నష్టాలను తప్పించుకొనగలిగే విధానాన్ని, శ్రేష్టమైన వాటి నుండి మరింత లాభం పొందగలిగే విధానాన్ని అభివృద్ధి పరచినట్లయితే అది మానవుని సర్వోత్తమ సామర్థ్యమనబడుతుంది. ప్రాచీన ఋషులు దీనికి సముచితమైన మార్గాన్ని సూచించారు. ఇప్పుడు మనం చేయవలసిందల్లా పరంపరాగతంగా వస్తున్న అపోహల నుండి, మూఢనమ్మకాల నుండి విముక్తి పొంది ఈ విజ్ఞాన సమ్మతమైన ప్రణాళికను ఆచరించుటయే.

భూమి మీద నివసించే మనిషి విరాట శక్తిలోని చిన్న అంశ అన్న విషయాన్ని ఆధునిక విజ్ఞానం కూడా బాగా అర్థం చేసుకున్నది. అంటే భూమి ఆ విరాట చిహ్నమైన సూర్యమండలములోని అంశమే కదా! కనుక ఈ మూడింటిలోను ఒకే ప్రాణశక్తి ప్రవహించుచున్నది అన్న విషయం యదార్థం. బిడ్డ గర్భావస్థలో తల్లిద్వారా జోడింపబడిన నాభినాళం (బొడ్డుతాడు) నుండి శక్తి పొందుతూ ఉంటాడు. ఈ రక్త ప్రవాహంతోనే శిశువు కార్యకలాపాలన్నీ నడుస్తుంటాయి. అన్ని జీవ కోశాల నిర్మాణం ఒకే అణువుతో కోట్లాది జీవకణాలు తయారగుట ఈ ప్రక్రియ సహకారంతోనే జరుగుతాయి. దీనిని వైజ్ఞానికులు తమ భాషలో ఎంపథీ లేక సమానుభూతి అని అంటారు. మానవులు, పృథ్వి, సూర్యుడు, మహాసూర్యుడు, పరబ్రహ్మ ఇవన్నీ కలిపి ఈ సమానుభూతి వలయం. సూర్యుని మీద సంభవించిన ఏదైనా ఒక సంఘటన తాలూకు పరిస్థితి మానవుల ఇతర ప్రాణికోటి రోమరోమాలలో ప్రతిస్పందిస్తుంది.

**నీ శక్తులకు కార్యరూపం ఇవ్వు. నీ దైవ ప్రార్థన ఫలిస్తుంది.**

మనిషి రక్తంలో సంచరించే రక్తకణాలు, మరియు న్యూక్లియర్ ఏసిడ్ వంటి జీన్స్, జీన్స్‌ను తయారు చేసే అల్ప కణాలు, సూర్యుని అణువులతో సమానుభూతి కలిగి ఉంటాయి. అనగా అన్ని మంచిచెడుల ప్రభావాలలో భాగం పంచుకుంటాయి. సూర్యునికి కోట్ల మైళ్ల దూరంలో నివసిస్తున్నప్పటికి ఈ ప్రభావంలో ఎటువంటి మార్పు రాదు.

ఈ అంతర్గత ప్రభావాన్ని, సౌరగతి వలన మానవ శరీరంపై పడే ప్రభావాన్ని కవల పిల్లల ఉదాహరణతో చక్కగా తెలుసుకోగలుగుతాము. ఒకే అండం నుండి జన్మించే ఇద్దరు పిల్లలు గర్భాశయములో కలిసి వృద్ధి పొందుతారు. జన్మించిన తర్వాత వారిని ఇక్కడ ఎంత దూరంలో ఉంచినప్పటికీ వారి వ్యవహారాలు, ఆలోచనలు, అలవాట్లు ఒకే విధంగా ఉంటాయి. ఇవి ఒకే అణువుతో ఒకే ఆవరణలో పెరిగినందువలన కలిగిన పరిణామం. మానవులు, భూమి, సూర్యుడు కూడా ఇదే విధంగా ఒకే అణువు నుండి తయారు కాబడినందున సమాన అనుభూతి ఆధారంగా పరస్పరం ప్రభావితమౌతుంటాయి. ఈ సూత్రమే ఖగోళ విజ్ఞానానికి కేంద్రబిందువు. ప్రతి క్షణం, ప్రతి నిముషం పృథ్విలోని అణువణువూ, సూర్యుని మహా కణజాలం ఒక సంబంధ సూత్రం జోడించబడి ఉన్నాయి. నిరంతరం విద్యుత్ ప్రవహిస్తూ ఉండే రెండు కరెంటు తీగలు ఎలా కలిసి ఉంటాయో అలాగ మానవ జీవాణువులు ఆవిరాట్ స్వరూపంతో జోడించబడి ఉంటాయి.

ఈ సమానుభూతికి ఇప్పటి విజ్ఞానము ఒక క్రొత్త పరిభాష ఇచ్చింది. 'క్లినికల్ ఎకాలజీ' అనగా పర్యావరణ ప్రభావిత జీవ విజ్ఞానం అని అర్థం. ఇందులోనే సూర్యునిపై సంభవించే అన్ని సంఘటనలు, మచ్చలు, మరకలు, జ్వాలలు, భూమిని తాకే తుఫానులు, ఋతువులలో ఊహించని మార్పుల వలన ప్రాణుల మీద పడే ప్రభావం సంగ్రహం చేయబడుతుంది. ఇది చైతన్యవంతమైన చేతనా జగత్తు యొక్క ఒక లయబద్ధమైన పరోక్ష ప్రభావానికి ప్రత్యక్ష నిదర్శనం. ప్రతి పదకొండు సంవత్సరాలకు 'సన్‌స్పాట్' రావడానికి, సంవేదనాశీల వృక్షాలలో వర్తులాకారాలు ఏర్పడడానికి గల పరస్పర సంబంధం వైజ్ఞానికులను ఆశ్చర్యపరుస్తున్నది. సామాన్యంగా వృక్షాలకు ఎన్ని వర్తులాకారాలు ఉన్నాయో చూసి వాటి వయసును తేలికగా అంచనా వేయగలుగుతాము. ఎండలు ఎక్కువగా ఉన్నట్లయితే ఈ వలయాలు వెడల్పుగా తయారవుతాయి. కాలం ఉండవలసిన దానికన్నా అతి చల్లగా లేదా శుష్కించి ఉన్నట్లయితే ఈ వలయాలు సంకరం అవుతాయి, కలిసిపోతాయి. ఈ విధంగా కాలముల వ్యత్యాసం ప్రభావం ఎంతో దూరంలో ఉన్న భూమిపై గల వనస్పతులు, వృక్షసముదాయం మీద పూర్తిగా పడుతోంది.

వృక్షాలు - వనస్పతులు ఎంత సున్నిత తత్వం కలిగి ఉన్నవంటే కోట్ల మైళ్ల దూరాన ఉన్న సూర్యుని మీద సంభవించే పరివర్తనాలను అవి ప్రతిబింబిస్తాయి. అలాంటపుడు మానవ శరీరంలోని సూక్ష్మాతి సూక్ష్మ జీవకణాలు అతి సూక్ష్మ స్నాయునాళాల మీద వీటి ప్రభావం మరింత ఎక్కువ సమానుభూతిని కలిగిస్తుంది కదా! విజ్ఞాన వేత్తలు తమ పరిశోధనలలో ఈ విషయం తెలుసుకున్నారు కూడా. సౌరమండలంలో ఉన్న పల్సార్జ్ మరియు బ్లాక్ హోల్ నుండి వెలువడే న్యూట్రన్ కణాలు కాంతి వేగం కన్న వేగంగా బయలుదేరి భూమిని చేరుతాయి. ఇవి మానవ మస్తిష్కం యొక్క "మాయింజెన్" అణువులతో ఎక్కువ పోలిక కలిగి కలిసిపోతాయి. ఇదే విధంగా అతి సూక్ష్మ న్యూక్లియర్ ఆమ్లాల మీద కూడా వాటి ప్రభావం పడుతుంది. ఈ విధంగా సౌరకుటుంబంలోని గ్రహాల ప్రభావం భూమిమీద నివసించే జీవరాశి మీద పడి తీరుతుంది. వృక్షాల వలె మానవ మస్తిష్కంలో కూడా ప్రతి పదకొండు సంవత్సరాలకు వర్తులాలు కాని లేదా మార్పులు కాని సంభవిస్తాయా లేదా అన్న విషయం మాత్రం ఖచ్చితంగా తెలియరాలేదు. కానీ ఈ విరామంలో మానసిక బలహీనులకు ఉద్రేకం, ఉన్మాదం, అస్థిమితం చాలా తీవ్రంగా ఉంటుంది. ఆత్మహత్యకు పాల్పడుట, ఇతరుల మీద అకారణంగా పోట్లాటకు దిగుట, అనాలోచితంగా దుర్ఘటనలలో చిక్కుకొనుట వంటివి జరుగుతాయి. ఈ విరాట్ స్వరూపంలో అంతర్లీనంగా సంభవిస్తున్న ఆశ్చర్యకరమైన విశేషాలను తెలుసుకొనాలంటే సరైన ఖగోళ విజ్ఞాన అధ్యయనం అవసరం.

ఇప్పుడు విజ్ఞానం అంతరిక్షం ప్రాముఖ్యాన్ని తెలుసుకున్నది. వాయువు, జలముల అంతులేని సంపద ముంగిట్లో ఉన్నదని అందరూ ఎరుగుదురు. విద్యుత్, రేడియో,

**మంచి మిత్రుడే నిరాశలో ఆశను చిగురింపచేయగలడు.**

లేసర్ మొదలైన వాటి తరంగాలు ఆకాశములో ప్రవహిస్తుంటాయి. అంతర్గ్రహిత లాభాలు కూడా అదే రంగంలో లభిస్తాయి. అదృశ్య జగత్తు సంపద సూక్ష్మ అంతరిక్షంలో సమాహితమై ఉన్నదని ఆలోచనా తరంగాలు వీటి పరిసరాల్లోనే పరిభ్రమిస్తుంటాయన్న దానికి ఆధారాలు ఉన్నాయి. భూమండలంతో పోల్చినట్లయితే అంతరిక్షంలో ఉన్న సాధన - సంపదల గొప్పతనం స్థాయి అనేక రెట్లు అధికమని వాటి వలన స్పష్టపడుచున్నది.

ఆధ్యాత్మిక వేత్తలు అనాది కాలం నుండి తమ దృష్టిని అంతరిక్షం మీద కేంద్రీకరించి ఉన్నారు. వారి సాధన రంగం అదృశ్య జగత్తు, సూక్ష్మ జగత్తులే. సిద్ధులు, భౌతిక ఆధ్యాత్మిక శక్తులు ప్రత్యక్షంగా కనబడుతున్నప్పటికీ వాటి ఆర్జన పరోక్ష జగత్తు నుండి మాత్రమే సాధ్యపడుతుంది. మానవుని అంతరంగంలో వాటి బీజం ఉంటుంది. కాని అవి సువికసితమవడానికి, శక్తులు చేతికి రావడానికి అదృశ్య సూత్ర జగత్తు సహకారం తప్పనిసరి. సాధన జరుగుతున్నప్పటికీ, దైవశక్తుల సహకారం వల్ల మాత్రమే వాటి ప్రతిఫలం అనుభవంలోనికి వస్తుంది.

విషాక్తత పెరిగిపోవడంతో ఆకాశంలో కాలుష్యం విపరీతంగా నిండిపోయింది. ఈ కారణం వలన మనుషుల జీవన స్థాయి దిగజారిపోవడం ప్రారంభమయింది. దానితో పాటు ఇతర ప్రాణులు, మానవులకు కూడా దుర్బలత, రుగ్మతల శాపాలను భరిస్తూ అకాల మృత్యువు వాత పడడం మినహా మరో దారిలేక పోతున్నది. ప్రకృతి పరమైన ప్రకోపాలు కూడా ఇప్పుడు అధిక శాతం అనుభవించవలసి వస్తున్నది. భూమి ఏ విధంగా ఇతర గ్రహాల గమన విధులతో ప్రభావితమవుతుందో అదే ప్రకారం సౌరమండల చక్రంలో బంధించబడి ఉన్నందు వలన భూ వాతావరణం కూడా ఇతర గ్రహాల మీద తన ప్రభావాన్ని చూపుతుంది. అసంతులనం, ప్రకృతి ప్రకోపాలు, మనిషి ద్వారా కాలుష్యమైన భూ వాతావరణం కూడా అందుకు సహకరిస్తున్నదని పర్యావరణ పర్యవేక్షకులు వైజ్ఞానికులు అంగీకరిస్తున్నారు. ఈ విషాక్తతకు విరుగుడు-నివారణ చేయడానికి ఉపాయం ఎవరికీ తోచడం లేదు. అనంతాకాశంలోకి నెట్టివేయబడుతున్న అణుధూళి, ఇతర చెత్తా చెదారాల మీద చర్చలు జరుగుతున్నాయి. అది మనిషికి హానికారక ప్రభావాన్ని ఉత్పన్నం చేస్తుందా లేదా అన్న సందేహాల గురించి ఆలోచనలు సాగుతున్నాయి. అంతరిక్షంలో పెరుగుతున్న సాంకేతిక అభివృద్ధికి తోడు నానాటికి పెరిగిపోతున్న ఉపగ్రహాల సంఖ్య కూడా భవిష్యత్తులో చూడబోయే భయంకర దృశ్యాలను, నిరాశాపూరిత అంశాలను మన ముందుంచుతున్నది.

భౌతిక విజ్ఞానం దానికి సంబంధించిన సాంకేతిక విద్య ప్రాచీన కాలంలో ఇంత అభివృద్ధి చెందిఉండకపోవచ్చు. కాని ఏ ప్రయోజనాలను ఆశించి నేడు అంతరిక్ష వైజ్ఞానికులు ప్రయత్నాలు చేస్తున్నారో అవన్నీ ఖగోళవిజ్ఞానం ద్వారా గణితం ద్వారా చేయబడేవి. అంతరిక్షపు ఆవరణలో గ్రహ-నక్షత్రముల పరిస్థితి, వాటి వలన కలిగే లాభాలు - హానికారక ప్రభావాల జ్ఞానము ఖగోళ విజ్ఞానం ద్వారా తెలిసేది. ఇక ఆత్మ విజ్ఞానం ద్వారా వాటి వలన శుభాలను, లాభాలను పొందటం, ప్రతికూలతల నుండి రక్షించుకొనటం, ఉపచారాల విధి తెలిసేది. ఇప్పుడు మనం చేయవలసిన విధి ఏమంటే పోగొట్టుకున్న వెనుకటి ఈ మహా విద్యకు ఖగోళ జ్ఞానపు లంకెను కనుగొనవలసి ఉన్నది. ఈ విజ్ఞానాన్ని క్రొత్తకోణం నుండి తెలుసుకుంటూ దాని అడుగుజాడల్లో చేయీ చేయీ కలిపి నడిచినట్లయితే అంతరిక్షపు భౌతికమైన, ఇతరమైన సంపదలను పొందుట నిశ్చయం.

అధ్యాత్మ, విజ్ఞానం పరస్పరం సహాయ సహకారాలను అందించుకునేందుకై వేదాంత స్థాయిలోనే కాక అనేక ఇతర విషయాలలో కూడా ప్రయత్నాలు శాంతికుంజ్‌లో జరుగుతున్నాయి. వాటిలో జ్యోతిర్విజ్ఞానాన్ని క్రొత్త కోణం నుండి తెలుసుకునే ప్రయత్నం కూడా ఒకటి. దీని వలన ఋషి పరంపర ఆధారంగా నడిచిన భూతకాలపు కార్యక్రమాల గొప్పతనం తెలుసుకొనడమే కాక దాని ఆధునిక విజ్ఞాన సమ్మతమైన రూపాన్ని ప్రత్యక్షంగా చూడగలుగుతాము. ఈ సందర్భంగా దేవ సంస్కృతి విశ్వ విద్యాలయంలో ఖగోళ విజ్ఞాన విభాగం మాదైన శైలిలో అపూర్వమైన పరిశోధన జరుపుతూన్నది. ఇందువల్ల ఒక ఇంటి యజమాని ఏ విధంగా తన ఇరుగుపొరుగు వారితో ఇచ్చిపుచ్చుకునే సత్సంబంధాలు కలిగి ఉంటాడో అలా విశ్వగ్రహ కుటుంబంతో సత్సంబంధాలు నెలకొనే అవకాశం ఉన్నది.

అనువాదం- విజయకుమారి

**ఇచ్చి మరచిపో. తీసుకున్నది ఇవ్వడం మరవకు.**

## నావారితో నామాట- 2

# గాయత్రీ పరివార్ సంఘటనకు విస్తృత కార్యప్రణాళిక

మన యుగ నిర్మాణ ఉద్యమం ఎంత మహత్తరమైనదో దాని బాధ్యత అంత మహత్తరమైనది. పరమపూజ్య గురుదేవులు, పరమవందనీయ మాతాజీ అంతా చేసి మనముందుంచారు. ఈ యుగ పరివర్తన వేళలో 21వ శతాబ్దపు బ్రహ్మ ముహూర్తంలో మనం మరింత క్రియాశీలంగా, మరింత సంఘటితంగా తయారు కావడం మన అందరి బాధ్యత. 2004-2005 యుగచేతన విస్తరణ సంవత్సరం. ఇపుడు వరిష్ఠులుగా, విశిష్టులుగా మన కార్యప్రణాళికను రూపొందించుకోవాలి. దాని లక్షణం అమలు చేయాలి.

### మన పరివార్‌కు మూలాధారాలు ఆత్మీయత, సాధన

పరమ పూజ్య గురుదేవులు మన సంస్థను ఆధ్యాత్మిక భూమికపై నిర్మాణం చేశారు. సాధనను, ఆత్మీయతలను దానికి మూలాధారాలుగా ఏర్పరిచారు. లౌకిక స్థాయిలో మనకు రెండు సూత్రాలు అందించారు.

(1) మన సంస్థ ఒక ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థ (ఎన్.జి.ఓ) కాదు. సామాజిక పరివర్తన తేవడం కోసం ఏర్పడిన సంస్థ కాదు. ఈ సంస్థ సాధకుల సంస్థ. తమకు తాము సంస్కరించుకుని, సప్త మహావ్రతాలను జీవితంలో అనుష్ఠిస్తూ, స్నేహ సంవేదనల సూత్రంలో పరస్పరం బంధించబడిన సాధకుల సంస్థ. ఈ కుటుంబ భావన కారణంగానే ఈ సంస్థకు గాయత్రీ పరివార్ అని పేరుపెట్టారు.

(2) మన సంస్థ కార్య పద్ధతి మామూలు స్థాయికి చెందినది కాదు. ప్రజల ఆకాంక్షలకు, యుగ అవసరానికీ అనుగుణమైనది. విశ్వాస సంక్షోభపు నేటి తరుణంలో దేవమానవుల నుండి ఏది ఆశించబడుతున్నదో దానిని అందించగలుగుతూన్న కార్య పద్ధతి ఇది. ఉద్యమాలు, యోజనలు, కార్యక్రమాలు అన్నింటినీ కేంద్రబిందువు యుగ పరివర్తనయే. తనతో ప్రారంభించి ప్రతి పరిజనుడూ వ్యక్తి వ్యక్తినీ మార్చే నిరంతర ప్రక్రియను కొనసాగిస్తున్నాడు.

పై సూత్రాలు రెండూ మన సంస్థ ప్రత్యేకతలు ఇతర సంస్థలు అనేకం మత-సంప్రదాయ-సామాజిక సమస్యలు-ప్రజాసేవ ఆధారాలుగా నిలబడి ఉంటాయి. కాని రాజనీతి ఊబిలో, అహంకారాల పోటాపోటీలలో చిక్కుకుపోతాయి. ఎందుకంటే, నైతిక విప్లవం-ఆధ్యాత్మిక పునర్‌జాగరణపై ఆధారపడి అవి పని చేయవు. దిశ అనేది లేకుండా పని చేస్తూ కాలగర్భంలో కలసిపోతాయి.

గాయత్రీ పరివార్ ఆధ్యాత్మిక-నైతిక మూలాధారాలపై నడుస్తోంది. అన్ని మతాలలోని వివిధ కులాలు, సంప్రదాయాలకు చెందిన వ్యక్తులను కుటుంబాలను కలుపుకుని ముందుకుపోతోంది. కనుకనే, అది గత 35 సంవత్సరాలుగా ప్రజల అభిమానాన్ని చూరగొన్నది. దాని సభ్యుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. భావ పరివర్తన అనే తుఫాను లెక్కకు మిక్కిలి అయిన వ్యక్తులను, కుటుంబాలను ప్రభావితం చేసింది. ఫలితంగా వారందరి జీవన విధానాలలో పూర్తి మార్పు వచ్చింది. వారి ఆలోచన సరళి మారింది. జీవన విధానం సంస్కరణ పొందింది. వారు ఈ జాతి ఉద్ధరణ మహోద్యమంలో నిమగ్నం అయినారు. ఎంతటి సమగ్రమైన ఆలోచనతో ఈ మిషన్ వ్యవస్థ నిర్మాణం అయిందో భవిష్యత్తులో చరిత్రకారులు వర్ణిస్తారు. సమయదానం, అంశదానాలపై నిర్మాణం కావడం వల్ల ఈ సంస్థ ప్రజా ఉద్యమంగా రూపొందింది. నేడు అందరికీ ఆశా కేంద్రం అయింది.

**కర్తవ్యలోపం వద్దు. ఫల దాహమూ వద్దు.**

## గట్టి పునాది, బోలు పునాది

ఈ విషయమై పరమపూజ్య గురుదేవులు ఇలా వ్రాశారు-

"స్వరాజ్య ఉద్యమ సమయంలో రెండు పరిణామాలు జరిగాయి. మొదటిది ఒకరిని మించి ఒకరు భావనాశీలురు, విశుద్ధమైన శీలం కలిగిన వ్యక్తులు ఆ ఉద్యమంలో పాల్గొన్నారు. రెండవది - దేశంలోని ప్రతి వ్యక్తీ స్వరాజ్య అవసరాన్ని గుర్తించాడు. ఆ అవసరాన్ని పూర్తి చేయడానికై కాంగ్రెసు సంస్థ పని చేసింది. సరిగా ఇదే చరిత్రను యుగనిర్మాణ యోజన అక్షరాలా పునరావృతం చేస్తోంది. సరిగా అదే ఆధారంపై దానికి ప్రజల సహకారం అందుతోంది. అసాధ్యం అనిపించిన లక్ష్యం పూర్తిగా సాధ్యమైనదిగా కనిపిస్తోంది."

"ఒక సంస్థ సాఫల్యం అది శక్తిని సంపాదించడంపై దానికి గట్టి పునాది ఏర్పడడంపై ఆధారపడి ఉంటుంది. ఒక వ్యక్తి మరో వ్యక్తిని తయారు చేయాలి. ఇదే నిజమైన ఆధారం. ఇదే గట్టి పునాది. లౌడ్ స్పీకర్ల పొలికేకలు, పత్రికలలో సుదీర్ఘమైన వార్తలు - ఇవి. బోలు అయిన ఆధారాలు...... ఇవి పిల్లచేష్టలు, ఉద్యమాల పేరిట ఇలాంటి తమాషాలు ఎటు చూసినా కనిపిస్తున్నాయి. ఈ వైపరీత్యాల యుగంలో యుగనిర్మాణ యోజన తన విలక్షణమైన ఆధారంతో ముందుకు పోతోంది. వ్యక్తి వ్యక్తిని తయారు చేయడం, ఒక దీపం మరో దీపాన్ని వెలిగించడం-ఇదే మన సిద్ధాంతం......యుగనిర్మాణ యోజనకున్న యోజనకున్న మహత్తర సంపద ఈ పరివార్‌లోని పరిజనుల నిష్ఠ. దౌత్యనీతి, వ్యక్తిగతమైన దురాశ ఆధారంగా కాక- ధర్మంపట్ల అధ్యాత్మ పట్ల నిష్ఠ ఆధారంగా ఈ నిష్ఠ నాటబడింది, పెంచి పోషించబడింది. సంస్థలో పదవి పొందాలనే కోరిక ఎవరికీ లేదు. తమ ఫోటోలు పత్రికలలో ప్రచురింప జేసుకోవాలనే తహతహ ఎవరికీ లేదు. వీరి మధ్యలో మోసంతో, వేషంతో ఎవరైనా చొరబడడానికి ప్రయత్నిస్తే-నెమలిపై ఉన్న కాకిని ఎవరైనా ఇట్టే గుర్తుపడతారు. ప్రత్యేకత ఈ సంస్థలో లేకపోయి ఉంటే, దురాశలు ఈ ఉద్యమాన్ని ఏనాడో మింగివేసి ఉండేవి." ('సృజన సైనికోంకె సంగఠన్ కీ రీతి-నీతి' గ్రంథం నుండి)

పై వాక్యాలు నేటి పరిస్థితికి అక్షరాలా వర్తిస్తాయి. స్వరాజ్యం వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీకి దుర్గతి పట్టింది. ఎందుకంటే-మహాత్మా గాంధీ బోధనలు ఆ పార్టీ నాయకులకు రుచించలేదు. స్వరాజ్యం వచ్చిన తర్వాత రాజకీయాలు దిగజారిపోయాయి. నైతిక విలువలు పతనమైనాయి. ఉద్యమం పునాది నుండి నైతికత, ఆధ్యాత్మికతలు లోపించిపోవడం అందుకు కారణం. పరమపూజ్య గురుదేవులు తమ సంస్థను రాజకీయాలకు దూరంగా ఉంచారు. సంస్థకు కేంద్రబిందువుగా వ్యక్తి నిర్మాణాన్ని, వ్యక్తి మనస్సు నిర్మాణాన్ని ఏర్పరచారు. ఆ కేంద్రం ఆధారంగా కుటుంబ నిర్మాణం, సమాజ నిర్మాణం జరగాలని నిర్దేశించారు. అధ్యాత్మ చేతనయే వ్యక్తి నిర్మాణం చేయగలుగుతుంది. కనుకనే మన సంస్థకు పునాది అత్యంత సుదృఢంగా ఉంది. పెను తుఫానులు సైతం ఈ మహావృక్షాన్ని కదపలేకపోయాయి. పరమపూజ్య గురుదేవుల మహాప్రయాణం జరిగి 16 సంవత్సరాలు గడచినా పరమవందనీయ మాతాజీ మహాప్రయాణం జరిగి పది సంవత్సరాలు గడచినాయి. సంస్థ క్రమశిక్షణలో నిరంతరం ప్రగతి పొందుతూనే ఉంది. గాయత్రి యజ్ఞం సంస్కృతికి మూలాధారాలు. ఆ రెండింటిపై నిలచి సంస్థ దినదినాభివృద్ధి చెందుతోంది.

## ఆత్మసంతృప్తి తగదు

ఒకోసారి మనం కూడా మనకు లభించిన సాఫల్యం వల్ల తద్వారా అందిన కీర్తి వల్ల సమ్మోహితులము అయిపోతాం. ఉబ్బితబ్బిబ్బు అయిపోతాం. ఇది ఎంత హెచ్చుగా ఉంటుందంటే- తర్వాత ముందడుగు వేయవలసిన అవసరాన్ని మనం మరచిపోతాం. పరమేశ్వర స్థాయి సత్తా మార్గదర్శనంలో, సంరక్షణలో నిష్ఠతో నిండిన కృషి ఎన్నడు జరిగినా, సాఫల్యం లభిస్తూనే ఉంటుంది. శ్రీరామచంద్ర ప్రభువుతో పాటు వానర సైన్యం వారధి నిర్మించడం, గోప బాలురతో కలసి శ్రీకృష్ణుడు కంసునికి వ్యతిరేకంగా సత్యాగ్రహం చేయడం, బుద్ధుని ధర్మచక్ర ప్రవర్తన ఇందుకు ఉదాహరణలు. పరమపూజ్య గురుదేవులు, పరమవందనీయ మాతాజీల మార్గదర్శనంతో పని చేయడం వల్ల మనకు కూడా సాఫల్యం లభించింది. అశ్వమేధ యజ్ఞాలలో లక్షలాది వ్యక్తులను సమీకరించాం.

**ఆత్మవిశ్వాసం ఉంటేనే, ప్రార్థనలో సత్ఫలితం.**

పెద్దపెద్ద పనులు చేయించాం. 9 కుండముల, 24 కుండముల, 108 కుండముల యజ్ఞములు, చేసే కార్యకర్తలు అకస్మాత్తుగా ఒక విరాట్ సమ్మేళనానికి సంచాలకులు అయినారు. ఇది ఆ సమర్థ సత్తా సంరక్షణలోనే సాధ్యపడింది. అశ్వమేధ మహాయజ్ఞాలు మన మిషన్ యొక్క విరాట్ రూపాన్ని సామాన్య ప్రజానీకానికి చూపాయి. గాయత్రి తత్వజ్ఞానం, యజ్ఞదర్శనం, యజ్ఞశిక్షణ వ్యక్తివ్యక్తికీ అందాయి. రెండు విరాట్ మహా పూర్ణాహుతులు జరిగాయి. ఒకటి గురువరుల జన్మస్థలం ఆవల్‌ఖేడాలో. మరొకటి శాంతికుంజ్ తీర్థనగరంలో, లెక్కలేనంత మంది వ్యక్తులు సంస్థలో వచ్చి చేరారు. 2000 సంవత్సరం పూర్తయేసరికి మనం ఒక విరాట్ సంస్థగా ప్రజలందరి సమక్షంలో నిలిచాము.

ఆనాటి సాఫల్యాలతో ఉబ్బిపోయి ఉంటే, మనం నేటి ఈ స్థితి చేరేవాళ్లం కాము. 21వ శతాబ్దం రాగానే సంఘటనాత్మకమైన కృషి ప్రారంభమయింది. మన సంపర్కంలోకి వచ్చిన వారిని ఒక సమర్థవంతమైన సమూహంగా అనుశాసనంలో బద్ధమైన విభాగంగా రూపొందించే కృషి జరిగింది. ప్రఖర సాధనా సంవత్సరం సంఘటన సశక్తీకరణ సంవత్సంములలో జరిగిన కృషి ఫలించింది. గుంపు గురించి ఆలోచించేవారు దూరమయ్యారు. అనుశాసనాన్ని పాటించే సాధకులు కలసికట్టుగా పని చేశారు. ఎర్ర కాగడా నీడన సంఘటనలో బద్ధులైనారు. అయినప్పటికీ జాగ్రత్తలు తీసుకోవడం అడుగడుగునా అవసరమే. కనుక ఇక ఈ అఖిల విశ్వ గాయత్రీ పరివార్ అనే విరాట్ సంస్థ యొక్క క్షేత్రీయ పునాదిని - దేశమంతటిలో విశ్వమంతటిలో వ్యాపించిన వ్రేళ్లను బలపరచాయని ప్రజా అభియాన్ పక్ష పత్రిక ద్వారా అఖండ జ్యోతి ద్వారా మన ఇతర పత్రికల ద్వారా మార్గదర్శనం చేయబడుతోంది. ఇందుకోసం సంస్థను వికేంద్రీకరించాలనే ఆలోచన అమలు జరుగుతోంది.

ప్రచారాత్మకం, నిర్మాణాత్మకం, సంఘర్షణాత్మకం అనే మూడు ప్రక్రియల ద్వారా యుగ నిర్మాణ యోజన అమలు జరుగుతోంది. పరమపూజ్య గురుదేవులు మధురలోని గాయత్రీ తపోభూమి నుండి దీనిని ప్రారంభించారు. 1971-72 తర్వాత శాంతికుంజ్ నుండి దీనికి మార్గదర్శనం చేశారు. మహిళా జాగరణ ఉద్యమం నుండి జాతీయ సమైక్యతా మహాసమ్మేళనాల ఏర్పాటు, విరాట్ దీప మహాయజ్ఞాల సంచాలన వరకు దీని లక్ష్యం ఒకటే. ఉద్యమ రూపంలో ఉన్న మన సంస్థ సంఘటనగా రూపొందడమే. శక్తిపీఠాలు నిర్మాణం అయినాయి. ప్రాంతీయ సమ్మేళనాలు జరిగాయి. గాయత్రీ పరివార్ శాఖలతో ప్రారంభమై, ప్రజ్ఞామండలులు, స్వాధ్యాయ మండలులు, మహిళా మండలులుగా విభజింపబడి వికేంద్రీకృతం అయింది. ఈ మధ్య కాలంలో దేశమంతటిలో నడుస్తూన్న సాధనాత్మక కృషికీ, రజవందన సమ్మేళనాలకు, ధర్మప్రచార పదయాత్రలకు, సైకిల్ యాత్రలకు, ఆతర్వాత దేవసంస్కృతి విశ్వవిద్యాలయ యోజనకు పరమవందనీయ మాతాజీ సంరక్షణ, మార్గదర్శనం ప్రసాదించారు. ఇదంతా 1991 నుండి 2000 వరకు జరిగింది.

## వికేంద్రీకృత వ్యవస్థ పునర్నిర్మాణం

సంస్కార మహోత్సవాల విరాట్ పరంపర తర్వాత - సాధనపై ఆధారపడిన ఈ సంస్థకు ఋషిద్వయం ఆదేశాల మేరకు వికేంద్రీకృత వ్యవస్థ రూపుదిద్దుకున్నది. ఈ విరాట్ సంస్థకు ప్రాథమిక విభాగం ప్రజ్ఞామండలి అని పరమ పూజ్య గురుదేవులు నిర్దేశించారు. ఇవి ఒకటి అయిదుగా, అయిదు ఇరవై అయిదులుగా పెరగాలని వారన్నారు. కాల ప్రవాహంలో ఈ ధార ఎక్కడో లోపించిపోయింది. ఈ పొరపాటును మనం సరిదిద్దుకున్నాం. ప్రజ్ఞాపుంజములుగా విభజించబడిన సంఘటనను పూర్ణాహుతికి సంవత్సరం ముందునుండి బలీయమైన ఆధారం ఇవ్వబడుతూ వచ్చింది. ప్రజ్ఞామండలులు గ్రామాలలో ఏర్పడ్డాయి. పేటలలో, నగరాలలో కూడా ఏర్పడ్డాయి. తమతమ క్షేత్రాలలో బాధ్యతలను నిర్వహించసాగాయి. శాంతికుంజ్ ద్వారా రిజిస్టరు అయినాయికూడ. వీటి మొత్తం సంఖ్య ఇప్పుడు సుమారు లక్షలకు చేరుకున్నది. ఆస్తికతా సంవర్ధనం, విద్యా విస్తరణ, భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్ష ప్రచారం, నిర్వహణ, నిరక్షరాస్తతా నిర్మూలన, మాదక ద్రవ్యాల అలవాటు మాన్పించడం, ఆరోగ్య అభివృద్ధి, స్వావలంబన - సహకార

మన మనసు ఒక సారవంతమైన నేల. అందులో దేనినైనా పండించవచ్చు.

భావాలు ఆధారంగా గోశాల ఉద్యమం, పర్యావరణ - మొక్కలు నాటడం మున్నగు పనులను చేపట్టవలసిందిగా ఈ ప్రజ్ఞామండలులను కోరడం జరిగింది. వీటికి క్రమబద్ధమైన రూపం ఇవ్వబడింది.

పూర్ణాహుతి తర్వాత సంఘటనాత్మక వ్యవస్థలో అంతర్భాగంగా - క్రియాశీలంగా ఉన్నపెక్కు మండలులను (5 నుండి 40 వరకు) కలిపి **సక్రియ సంగఠిత సమూహ (స3)** ఏర్పరచబడింది. ఒక పెద్ద నగరంలో ఇలాంటి పెక్కు సమూహాలు ఏర్పడ్డాయి. గ్రామీణ ప్రాంతాలలో 10-12 గ్రామాలకు ఒక సమూహం బాధ్యత స్వీకరించింది. ప్రజ్ఞామండలులు, మహిళా మండలులు 2000-5000 జనసంఖ్య గల క్షేత్రం బాధ్యతను స్వీకరించాయి. ఒక సక్రియ సంగఠిత సమూహ (స3) 30,000 నుండి ఒకటిన్నర - రెండులక్షల జనసంఖ్య కలిగిన క్షేత్రానికి బాధ్యత స్వీకరించాయి. ప్రతి సక్రియ సంగఠిత సమూహ ఒక సమన్వయ సమితిని ఏర్పరచుకోవాలని చెప్పబడింది. కేంద్రానికీ, క్షేత్రానికీ మధ్య ఇచ్చి పుచ్చుకునే ప్రక్రియను ఏర్పరచడం, పరస్పర సమన్వయం సాధించడం, సమయదానుల ద్వారా వివిధ ఉద్యమాలను నిర్వహించడం ఈ సమితి పనులు. క్రియాశీలురూ, అనుభవజ్ఞులు అయిన కొందరు పరిజనులు సహకారాలు - సమీక్షకులుగా ఏర్పరచబడ్డారు. పదివేల వజ్రాలతో కూడిన హారాన్ని ధరించాలని నా మనసు కోరుతుంది - అని పరమపూజ్య గురుదేవులు సూక్ష్మీకరణ సాధన అనంతరం వజ్రోత్సవ సంవత్సరంలో చెప్పారు. స3 స్థాయి కలిగిన 10,000 ప్రామాణిక సమూహాలు దేశంలో స్థాపించబడాలన్నది ఆ మాట చెప్పడంలో ఆయన ఉద్దేశ్యం. ఆ సమూహాల ద్వారా 100కోట్ల జనసంఖ్యను ప్రభావితం చేయవచ్చున్నది ఆయన అభిప్రాయం. ఇప్పుడు మన ఆ పనే చేస్తున్నాం.

## సమన్వయ సమితులు, జోన్‌లు

వివిధ సక్రియ సంగఠిత సమూహాలు(స3), వాటి సమన్వయ సమితులు, సంయుక్త సమన్వయ సమితులు (సం.స.స) - ఇవి నిర్వహించే బాధ్యతల కోసమై సమర్థ సమయదానీ సహయోగీ సమూహ (స4)ల స్థాపన జరిగింది. ఈ (స4)ల పని ఇది - పరిజనులతో విస్తృత స్థాయిలో సంపర్కం చేయడానికీ వివిధ ఉద్యమాలను వేగవంతం చేయడానికీ పెద్ద సంఖ్యలో సమయదానులు, సహయోగుల వికాసం, నియామకం, సమర్థ సమయదానులు (ఒక నెలనుండి ఒక సంవత్సరం లేదా ఆజీవనం), వారి సమర్థ సహకారాలు సంయుక్త వ్యవస్థ స4గా క్రియాశీలం చేయబడింది. ఇవి గ్రామ పంచాయతీ, పేట, వార్డు లేదా క్షేత్రం స్థాయిలో ఉండవచ్చు. బ్లాకు స్థాయిలో, మండల స్థాయిలో, తాలూకా స్థాయిలో, జిల్లా స్థాయిలో ఉండవచ్చు. సంయుక్త సమన్వయ సమితులతో కూడ వీటికి భాగస్వామ్యం ఉండవచ్చు.

ఒక క్షేత్రంలోని స4, స3లతోపాటు జిల్లాస్థాయి సమన్వయ సమితులను కూడ గత సంవత్సరం వివిధ జోన్‌లుగా విభజించారు. ఏడు ప్రముఖ జోన్‌లు ఏర్పాటయినాయి - 1.వాయువ్య భారతం, ఉత్తరాంచల్, 2.ఈశాన్య భారతం, 3.దక్షిణ భారతం, 4.గుజరాత్, రాజస్థాన్, 5.బీహారులోని తరాఈ భాగం, ఉత్తర ప్రదేశ్, 6.ఛత్తీస్‌గఢ్, 7.మధ్య క్షేత్రం, (మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహారుల అధికభాగం). ఈ జోనల్ కేంద్రాలకు ఉపజోనల్ కేంద్రాలుకూడా ఏర్పాటయినాయి. ఇప్పుడు ఇవి 24 ఉన్నాయి. ఇవి 40 వరకు పెరగవచ్చు. ఒక నెట్‌వర్కింగ్ సిస్టమ్‌లో వీటిని శాంతికుంజోతోను, గాయత్రీ తపోభూమితోను అనుసంధానం చేస్తున్నారు.

ఈ మొత్తం వ్యూహరచనను నడపడానికై కేంద్ర ప్రతినిధులు నియమించబడ్డాయి. ఈ ఉద్దేశ్యంతోనే 2004 ఫిబ్రవరి 6,7,8లలో శాంతికుంజ్‌లో ఒక వర్క్‌షాప్ (కార్యశాల)ను నిర్వహించారు. దీని ఫలితం ఎంతో ప్రోత్సాహకరంగా ఉంది. ఇక ఈ వర్క్‌షాప్ నాలుగు నెలలకు ఒకసారి ఏర్పాటు చేయబడుతుంది. మిషన్ యొక్క సంఘటనాత్మక ఆధారం ఎలా నిర్మాణం అవుతున్నది, ఒక చిన్న విభాగం నుండి కేంద్రంవరకు వ్యవస్థ ఎలా నుడుస్తుంది - అనే విషయాలను వచ్చే సంచికలో వివరంగా చదవండి.


Ð(Ç¡ºŒÈò=KÓ<-ŒH..Õ)

**మనసులోపలి సత్‌ప్రేరణలకు క్రియారూపం ఇస్తే అఖండ విజయం తథ్యం.**

ధారావాహికం: దివ్యజీవన దర్శనం - 6

# సత్యం పరం ధీమహి

భాగవతం పండిట్‌జీకి ప్రతియతమమైన గ్రంథం. పురాణం చెప్పేటప్పుడే కాక, మామూల సంభాషణలో కూడా వారు భాగవత చర్చ తరచుగా చేసేవారు. ఇంటిలో విద్వాంసులు ఎప్పుడూ ఉండేవారు. చిన్న చిన్న సందర్భాలలో కూడ ఆవరు భాగవత శ్లోకాలు వినిపించేవారు. అన్ని విధాల సమస్యలకూ వాటిలో పరిష్కారాలు చూపేవారు. వారు పొరుగూళ్లకు వెళ్లిన సమయాలలో సైతం ఆయన కోసం వెదుకుతూ భవంతికి వచ్చేవారు. వారు ఇంటివద్ద ఉంటే, ఇక చెప్పేదేముంది? తాఈజీ అప్పుడు మూడేళ్ల శ్రీరామ్‌ను వారికి అప్పగించేది. పండిట్‌జీ ప్రజలు చెప్పే మాటలు వినేవారు. వాటికి పరిష్కారాలు చెప్పేవారు మామూలు విషయాలపై చర్చించేవారు శ్రీరామ్ అక్కడే ఉండేవాడు. బాల్య క్రీడలలో నిమగ్నం అయేవాడు. లేదా, మౌనంగా వారి మాటలు వినేవాడు. మూడు నాలుఏళ్ల పిల్లవాడికి శాస్త్ర చర్చలూ, తత్వ దర్శనం, భక్తి - జ్ఞాన - వైరాగ్యాల రహస్యాలు అర్థం కావడ్ కష్టం కావచ్చు. అయినా, ఆ ఆధ్యాత్మిక చర్చలు వాతావరణంనుండి సంస్కారాలను మాత్రం అతడు గ్రహించేవాడు. ఆ బలునిలో పూర్వ జన్మ సంస్కారాలు సమృద్ధిగా ఉన్నాయి. కొత్త సంస్కారాల అవసరం ఉండేది కాదని చెప్పవచ్చు. అయితే ఆ వాతావరణం ఆయా సంస్కారాల వెలికిరావడానికి దోహదం చేశాయి.



పద్మపురాణంలోని భాగవత మహిమ ఘట్టాన్నీ, ఏకాదశ స్కంధంలోని అంశాలనూ తండ్రిగారు చర్చించే సమయంలో మూడు నాలుగేళ్ల శ్రీరామ్ మౌనంగా అక్కడ కూర్చునేవాడు. తండ్రిగారి ముఖంవంక తదేక దృష్టితో చూచేవాడు. తాఈజీ చెప్పేవారు - నారద మహర్షికీ, భక్తికీ మధ్య జరిగిన సంభాషణను విన్నపుడు శ్రీరామ్ ఉదాసీనంగా ఉండేవాడని.

**ఆ సంఘటన ఇది** :-

యమునా తీరంలో భక్తి దుఃఖంతో, మనోవేదనతో కూర్చుని ఉంది. ప్రక్కనే ఇద్దరు ముసలివాళ్లు స్పృహ తప్పిపడి ఉన్నారు. వారికి స్పృహ తేవడానికి చేసే ప్రయత్నంలో ఆమె మరొకరి సహాయం కోసం ఎదురుచూస్తోంది. ఇటూ అటూ దృష్టి సారిస్తోంది. కొందరు స్త్రీలు ఆమెకు ధైర్యం చెపుతున్నారు. అనుకోకుండా నారద మహర్షి అక్కడకు వెళ్లాడు. ఎవరు నీవు? - అని ఆ యువతిని అడుగుతాడు.

ఆ స్త్రీ ఇలా అన్నది - నా పేరు భక్తి.జ్ఞాన, వైరాగ్యాలు నా కుమారులు. వారు వృద్ధులు అయిపోయారు. నా ప్రక్కన ఉన్న స్త్రీలు గంగ, యమున మున్నగు నదులు. ఇవి నాకు సేవ చేస్తున్నాయి. అయినా నా దుఃఖం తొలగిపోవడం లేదు. అందుకు కారణం ఉంది. పాషండులు నన్ను అవమానించారు. వారి మోసంవల్ల, కపటంవల్ల, దురాచారాలవల్ల నాకు జబ్బుచేసింది. నేను బలహీనపడ్డాను. ఇక్కడ బృందావనానికి రావడంవల్ల నా రోగం, నా దైన్యం తగ్గాయి. కానీ, నా కుమారు లిద్దరి ముసలితనం తొలగిపలేదు.

ఇలా చెపుతూ భక్తి విలపించసాగింది. నారద మహర్షి భక్తికి భాగవతాన్ని ఉపదేశిస్తాడు.

భక్తి ఏడుపు విని నాలుగేళ్ల పిల్లవాడు కన్నీరు కార్చాడు. తండ్రిగారు కథ చెప్పుకుపోతున్నారు. భాగవతం విన్న భక్తి ఉద్ధరించబడింది. ఆమె పుత్రులు ఇద్దరూ కూడ ఆరోగ్యవంతులు, యౌవనులు అయినారు.

ఈ కథ చెపుతూ తండ్రిగారు ఇలా అన్నారు- భాగవత శాస్త్రం అన్ని శాస్త్రాలకూ సారం. మనం ఈనాడు అనుసరిస్తున్న సనాతన ధర్మం ఈ శాస్త్రంనుండే వచ్చింది. జ్ఞానం, విద్య, ఆచారం, అవతారం, భక్తి, కర్మ, మంత్రం, యోగం, సాధనం, ఇతిహాసం, పురాణం మున్నగునవి భాగవతంలో ఇమిడి ఉన్నాయి.

తండ్రిగారి ముఖ భంగిమ చూచి బాలుడు శ్రీరామ్ కూడ సాంత్వన చెందుతాడు. అతడు లేచి, ఆటపాటలలో మునిగిపోతాడు.

**ఆరోగ్యం పరమ లాభం.**

## 'గ' అనగా గాయత్రి

భవంతిలో జరిగే ఆధ్యాత్మిక చర్చలతో అక్కడి ప్రారంభమయింది. శాస్త్రోక్తమైన అక్షరాభ్యాసం నాలుగేళ్ల నిండిన తర్వాత జరిగింది. తమ సాన్నిధ్యంలోనే బాలుడు వేద శాస్త్రాలన్నీ చదవవచ్చునని పండిట్‌జీ భావించారు. అయితే విద్యాభ్యాసానికి గురువు సాన్నిధ్యం మరింత అవసరమని వారు నిర్ణయించారు. ఆ చిన్న గ్రామంలో పండిత రూపరామ్ అనే అధ్యాపకుడు ఉన్నాడు. ఆయన తన ఇంటిలోనే విద్యాలయాన్ని నడుపుతున్నారు. పండిట్‌జీ శ్రీరామ్‌ను ఆయనకు అప్పగించారు. తా-ఈజీ ఆ అక్షరాభ్యాస సంఘటనను ఇలా వర్ణించారు -

పూజ అనంతరం అధ్యాపకుడు పలకను శ్రీరామ్ చేతిలో పెట్టాడు. ఆ పలక తెల్లగా ఉంది. కర్ర పలక. ఆ రోజుల్లో రాతి పలకల వాడకం ఉండేది కాదు. ఒకొక్క స్థలంలో ఒక్కొక్క పద్ధతిలో అక్షరాభ్యాసం చేయించేవారు. పండిట్ రూపరామ్ నీళ్లలో ఎర్రమన్ను కలిపి అక్షరాలు నేర్పేవారు. ముందు పలకకూ, ఎర్రమన్నుకూ పూజ జరిగింది. ఆ తర్వాత ఆయన మొదటి అక్షరం దిద్దించసాగారు. ఆయన బలపాన్ని ఎర్రమన్ను నీళ్లలో ముంచి, దానిని శ్రీరామ్ చేతుల్లో పెట్టారు. ఆ తర్వాత అతడి చేయి పుచ్చుకుని పలకమీద మొదటి అక్షరం వ్రాయిస్తూ, 'గ' అన్నారు. శ్రీరామ్ వెంటనే తానుకూడ 'గ' అన్నాడు. ఆ అక్షరం గుర్తుండడానికి ఏదోమాట చెప్పేలోగా శ్రీరామ్ 'గ-గాయత్రి' అన్నాడు. తాను చెప్పకుండా విద్యార్థి అక్షరానికి గుర్తుగా మాట చెపుతాడని అధ్యాపకుడు ఊహించలేదు. అదీ తనకు నచ్చిన విధంగా చెపుతాడని అసలు ఊహించలేదు.

'గ' అక్షరానికి గుర్తుగా 'గణేష్' శబ్దాన్ని చెప్పడం ఆచారం 'గణేష్' శబ్దంద్వారా 'గ'ను గుర్తించడం వల్ల విద్యార్థి బుద్ధికి సంస్కారం కలుగుతుందని ఆయన నమ్మకం. గణపతి బుద్ధికి అధిష్ఠాన దేవత. కనుక గణేశ పదంతో అక్షరాభ్యాసం చేయడం శుభదాయకమని ఆయన భావం. అధ్యాపకులు చెప్పకుండానే గాయత్రితో బాలకుడు అక్షరాభ్యాసం చేయడం అధ్యాప కున్ణేకాకుండా ఉత్సవంలో పాల్గొన్న అందరినీ ఆశ్చర్యంలో ముంచివేసింది. 'గ అంటే గాయత్రి' అని నీకు ఎవరు చెప్పారు? - అని అధ్యాపకుడు శ్రీరామ్‌ను అడిగారు. 'ఎవ్వరూ చెప్పలేదు. భవంతిలో విన్నాను. ఈ కథను తండ్రిగారుకూడ భాగవత సప్తాహంలో చెపుతూ ఉంటారు - అని శ్రీరామ్ సమాధానం చెప్పాడు. అధ్యాపకుడు పండిత రూపరామ్‌తో పాటు పండిత రూపకిశోర్‌జీకూడా గద్గదులు అయినారు. వారిద్దరూ బాలుని తల నిమిరారు. ప్రేమగా వాసన చూచారు.

ఆరోజుల్లో తల్లిదండ్రులు తమ పిల్లలను అధ్యాపకునివద్ద ఉంచడమే శ్రేయస్కరమని భావించేవారు. విద్యార్థి అధ్యాపకుని వద్ద ఎంత ఎక్కువ గడిపితే అతడికి అంత బాగా చదువు వస్తుందని నమ్మేవారు. పండిత రూపరామ్ పాఠశాలలో 15-20 మంది విద్యార్థులు ఉండేవారు. చుట్టుప్రక్కల గ్రామాలనుండి వచ్చిన పిల్లలు కూడ ఉండేవారు. చదువుకోసం వచ్చే విద్యార్థుల సంఖ్య దీనికి 2 - 2 1/2 రెట్లు ఉండేది. ఇందరు విద్యార్థులు రాత్రింబవళ్లు ఉండేవారు. కొందరు విద్యార్థులు వస్తూ పోతూ ఉండేవారు. ఒకోరోజు అక్కడే నిద్రపోయేవారు. ఒకోరోజు ఇంటికి వెళ్లేవారు. పండిత రూపరామ్ విద్యార్థులందరి పట్లా వాత్సల్యం చూపేవారు. విద్యార్థులు చదవడం, తినడం, త్రాగడం, నిద్రపోవడం, కూర్చోవడం, మాట్లాడడం-అన్నింటిలో ఆయన క్రమశిక్షణ అమలుపరచేవారు. అయితే ఆ అనుశాసనం రుద్దబడేది కాదు. స్నేహంతో, తీయని గారాబంతో ఆ అనుశాసనం విద్యార్థుల లోపల మేలుకొల్పబడేది. ఉదాహరణకు- పాఠశాలలోకానీ, తన ఇంటిలోకానీ నిద్రపోయే విద్యార్థులకు ఉదయంపూట ఆయన స్వయంగా నిద్రలేపేవారు. పిల్లలు అలసిపోయేవారు కారు. అయినా వారు నిద్రలేవడం ఆలస్యం అయ్యేది. అలవాటు లేకపోవడంవల్ల కొందరు నిద్రపోకపోయినా ప్రక్కమీద పడుకుని ఉండడానికి ఇష్టపడేవారు. ఉదయం త్వరగా నిద్రలేని అలవాటు ఏర్పరచడానికై అధ్యాపకుడు స్వయంగా పిల్లలవద్దకు వెళ్లేవారు. వారిని ఆప్యాయంగా పిలిచేవారు. లేపేవారు. ఉషఃపానం చేయించేవారు. స్నానాదులు చేయించి చదువుకోవడానికి కూర్చోబెట్టేవారు.

## గాయత్రి బ్రాహ్మణునికి కామధేనువు

బాలుడు శ్రీరామ్ భవంతిలోనే పడుకునేవాడు. ఉదయం 7 గంటలకు అతడు క్రమం తప్పకుండా పాఠశాల చేరేవాడు. సాయంత్రం వరకు అక్కడే చదువుతూ ఉండేవాడు. ఆతర్వాత ఇంటికి తిరిగివచ్చేవాడు. అయిదారు సంవత్సరాలు ఇలా విద్యాభ్యాసం సాగింది. ఆతర్వాత తండ్రిగారితో కలసి కాశీకి యాత్ర ప్రారంభమయింది. శ్రీరామ్‌కు ఉపనయన దీక్ష మాలవ్యాజీ స్వయంగా ఇస్తారని బెనారస్ హిందూ విశ్వవిద్యాలయస్థాపన సమయంలో నిర్ణయమయింది. ఆ

**సంతోషం పరమ ధనం.**

నిర్ణయాన్ని దృష్టిలో ఉంచుకుని 7-8 సంవత్సరాల సమయంలో పిల్లవాడిని ఉపనయనం జరపలేదు. కాశీ వెళ్లిన తర్వాత మాలవ్యాజీ గృహంలోనే నిరాడంబరంగా జరిగిన ఉత్సవంలో ఉపనయనం జరిగింది. ఆ సంస్కారం ఇస్తున్న సమయంలో గాయత్రి సర్వవేదమయం అనీ, బ్రహ్మస్వరూపం అనీ ఆ సంస్కారం ఇస్తున్న సమయంలో మాతాజీ ఇచ్చిన ఉపదేశం తిరుగు ప్రయాణంలో ప్రతి క్షణం బాలుని చెవులలో మారుమ్రోగింది. నిగూఢంగానూ ఉంది, సహజ సులభంగానూ ఉంది.

బాలుడు శ్రీరామ్ తన అవగాహణ మేరకు ఆ ఉపదేశం గురించి తండ్రిగారిని పెక్కు ప్రశ్నలు - గాయత్రి బ్రాహ్మణునికి కామధేనువని ఎందుకన్నారు? బ్రాహ్మణుడంటే ఎవరు? గాయత్రీ సిద్ధి ఎవరికి కలుగుతుంది? బ్రాహ్మణునికి గాయత్రీ సిద్ధి జరిగితే, ఈ కులంవారు దీనులుగా, హీనులుగా ఎందుకు ఉన్నారు? గాయత్రికి ఎవరు శాపం ఇచ్చారు? ఆ శాపానికి విమోచనం ఎలా జరగాలి? ఇలాంటి ప్రశ్నలన్నింటినీ సమాధానాలు త్రోవనోనే అందాయి. తను తండ్రిగారు ఇచ్చిన సమాధానాలన్నింటినీ గురుదేవులు అనంతర కాలంలో వివిధ సమయాలలో పేర్కొని ఉన్నారు. ఆ వివేచన ముందు ముందు గాయత్రీ సాధన రహస్యాన్ని స్పష్టంగా విప్పిచెపుతుంది. ఇప్పటికి ఇంతవరకే- ఉపనయనం తర్వాత బాలుడు శ్రీరామ్ సంధ్యా గాయత్రీ ఈ విషయంలో గాఢంగా నాటుకున్నది- జపం ప్రారంభించాడు. అతడి మనస్సులో సంధ్యావందనం చేయకపోతే యజ్ఞోపవీతం దీక్షకు భంగం జరుగుతుంది. వ్యక్తి వ్రాత్య సంజ్ఞకుడు అవుతాడు. అనగా అతితుడు అవుతాడు. ఉపనయన సంస్కారం సమయంలో జరిగిన పునర్జన్మ, అనగా మానవ జీవనం స్తంభించిపోతుంది. అతడు తాను ద్విజుడు అని చెప్పుకునే అధికాన్ని అతడు కోల్పోతాడు.

వారణాసినుండి తిరిగివచ్చిన తర్వాత బాలుడు శ్రీరామ్ తమ భవంతిలో తనకోసం ఒక గది కేటాయించుకున్నాడు. అక్కడ ఆయన జపం, ధ్యానం చేసేవాడు. సంధ్యావందనం కోసం ఆరుబయటకు వెళ్లేవారు. అందుకై ఇంటి డాబామీదకు వెళ్లేవారు. ఊరిబయట ఉన్న సివాలయానికి వెళ్లేవాడు. తను పొలంలో ఉన్న వటవృక్షం నీడకు కూడ వెళ్లేవారు. కుమారుడు జప, ధ్యానాలలో ఇంతగా తన్మయుడు కావడం చూచి తండ్రిగారు ఎంతో ఆనందించేవారు. శ్రీరామ్ తన బ్రాహ్మణత్వాన్ని సార్థకం చేసుకుంటాడనీ, తనను మాత్రమే కాక తన కులం మొత్తాన్ని, గాయత్రీ ఉపసాకులను ధన్యులను చేస్తాడనీ ఆయన చెప్పేవారు. ఆయన ఉద్దేశం ఆ పేరుగల ఏదో ఒక కులంలో పుట్టిన వ్యక్తి అని కాదు. ఎవరి ఆచరణ విశుద్ధమైనదో అతడు బ్రాహ్మణుడనీ, బ్రహ్మను తెలుసుకోవడానికీ, పొందడానికీ తనుకు తాను తపిపజేసుకునేవాడు బ్రాహ్మణుడనీ ఆయన మామూలు మాటలలో చెప్పేవారు.

ఇంటి డాబామీద ఉన్న 'ఆలయం'తో వటవృక్షం క్రింద, వినీల ఆకాశం క్రింద బాలుడు శ్రీరామ్ జప ధ్యానాలు సాగుతున్నాయి. ఉజదయం సుమారు 5 గంటలకు ఆయన, నిద్రమేలుకొండంకోసం కూర్చుంటాడు. తూర్పున వ్యాపించే సమయానికి సంధ్యా, గాయత్రీ జపములతో పాటు సవితా దేవతలయొక్క బంగారు వెలుగుపై ధ్యానంకూడ పూర్తయ్యేది. సంధ్యకు సంబంధించిన పనులన్నీ 'అనేక సంధ్యోపాసనేన కర్మణా శ్రీ పరమేశ్వరః ప్రీయతాంన మమ । "ఓం తత్సద్ బ్రహ్మార్పణమస్తు" అని చెప్పిన తర్వాత జరిగేవి. ఈ వాక్యంతో పాటు జపసాధన పుణ్యం పరమాత్మకే అర్పించి, బాలుడు రూపరామ్ పాఠశాలకు వెళ్లేవాడు. అక్కడ విద్యాభ్యాసంతో పాటు ఆచారాదుల అభ్యాసం జరిగేది. సాయంత్రం కూడ సూర్యాస్తమయానికి సరిగ్గా ముందు సాయం సంధ్య ప్రారంభమయ్యేది. నక్షత్రాలు కనిపించేసరికి ఈ సంధ్యా కర్మకూడ పరబ్రహ్మకు సమర్పితం అయ్యేది. ఈ దినచర్య నాలుగైదు సంవత్సరాలపాటు సాగింది.

నియమానసారం నిర్ణీత సమయంలో విధ్యుక్తంగా చేయబడిన గాయత్రీ జపం వ్యక్తిని వేగంగా ఆధ్యాత్మిక ఔన్నత్యాలవైపు కొనిపోతుందని శాస్త్రం చెపుతోంది. విధ్యుక్తం అంటే అర్థం తన సాధనలో శ్రద్ధా విశ్వాసాలు ఉండడం. చేస్తున్న దానిపట్ల, బోధించబడుతున్న దాని పట్ల ప్రత్యక్ష విశ్వాసం. గాయత్రి కామధేనువు అని చెప్పితే, దానిని ఆవిధంగా నమ్మడం, గాయత్రి గొప్పతనాన్ని చెప్పడానికే ఈ విషయం చెపుతున్నారు. నిజం మరోలా ఉండవచ్చునీ సందేహం. కలగకపోవడం, శ్రద్ధ వ్యక్తిని సిద్ధి మార్గానికి తీసుకువెళతాయి

## సాధన ఒక క్రీడ

బాలుడు శ్రీరామ్ ప్రాతః సంధ్య, సాయం సంధ్య, గాయత్రీ జపాలతోపాటు పగలుకూడ ధ్యానం అభ్యాసం చేస్తున్నారు. పాఠశాలలో అతడికి ఇష్టమైన ఆట ఇది.

**విశ్వాసం పరమ బంధువు.**

అధ్యయనంలో తీరిక చిక్కినపుడు ఆయన ధ్యాన - జపాలకు కూర్చునవారు. మిగతా విద్యార్థులు ఆటలు ఆడేవారు. తోడి విద్యార్థులతో ఆయన ఆడే ఆటలు ఆసక్తి చూపారు. ముగ్గురు నలుగురు విద్యార్థులు కలిసేసరికి కొత్త ఆట తయారయింది. ఆటపేరు 'సాధన'. ఈ ఆటలో ఆటగాళ్లు బాసింపట్టు వేసుకుని కూర్చుంటారు. వారు కళ్లు మూసుకుని చూడడానికి ప్రయత్నించాలి. భ్రూమధ్యంవైపు చూడాలి. అక్కడ సూర్యుడు ప్రకాశిస్తున్నట్లు అనుభూతి పొందాలి. ఇదీ నియమం. ఎందరు విద్యార్థులు ఈ ఆటను అర్థం చేసుకున్నారో తెలియదు. వారు మాత్రం మౌనంగా కూర్చునేవారు. అడిగితే, చాలా బాగుందని చెప్పేవారు. ఆట తర్వాతి దశలో గాయత్రి, హిమాలయం, గంగ, యమున, సరస్వతి, సిద్ధులు, సంతలు మున్నగు విషయాలపై చర్చ జరిగేది. ఈ చర్చలలో పెద్దగా తేడాలు ఉండేవి కావు. 9-10 వాక్యను మించి అన్వయం కుదిరేది కాదు. అయితే అరగంట-ముప్పావుగంట సేపు ఈ ఆట సాగేది. కొన్ని రోజులు తర్వాత ఆయన నలుగురైదుగురు మిత్రులను తీసుకుని అడవికి వెళ్లడం సాగించారు. బాగా నీడ ఉన్న చెట్లు కింద కూర్చుని ఆట ఆడేవారహు.

ఒక రోజున శ్రీరామ్ ఒంటరిగానే అడవికి వెళ్లి మూడవ జామున తిరిగి వచ్చాడు. అది పాఠశాల నడిచే సమయం. తన విద్యార్థి ఏదో పనిమీద ఇంటికి వెళ్లి ఉంటాడని అధ్యాపకుడు భావించాడు. శ్రీరామ్ పాఠశాలలో ఉన్నారని ఇంటిలోనివాళ్లు అనుకున్నారు. కనుక ఎవరూ ఆయన కోసం వెదకలేదు. 'సాధన' ఆటలో ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆయన కోసం వెదకసాగారు. మూడవ జామున తమ ఆటల నాయకుడు వారికి కనబడ్డారు. ఎక్కడకు వెళ్లారు? అని వారు ఆయనను అడిగారు. శ్రీరామ్ ఇలా జవాబు చెప్పారు- ఒక గుహ దొరికింది. అక్కడికి ఎవరూ రారు. అక్కడ కూర్చొని విశ్రాంతిగా ధ్యానం చేసుకోవచ్చు. మరునాడు ఆయన తన మిత్రులను తీసుకుని ఆ గుహవద్దకు వెళ్లారు. మిత్రులు ఏదోవిధంగా గుహ వరకు వెళ్లారు. గుహలోపలికి వెళ్లడానికి సాహసించలేదు. భయపడ్డారు. శ్రీరామ్ గుహలో చొరబడ్డారు. మిగతా పిల్లలు లోపలికి వెళ్లలేదు. తిరిగి వెళ్లిపోవడానికి వారికి ధైర్యం చాలలేదు. తమ నాయకుడు వెలికి వచ్చే వరకూ వారు గుహబయటే ఉండిపోయారు.

గంటా-గంటన్నర తర్వాత శ్రీరామ్ గుహనుండి వెలికి వచ్చారు. మిత్రులు నొచ్చుకున్నారు. ఇకనుండి ఆ ఆటలో పాల్గొనమని చెప్పారు. మిత్రులు తనను వదిలివేసినందుకు శ్రీరామ్ బాధపడలేదు. తీరిక చిక్కినప్పుడల్లా గంట-అరగంట సేపు ఒంటరిగానే బయటికి వెళ్లేవారు. ఆ గుహలో ధ్యానం చేసేవారు. శ్రీరామ్ మధ్యమధ్యలో తరగతినుండి మాయమవుతూన్న సంగతి అధ్యాపకునికి తెలిసింది. ఆయన సూటిగా శ్రీరామ్‌ను ప్రశ్నించకుండా విద్యార్థులనే ఆ విషయమై ప్రశ్నించారు. గోపాలదాస అనే విద్యార్థి ఉన్న విషయం చెప్పాడు. నీవు వాళ్ల ఇంటికి వెళ్లి ఈ సంగతి చెప్పు - అని అధ్యాపకుడు అతడితో అన్నారు. శ్రీరామ గుహలోనికి వెళుతూన్న సంగతి తాఈజీకి తెలిసింది. ఆమె శ్రీరామ్‌ను పిలిచి చీవాట్లు పెట్టింది. అది సింహాలు, చిరుతపులుల గుహ అయి ఉంటుంది. అవి ఏదో ఒక రోజున నిన్ను చూస్తాయి. నిన్ను ముక్కలు చేసి తినేస్తాయి- అన్నది ఆమె. చీవాట్లు తిన్న శ్రీరామ్ ఇకనుంచి గుహకు వెళ్లనని మౌనంగా హామీ ఇచ్చారు. ఆ వెంటనే తల్లి శ్రీరామ్‌ను గుండెలకు హత్తుకున్నది.

ఆ తర్వాత శ్రీరామ్ క్రమం తప్పకుండా పాఠశాలకు వెళుతూ వచ్చారు- ఏదైనా జబ్బు చేసినప్పుడు తప్ప. నాగా లేకుండా సమయానికి పాఠశాలకు వెళ్లేవాడు. పాఠశాలకు వెళ్లని రోజున, ఫలానా కారణం వలన ఆయన పాఠశాలకు రావడం లేదని భవంతినుండి పాఠశాలకు కబురు వెళ్లేది. ఒక రోజున అలా కబురు రాలేదు, శ్రీరామ్ రానూలేదు. ఏ కారణంవల్లనో కబురు పంపడం కుదరలేదని పండిత రూపరామ్ భావించారు. అందువల్ల ఆ విషయం పట్టించుకోలేదు. నాటి సాయంత్రం భవంతినుంచి కబురు వచ్చింది-శ్రీరామ ఇంతవరకూ ఇంటికి రాలేదు. తరగతులు ఇంకా జరుగుతున్నాయా అని.

తన విద్యార్థి పాఠశాలకని బయలుదేరి మరెటో వెళ్లిపోయాడని అధ్యాపకునికి అప్పుడు అర్థమయింది. ధ్యానం చేసే గుహకు అతడు వెళ్లి ఉంటాడని మొదట అనుమానించారు. శ్రీరామ్ అక్కడికి వెళ్లనని మాట ఇచ్చాడనీ, కనుక అతడు అక్కడికి వెళ్లే ప్రశ్నే లేదనీ తాఈజీ చెప్పింది. అయినా-ఒకసారి గుహలో వెదగడానికి కొందరు బయలుదేరారు. ఆ రోజు అష్టమి లేక నవమి. రాత్రిపూట వెన్నెల మసక వెలుగులో దారి కనబడుతోంది. అయినా అవసరమైతే వెలిగించడానికి ఒక కాగడా వెంటతీసుకు వెళ్లారు.

H H H

**ఆత్మదర్శనం పరమ పురుషార్థం.**

మాతాజీ దివ్య జీవనం - 8

# ప్రగాఢమవుతున్న మాతాజీ సాధన

పరమపూజ్య గురుదేవుల హిమాలయ ప్రస్థానం తర్వాత మాతాజీ సంపూర్ణ జీవితంలో తపస్సు సాంద్రనత ఆవహించింది. ఈ తపశ్శక్తి స్పందనలతో శాంతికుంజ్ కణకణము అలౌకిక దివ్యత్వముతో ఉద్భాసితమైనది. భగవాన్ మహాశివుని వలె గురుదేవులు హిమాలయాల అంతరాలలో తన ఆత్మచేతన ఒకే కైలాస శిఖరం మీద తపోలీనులై ఉన్నారు. శాంతికుంజ్ దివ్యభూమిలో భగవతి ఆదిశక్తివలె మాతాజీ తన అంశభూత శక్తులతో పాటు సాధనలలో లీనమై ఉన్నది. ఆ రోజులలో కొలది క్షణాలైన శాంతికుంజ్ వచ్చి ఉండి మాతాజీని చూసి ఆమెతో పాటు కొద్ది క్షణాలు లేక రోజులు గడిపిన వారు ధన్యులు. ఈ భావనల అలౌకికతను హృదయాంతరాళాలో సాక్షాత్కరింప చేసుకుంటున్న మీరు కూడా ధన్యులే.

నిజంగా అవన్నీ అలౌకికమైనవే. ఈ రోజులలో దానిని ఊహించుకొనలేము. అప్పుడు శాంతికుంజ్ దరిదాపులలో మనుష్యుల సమూహం, వాహనాలూ కనిపించేవి కావు. సర్వత్రా ఒక లోతైన ఆధ్యాత్మిక శాంతి పరచుకుని ఉండేది. శాంతికుంజ్‌లో ఈనాటి భవనాల విస్తారం, కార్యకర్తల పెద్ద సంఖ్యా లేదు. మహా అయితే ముగ్గురు కార్యకర్తలుండే వారు. శారదా మరియు రుక్మిణి అనే ఇద్దరు స్త్రీలు భోజనం మొదలగు వాటిలో సహకరించడాని కుండేవారు. ఈ మొదటి రోజులలో మాతాజీతో పాటు 6గురు బాలికలు ఉండేవారు. వీరి సంఖ్య పెరిగి తరువాత పన్నెండు అయింది. వారి పవిత్రత, సరళత, గాయత్రీ సాధనలో వీరి సమర్పిత భావం చూస్తే మాతాజీయే స్వయంగా తన ప్రాణశక్తిని విభజించుకుని ఈ కుమారి రూపం దాల్చినదా అనిపించేది. బాలికల దదువు సంధ్యలు, తినటం, త్రాగటం మొదలగు అన్ని ఏర్పాట్లు మాతాజీయే స్వయంగా చూసుకునేది. ఈ బాలికలు వారి నిర్దేశంలో తమ దైనిక కృత్యములే కాక అఖండ దీపం సిద్ధజ్యోతి సాన్నిధ్యంలో సాధన చేసెడివారు.

3,4 గదులు కల ఈ శాంతికుంజ్ ప్రాచీన ఋషుల తపోవనములాగానే కనిపించేది. మనసులను సహజంగానే ఆకర్షించే పచ్చదనము, పచ్చని కుంజముల ఛాయ, కొంచెం చిన్నవైనా ఫలములు, నీడనిచ్చే చెట్లు అన్నీ ఇక్కడ వాతావరణంలో అత్యంత నిర్మల సౌందర్యం సృష్టించినవి. ఏ విధమైన గోలా లేదు. అప్పుడప్పుడు మాతాజీ సాన్నిధ్యంలో ఉండే బాలికల మృదుమందహాసములు, ఆవుల యొక్క అంబారవములు వినిపించేవి. ఇవి వాతావరణ శాంతిలో మధురతను నింపేవి. అప్పుడు పగలు కూడా వినిపించే గంగామాత ప్రవాహం యొక్క కలకల ధ్వని ఆశ్రమ వాతావరణంలో తమ స్వర్గీయ సంగీతంతో మధురిమను సృష్టించేది. ఆగంతకులు అసలుండేవారు కారు. ఎప్పుడో నెలల తరబడి తరువాత ఒకటో అరో వ్యక్తి వస్తే గొప్ప. ఆశ్రమంలో మాతాజీ అక్కడ నివసించే కొద్దిమంది కొరకు అవసరమయ్యే నిత్యావసర వస్తువులు అవసరమైనపుడు కార్యకర్తలు హరిద్వార్, జ్వాలాపూర్‌కి వెళ్లి తెచ్చేవారు. ఈ వెళ్లటం సాధారణంగా కాలినడకనే జరిగేది. అప్పుడప్పుడు కొద్ది దూరం బస్సు దొరికేది.

మాతాజీ దినచర్యలో తపసాధనలతో పాటు తన పరిజనుల ఉత్తరాలకు ప్రత్యుత్తరములిచ్చుట, అఖండ జ్యోతి పత్రిక సంపాదన చేయుట, అందరికీ భోజనం పెట్టుట వంటి పనులుండేవి. ఈ పనులన్నింటితో పాటు తనతో ఉండే బాలికలకు తమ ఇంటి నుండి, తల్లితండ్రుల నుండి దూరంగా వచ్చామనే బాధ కలుగకుండా చూసుకునేది. దానిలో భాగంగా ప్రతిరోజు ఏదో ఒక విశేషమైన ఆహార పదార్థం స్వయంగా చేసి వాళ్లకి తినిపించుట మొదలగు కార్యక్రమములు ఉండేవి. ఈ విధంగా మాతాజీ దైనందిన కార్యక్రమాలలో పూర్తిగా నిమగ్నమై ఉండేది. ఆమె వ్యస్థత చూసిన చుట్టుప్రక్కల వారికి ఆమె ఎప్పుడు సాధన చేసేదో తెలిసేది కాదు. అసలు చేస్తోందా? లేక చేస్తే ఏలా చేస్తోంది. కానీ అంతఃకరణాలను తొలిచే ఈ ప్రశ్నల భ్రాంతిలో పడేవారికి కూడా ఆమె ఆధ్యాత్మిక శక్తి సిద్ధుల గురించి

**చిరునవ్వులో స్వర్గం, కలహంలో నరకం ఉన్నాయి.**

తెలుసు. కానీ తమ ఈ భ్రాంతిలో వారు సత్యమును గుర్తించే స్థితిలో లేరు.

ఇటువంటి, ఇంకా జీవించి ఉన్న, తన పేరును బయటపెట్టడానికి సంకోచిస్తున్న ఒక పరిజనుడు, ఒకరోజు నసుగుతూ మాతాజీని అడగనే అడిగాడు-"మాతాజీ ! మీరు స్వయముగానే సిద్ధిదాత్రి. మరి మీరు స్వయముగా సాధన చేయవలసిన అవసరమేమిటి?'' ఈ ప్రశ్నతో పాటు ఆయన మెల్లగా భయపడుతూ మీరు సాధన ఎప్పుడు చేస్తారో తెలియదే అని అడిగేశాడు. అంతర్యామి మాతాజీ ఈ ప్రశ్నలు విని ముందు చిరునవ్వు నవ్వి తరువాత మెల్లగా నవ్వింది. ఏం చేస్తావు ఇవంతా తెలుసుకుని? అని అడిగింది. కానీ అతని దయనీయమైన మొహాన్ని చూసి చెప్పింది. 'చూడు నాయనా! నీవు ఈ విషయాలన్నీ సరిగా అర్థం చేసుకొనలేవు. నీ కళ్లు చాలా బలహీనమైనవి. అవి నా సాదనను చూడలేవు. అయినా నీవు మొండిగా అడుగుతున్నావు కనుక కొంచెం వివరంగా చెపుతాను.

"చూడు, ఈ పిల్లలు నేను కలిసి సాధన చేస్తాము. ఈ పిల్లల సాధన స్థూలమైనది. నా సాధన సూక్ష్మమైనది. నేను ఏం చేసినా సూక్ష్మ శరీరంతో సూక్ష్మలోకాలలో చేస్తాను. సాధారణంగా మనుష్యులకి ఇవి కనిపించవు. అర్థమవ్వవు. కానీ తద్వారా బ్రహ్మాండంలో విస్తరించి ఉన్న శక్తి ప్రవాహము నుంచి అనంత శక్తిని సంపాదించుకోగలం. ఇది సూక్ష్మ శరీరంతో చేసే సాధన. దీనిని గురించిన చర్చ ఏ పుస్తకంలోను లేదు. కానీ ఈ విధంగా చేయబడే శక్తి సముపార్జనకు సార్థకత ఎప్పుడుంటుందంటే, దాని అవతరణ కొరకు ఉచితమైన ఆధారభూమి ఉంటేనే. ఈ ఆధార భూమి నిర్మాణం ఈ ఆడపిల్లల ద్వారా నా సంరక్షణలో జరిగే గాయత్రీ పురశ్చరణల పరంపరలలో జరుగుతున్నది. ఈ మాటలు నీకెంత అర్థమౌతున్నాయో నాకు తెలియదు కానీ ఒకటి మాత్రం తెలుసుకో. ఈ రోజులలో ఇక్కడ జరుగుతున్నది అద్భుతమైనది. ఈ పవిత్ర భూమి పాత్రత పెంచి దీనిని ఆధ్యాత్మిక శక్తి భాండాగార గృహముగా చేయుచున్నాను. దీని ఉపయోగం ముందుముందు ఉంటుంది.''

తన మాటలను వివరిస్తూ మాతాజీ కొంతసేపు ఆగింది. మళ్లీ ఇలా అన్నది. "నీవింకొక మాట అడిగావు. మాతాజీ మీరు సాధనలు చేయాల్సిన అవసరమేమిటని? నిజానికి నాకు సాధనలు చేయాల్సిన అవసరం లేదు. అది నా స్వభావం. దీని అవసరం నాకు లేదు. పిల్లలైన మీకున్నది. పిల్లలంటే పిల్లలే కదా! తెలిసో తెలియకో వారి ద్వారా ఎన్నో పాపాలు జరిగిపోతుంటాయి. వాటి ఫలితాలు అనుభవిస్తున్నపుడు "మాతాజీ! రక్షించు రక్షించు అని అరుస్తారు. ఇంక పిల్లలెలా ఉన్నా, మట్టి, బురద, మలమూత్రములతో నిండి ఉన్నా నాకు పిల్లలంటే పిల్లలే కదా! నేను వారి తల్లిని. వారు ఎలా ఉన్నా నాకు ప్రియులే. నాయీ పిల్లలను కష్టముల నుంచి రక్షించడానికి నేను చాలా చేయవలసి ఉంది. పిల్లలు తప్పు చేస్తారు. వారి తల్లినైనందు వలన ప్రాయశ్చిత్తం నేను చేసుకోవలసి వస్తుంది. దీనికొరకు నిరంతరం నేను సాధన చేయవలసి వస్తుంది.''

మాతాజీ చెప్పిన ఈ మాటలు విని అతని కళ్ళు నీటితో నిండాయి. అతడు ఆమె వాత్సల్యపు అనంత విస్తారం చూసి నిశ్చేష్టుడయ్యెను. మాతాజీ తన బావములలో లీనమై ఇలా చెప్పసాగింది - "నాయనా! నేను ఈ క్షేత్రంలో, ఈ చుట్టు ప్రక్కల విస్తరించి ఉన్న స్థలంలో అత్యద్భుతమైన మార్పులను చేయటంలో నిమగ్నురాలయి ఉన్నాను. నా సంకల్ప విస్తారం వల్ల ఈ భూమి ఆధ్యాత్మిక శక్తికి అక్షయ కోశాగార మౌతుంది. ముందు ముందు ఇది చాలా విస్తరించబడుతుంది. ఇక్కడ నుంచే చాలా పెద్దపెద్ద కార్యక్రమాలు జరుగుతాయి. ఆ సమయంలో చూసేవారు ఆశ్చర్యచకితులౌతారు. శాంతికుంజ్‌లో అన్ని పనులు వాటంతటవే ఎలా జరిగిపోతున్నాయి? శాంతికుంజ్ ఏ పని తన చేతులోకి తీసుకున్నా అది దానంతటదే జరిగిపోతుంది. నిజానికవి వాటంతటవే జరగవు. ఈనాడు నేను కూడబెడుతున్న ఆధ్యాత్మిశక్తి అంశతో ఇవి జరుగుతాయి. వ్యక్తులు ఇక్కడికి వచ్చి శ్రద్ధా భావనలతో సాధనలు చేసుకుంటారు. వారికి సునాయాసముగా ప్రాణ ప్రత్యావర్తన జరుగుతుంది.''

తన సాధనల రహస్య కథలోని కొన్ని అంశములను తెలుపుతూ మాతాజీ హఠాత్తుగా లేచి నుంచుంది. బహుశ ఆమె తన భవిష్యత్ కార్యక్రమాలకు గతి ఇవ్వవలసి ఉన్నదేమో!

**ప్రేమించే హృదయమే స్వర్గం, ప్రేమే దైవం కనుక.**

## గురుదేవుల పునరాగమనం ప్రాణప్రత్యావర్తన

ప్రత్యావర్తితమవుతున్న ప్రాణాములతో మాతాజీ, గురుదేవుల మధ్య భావసంవేదనలు జరుగుచున్నవి. శుభ్ర ధవళ హిమశిఖరముగల హిమాలయాల అంతరాలలో తపోలీనులైన గురుదేవులు, హరిద్వార్‌లో దివ్యసాధనాస్థలి శాంతికుంజ్‌లో సాధనలో లీనమైన మాతాజీ ఒకరి పరిస్థితిని ఒకరు భావదశలో, తమతమ హృదయ లోతులలో నిరంతరం అనుభవించేవారు. ఇరువురి కర్తవ్యం కఠోరమే. ఇరువురి సాధనలు అత్యంత ప్రచండమైనవే. మాతాజీ గాయత్రీ పరివార్ పరిజనులకు ప్రేమ, మమత ఇవ్వటం, వారి కష్టములలో పాలుపంచుకోనుటతోపాటు శాంతికుంజ్ భవిష్యత్తు కొరకు ఆధ్యాత్మిక శక్తి అక్షయకోశాగారం సమకూర్చుటలో నిమగ్నురాలై ఉన్నది. ఆరోజులలో పొరుగు దేశముల వారు తమ కుటిల రాజనీతితో మన దేశము మీద దురాక్రమణ చేస్తున్నప్పుడు ఆ ఆసురీ శక్తులకు ప్రచండమైన ఎదురుదెబ్బ తీసే సన్నాహాలలో గురుదేవులలో గురుదేవులు ఉన్నారు.

1971లో చలికాలం ప్రారంభమైనప్పుడు దేశం చాలా క్లిష్ట పరిస్థితిలో ఉన్నది. సైన్యము సరిహద్దుల వద్ద వేరువేరు స్థలములలో యుద్ధము చేయుచున్నది. తూర్పు పాకిస్తాన్‌లో జరుగుచున్న అమానవీయ, అమానుషాల కారణంగా భారతదేశమువైపు పరిగెట్టుకుని వచ్చుచున్న శరణార్థులకు సముచిత సహాయము చేయుటకు ధైర్యవంతులైన మన సైనికులు కంకణం కట్టుకున్నారు. దేశమునకు ఇది చాలా కఠిన కాలము. సమస్యల ఈ జటిల చక్ర వ్యూహములో అనేక అంతర్గత చక్రములున్నవి. దేశ రాజకీయ వేత్తలను కూటిలనీతి ద్వారా లొంగదీసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈరోజు ప్రపంచంలో ఎంతో శక్తివంతమైనదిగా చెప్పబడుతున్న దేశము ఆరోజులలో శత్రువులకు సహాయ మందించుటలో నిమగ్నమై ఉన్నది. అంతేకాక వారి సర్వశక్తివంతమైన దానిగా చెప్పబడుతున్న ఏడవ యుద్ధ నౌకల సమూహం ముందుకు దూసుకువస్తోంది. యుద్ధ వార్తలు వింటున్న చిన్నా పెద్దా అంతా ఇప్పుడు ఏం జరుగుతుందో అని అత్యంత ఉత్కంఠతతో ఎదురు చూస్తూ ఉన్నారు.

అకస్మాత్తుగా సంఘటనల పరంపర అనూహ్యమైన మార్పు వచ్చి ఆట మొత్తం తిరగబడింది. క్రొత్త చరిత్రే కాదు, క్రొత్త ప్రపంచం కూడా రచింపబడింది. ప్రపంచ చరిత్రలో బహుశ మొదటిసారి 93,000 మంది సైనికులు సైన్యాధిపతితో సహా మోకాళ్ళపై వంగి ఆత్మసమర్పణ చేసుకున్నారు. ప్రపంచ పటంలో కొత్త రేఖలు గీయబడ్డాయి, ఒక క్రొత్త దేశానికి నూతన ఆకృతి ఇవ్వబడినది. భారతదేశం విజయోత్సవమును, బంగ్లాదేశ్ జన్మదినోత్సవమును జరుపుకున్నాయి. దేశములోని రాజకీయ నాయకులు మొదలు సామాన్య నాగరికుల వరకు ఏదో చమత్కారం జరిగిందనే అనుభూతి చెందారు. ఏడవ యుద్ధనౌకల సమూహము ఎలా తిరిగి వెళ్ళింది? ఇంత పెద్ద సంఖ్యలో సైన్యం ఎలా ఆత్మసమర్పణ చేసుకున్నది? ఇటువంటి ప్రశ్నలకు సామాన్య బుద్ధి సమాధానము ఇవ్వటంలో అసమర్థురాలౌతుంది. అందరూ ఇది భారతదేశ దివ్యశక్తుల చమత్కార మన్నారు.

ఏ రోజులలో ఇదంతా జరిగినదో డాక్టర్ అమల్ కుమార్ దత్తా పరిజనుడు అప్పుడు మాతాజీని కలుసుకొనుటకు వచ్చారు. మాతాజీని కలిసినపుడు ఆయన "మాతాజీ మీరు విన్నారా? భారతదేశం యుద్ధంలో గెలిగించి." అన్నారు. మాతాజీ చాలా మెల్లిగా జవాబిచ్చారు - "అవును నాయనా! విన్నాను. చూశానుకూడా." ఆయనకు కొద్దిగా ఆశ్చర్యమేసింది. వినటం నిజమే. చూడటం ఏమిటి? ఆయన మాతాజీని పూర్తిగా వివరించమని పట్టుబట్టాడు. దానికి జవాబుగా ఆమె ఇలా అన్నారు-"ఇప్పుడు జరిగిన యుద్ధం రెండు విధాలుగా జరిగింది. ఒకటి మన సైనికులు యుద్ధంలో విశిష్టమైన ధైర్యసాహసాలు చూపించారు. మన సైనికుల ఈ యుద్ధ ప్రతిభను ఎంత కొనియాడినా తక్కువే. కానీ ఈ యుద్ధంలో హిమాలయములోని ఋషిసత్తా కూడా బ్రహ్మాండంగా పాలుపంచుకున్నది. దానిలో గురుదేవుల పాత్ర చాలా ముఖ్యమైనది. ఆయన తన తపశ్శక్తితో శత్రువుల కుతంత్రములను ముక్కలు ముక్కలు చేశారు. ఇదంతా నేను స్వయంగా, ప్రత్యక్షంగా కళ్ళతో చూసాను."

ఆరోజులలోని అనేక సంస్మరణలలో ఒక ముఖ్యమైన

**పశ్చాత్తాపం సాధువు లక్షణం, తన పాపానికి గర్వపడడం రాక్షసత్వం.**

సంస్మరణ గురించి కొన్నాళ్ళ తరువాత మాతాజీయే స్వయముగానే తెలిపింది. ఆసంఘటనలో మమతామయి తల్లి వాత్సల్యం ప్రస్ఫుటిత మగుచున్నది. మాటలలో తమ జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆమె ఇలా అన్నారు - "గురుదేవులు 1971లో హిమాలయాలకు వెళ్ళినప్పుడు ఇంక అందరూ ఆయన తిరిగి రారు అనే అనుకున్నారు. బంగ్లాదేశ్ యుద్ధం జరిగిన తరువాతకూడా ఆయన ఉద్దేశ్యం ఆలానే ఉన్నది. కానీ ఇక్కడ అందరూ బాధపడుతున్నారు. గురూజీ ఎప్పుడు తిరిగివస్తారు? ఎవరు ఉత్తరం వ్రాసినా ఇదే ప్రశ్న అడిగేవారు. మమ్మల్ని ఎప్పుడు కలుస్తారు? అని పిల్లల ఈ ఆవేదన నన్ను చాలా బాధపెట్టేది. నా కష్టాల గురించి నేనెప్పుడు బాధపడేదాన్ని కాదు. అవి ఎంత పెద్దవైనా! కానీ నా పిల్లల దుఃఖము నేను భరించలేకపోయాను. వారు దుఃఖితులుగా ఉండటం నేను చూడలేను. అమ్మనికదా! పిల్లల ఈ కష్టములతో నా బాధ ఎంత ఎక్కువైందంటే గురూజీని ప్రార్థన చేస్తున్నప్పుడు నానోటినుండి కేక వెలువడింది. ఈ కేక విన్న కొంతమంది మాతాజీకి జబ్బుచేసింది అనుకున్నారు. కానీ గురూజీ నన్ను సరిగానే అర్థం చేసుకుని తిరిగి వచ్చారు. ఆయన నా ప్రార్థన స్వీకరించి తమ ప్రణాళికను మార్చుకున్నారు."

తిరిగి వచ్చిన తరువాత గురుదేవులు అన్నింటికంటే ముందు సుదూరంగా నివసిస్తున్న ప్రవాసీ పరిజనుల పిలుపుకు జవాబుగా ఆఫ్రికా వెళ్ళారు. 1972లో గురుదేవులు ఈయాత్ర ఓడలో చేశారు. ఆయన ఈ యాత్ర పైకి చాలా సాధారణంగా కనిపించినా అంతరికంగా అసాధారణ అనుభూతులతో నిండి ఉన్నది. అక్కడనుంచీ తిరిగి వచ్చాక ఆయన 1973 నుండీ ఐదు రోజులపాటు జరిగే ప్రాణప్రత్యావర్తన శిబిరములు ఏర్పాటు చేసారు. శాంతికుంజ్‌లో ఏర్పాటు చేయబడిన మొదటి శిబిరం ఇదే. దీనిలో దేశమంతటా ఉన్న పరిజనుల పాలుపంచుకుని తమ ప్రాణములు ప్రత్యావర్తన చెందే అనుభూతి పొందారు. ఈ ప్రాణ ప్రత్యావర్తనములలో పాలుపంచుకున్న పరిజనులలో అనేకులు నేడు శాంతికుంజ్, బ్రహ్మవర్చస్‌లలో వరిష్ఠ కార్యకర్తలుగా ఉన్నారు. ఎవరైతే శాంతికుంజ్‌కు రాలేని పరిస్థితులలో ఉన్నారు వారుకూడా తమతమ క్షేత్రములలో మిషన్ కార్యకలాపాలలో పరిపూర్ణముగా నిమగ్నమైనారు.

ప్రత్యావర్తన అన్ని విధములా విచిత్రమైనది. ఈ ఐదు రోజులలో ఏకాంతంలో ఉంటూ సాధకులు గురుదేవుల ద్వారా చెప్పబడిన అనేక సరళమైన కానీ అత్యంత ప్రభావం ఇచ్చు సాధనల ఉద్దేశ్యం సాధకుల ప్రాణములను ఇచ్చస్తరీయ ఆధ్యాత్మిక తత్వములను గ్రహించగలిగేటట్లు చేయుట తద్వారా గురుదేవుల మహా ప్రాణములలోని అతి స్వల్ప అంశము గ్రహించి, ధారణ చేయుటలో వారు సమర్థులౌతారు. ఈ సాధన ప్రతీ సాధకుడు గురుదేవుల దగ్గరికి వచ్చి చర్చించుకొనుటకు, సలహా పొందుటకు పూర్తి అవకాశం ఉండేది. ఆ సాధనలో భోజనం, ఔషధీ కల్పముల ద్వారా మాతాజీ ప్రాణసుధ లభించేది. మాతాజీ ఈవిధంగా తమ పిల్లలకు తమ తపస్సులోని అంశం అనుగ్రహించేది.

ఈ ప్రత్యావర్తన శిబిరం మొదలుకొని సుమారు ఒక పది సంవత్సరముల వ్యవధిలో శాంతికుంజ్‌లో రకరకాల సాధనా శిబిరములు నిర్వహించబడ్డాయి. దీనిలో పాలుపంచుకున్న దేశంలోని వేలాదిమంది సాధకులు పరమపూజ్య గురుదేవులతో పాటు మాతాజీ తపఃశక్తి యోగవిభూతుల సాక్షాత్కారం పొందారు. వీరందరూ సర్వసిద్ధి దాత్రి మాతాజీ ద్వారా ఇవ్వబడిన దానముల వలన లాభములు పొందిరి. ఈ కాల ఖండం శాంతికుంజ్ స్వర్ణిమ కాలాలో ఒకటి. 1978లో మాతాజీకి సహకరించడానికై శైలదీదీ, డాక్టర్ ప్రణవ పండ్యాల ఆగమనం జరిగింది. ఆధ్యాత్మికత వైజ్ఞానిక కోణములు ప్రతిష్ఠించు కోవడానికి బ్రహ్మవర్చస్ శోధ్ సంస్థాన్ స్థాపించబడింది. దీనితో పాటు ఆదిశక్తి జగదంబను యుగశక్తిగా ప్రతిష్ఠించుటకు పరమపూజ్య గురుదేవులు ఒక క్రొత్త ఉద్యమాన్ని మొదలుపెట్టారు. ఇది యుగనిర్మాణ మిషన్ ఆదిశక్తి ద్వారా సంచాలితమవుతోందని సర్వులకు తెలియచేసే ప్రకటన. దీనిని ముందుకు నడిపించటానికి గురుదేవులు స్వయంగా దేశమంతటా యాత్రలు చేశారు. మొదటి చరణములో సంపూర్ణ దేశములో ఎన్నుకోబడ్డ పవిత్ర తీర్థస్థలాలలో 24 శక్తి పీఠములు స్థాపించబడ్డాయి. తరువాత వీటి సంఖ్య పెరుగుతూ వెళ్లింది. గురుదేవులు ఈ కార్యక్రమములో నిమగ్నమై ఉన్నపుడు మాతాజీ మిషన్, శాంతికుంజ్ సూత్రసంచాలికగా బాధ్యత తీసుకున్నారు.

**చదవడం అందరికీ వచ్చు. ఏది చదవాలో, ఎందుకు చదవాలో కొద్దిమందికే తెలుసు.**

# యుగ గీత

## గురువు పరీక్షలో నిలిస్తేనే జ్ఞానప్రాప్తి

జ్ఞాన శబ్దాన్ని మన శాస్త్ర గ్రంథాలలో, యోగ గ్రంథాలలో ఆత్మజ్ఞానం అనే అర్థంలో ప్రయోగించారు. ఏ జ్యోతి ద్వారా మన సత్యాన్ని తెలుసుకోగలమో దానిలో స్థాపితం కాగలమో ఆ జ్యోతియే జ్ఞానం. దేనివల్ల మన విషయ సమాచారం పెరుగుతోందో, దేనివల్ల మన బౌద్ధిక సంపద ఆర్జించబడుతుందో అది జ్ఞానం కాదు. జ్ఞానం భౌతిక విజ్ఞానం కాదు. మనో విజ్ఞానం కాదు. ప్రాపంచిక జ్ఞానం కాదు. ఇవన్నీ 'శిక్షణ' పరిధిలోకి వస్తాయి. ఈ సమాచారం వల్ల తప్పక ప్రయోజనం ఉంటుంది. అయితే మన ఆంతరిక ప్రగతి కోసం, అంతఃసత్తా వికాసం కోసం 'విద్య' అవసరం అవుతుంది. విశుద్ధ జ్ఞానం అవసరం అవుతుంది. ఇది యోగపరమైన జ్ఞానం. దీనివల్ల పరమాత్మను, ఆత్మను, భగవానుని తెలుసుకోగలుగుతాం. శిక్షణలోని విభాగాలన్నీ నిజమైన జ్ఞానానికి సహాయకాలు మాత్రమే అవుతాయి. ప్రత్యామ్నాయములు కావు. వాస్తవికమైన జ్ఞానం మనసుకు కనబడదు. మనసు దాని మెరుపును మాత్రమే పొందగలుగుతుంది. అది మరింత లోతుగా ఆత్మలో విరాజిల్లుతుంది.



కనుకనే ఉపనిషత్తు ఇలా చెపుతోంది-

విద్యాం చ విద్యాం చ య
స్తద్వేదోభయగం సహ ।
అవిద్యయా మృత్యుం తీర్త్వా
విద్యాయా Ê మృతమశ్నుతే ॥

- ఈశావాస్యోపనిషత్తు ॥

అనగా-

విద్య, అవిద్యలు (విద్య, శిక్షణలు) రెంటినీ ఒకేసారి తెలుసుకో. వీనిలో అవిద్య ద్వారా మృత్యువును దాటి విద్య ద్వారా అమరత్వాన్ని పొందవచ్చు.

మరి ఈ జ్ఞానాన్ని ఎలా పొందాలి అనే ప్రశ్న ఉదయిస్తుంది. ఎందుకంటే పరమసత్తా యొక్క ఈ జ్ఞానం, పరమ సత్యం యొక్క ఈ జ్ఞానం మనలో ప్రతి ఒక్కరికీ అత్యంత ప్రముఖమైనది. ఈ జ్ఞానాన్ని సద్గురువు మాత్రమే ఇవ్వగలడు. ఆచార్యుని వలె జీవించే గురువు మాత్రమే ఆ జ్ఞానాన్ని స్వయంగా జీవితంలో రంగరించుకున్న గురువు మాత్రమే ఇవ్వగలడు. శిష్య భావంతో మనం గురువుతో సమన్వయం సాధించాలి. మన జ్ఞాన నేత్రాన్ని మేలుకొలపాలి. నిత్య మారుతున్న ఈ సంసారంలో ఆ గురువు ఎలా నివసిస్తున్నాడో తెలుసుకోవాలి. ఆయన ఎలా అనుభవం పొందుతున్నాడో తెలుసుకోవాలి. ఆయన ఎలా కర్మ చేస్తున్నాడో తెలుసుకోవాలి. అపుడు మనకు జ్ఞానం లభిస్తుంది. ఈ జ్ఞానాన్ని పొందాలంటే ముందుగా తత్వదర్శులైన జ్ఞానుల నుండి దీక్ష పొందాలి. తత్వజ్ఞానాన్ని కేవలం బుద్ధితో తెలుసుకున్న వారి నుండి కాక ఆ మూలతత్వాన్ని ప్రత్యక్షంగా చూచిన వారి నుండి (జ్ఞానినః తత్వదర్శనః) దీక్షపొందాలి. శ్రీకృష్ణుడు తర్వాతి శ్లోకంలో (34వ శ్లోకంలో) చెపుతున్నాడు-

తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।
ఉపదేక్ష్యంతి తే జ్ఞానంజ్ఞానినస్తత్వదర్శినః ॥ - **4/34**

అనగా -

ఆ జ్ఞానాన్ని తత్వదర్శులైన జ్ఞానుల వద్దకు వెళ్లి తెలుసుకో. వారికి సాష్టాంగ నమస్కారం చేస్తే, వారికి సేవ చేస్తే, కపటం వదలి సరళంగా ప్రశ్న అడిగితే పరమాత్మ తత్వాన్ని చక్కగా తెలుసుకున్న ఆ జ్ఞానులు, ఆ మహాత్ములు నీకు ఆ తత్వ జ్ఞానాన్ని ఉపదేశిస్తారు.

**వివేకమే దేవదూత.**

## గురువు లేనిదే జ్ఞానం లేనేలేదు

జ్ఞానాన్ని పొందడానికి రాచబాట ఇదే. జ్ఞానాగ్ని మండే స్థలంలో జ్ఞానం లభిస్తుంది. కబీర్‌దాసు ఇలా అంటారు. “పోథీ పఢి పఢి జగ్ ముఆ పండిత్ భయా న కోయ । ఢాఈ ఆఖర్ ప్రేమ్ కా పఢే సో పండిత హోయ ॥” చదువుకున్న వారు, విద్యావంతులు, విద్వాంసులు పండితులు కారు. జ్ఞానాన్ని జీవించిన వారు, ఆత్మీయతను, ప్రేమను జీవితంలో మమేకం చేసుకున్న వారు మాత్రమే పండితులు. ప్రతి శ్వాసలోను పరమాత్మను జీవింపచేసుకున్న వారు మాత్రమే పండితులు అన్నది దీని భావం. కబీరు చదువుకున్న వాడు కాడు. రజ్జబ్, రైదాస్‌లు చదువుకున్న వారు కారు. అయితే వీరు శ్రీకృష్ణుడు పై శ్లోకంలో వర్ణించిన జీవించారు. ఆత్మజ్ఞానం అక్షర జ్ఞానంతో సమానం కాదు. ఏ జ్ఞానం అనే అగ్నిలో అన్ని కర్మలు మండి భస్మం అవుతాయో ఆ జ్ఞానాన్ని పొందాలి. అందుకోసం పరమాత్మ యొక్క గుణాలు కలిగిన ఆచార్యుల వద్దకు, గురుజనుల వద్దకు వెళ్లి వారిని తత్వానికి రూపాలుగా గ్రహించాలి. మన ఆహారాన్ని మరచి పోయి వారికి సాష్టాంగ ప్రణామం చేయాలి. మన కపటాన్ని ప్రక్కన ఉంచి జిజ్ఞాసను వ్యక్తం చేసి జ్ఞాన దాహాన్ని వారి ముందుంచాలి. గురువుగారి జ్ఞానం ఎంత ఉందో పరీక్షించడానికి పలువురు ప్రశ్నలు అడుగుతారు. మహాత్ముల పట్ల ఆదర భావం లేకుండా కపటంగా ప్రశ్నలు అడగడానికి వెళతారు.అలా కాక కల్లాకపటం లేకుండా సేవాభావంతో వెళ్లాలి. జ్ఞానాన్ని పొందాలనే కోరికను వ్యక్తపరచాలి. అపుడే సూర్యునివలె ఆత్మసత్తాను ప్రకాశింపచేసే జ్ఞానాన్ని పొందగలం. సేవ చేయడం అంటే కాళ్లూ చేతులు పట్టడం కాదు. శరీరాన్ని మాలిశ్ చేయడం కాదు. వారు నిర్దేశించిన పనులను చేయడం, వారి నిర్దేశాలకు అనుగుణంగా మన జీవితాలను సమర్పించడం. ఏ మహా పురుషుని నుండి అయినా వారి సద్గ్రంథాల నుండి అయినా జ్ఞానం పొందాలంటే ఇది తప్పనిసరి. మనం యోగ్యులం అయితే ఆ జ్ఞానం మనకు లభిస్తుంది. మన యోగ్యం ఎంతవరకు వికసించిందో, మన పాత్రత ఎంత వరకు పెరిగిందో సద్గురువు పరీక్షిస్తాడు. మన ప్రశ్నలకు వారు సమాధానాలు ఇస్తే మన జిజ్ఞాస మరింతగా పెరగాలి. భగవానుడిని పొందాలనే ఇచ్ఛ మనలో మరింతగా పెరగాలి. ఆ అనుపాతంలో మనం వినయ పూర్వకంగా చేసే సేవ, మన నిష్ఠ మరింతగా పెరగాలి.

తమ శిష్యులకు జ్ఞానం ఇచ్చేముందు గురుజనులు వారికి రకరకాల పరీక్షలు పెట్టారు.

సింహం పాలు తెమ్మని సమర్థ రామదాసు శివాజీకి పరీక్ష పెట్టారు. తన యోగమాయలో సృష్టించిన సింహం పాలు ఆయన అడిగారు. శివాజీ ఆ పాలు తీసుకువచ్చాడు. సేవాభావంతో పాత్రుడు అయినాడు. భవానీ ఖడ్గం పొందడానికీ, గురువు అనుగ్రహం పొందడానికీ అధికారం ఆయనకు అపుడు మాత్రమే వచ్చింది.

గుర్జిపఫ్ తన శిష్యులను తిట్లు తిట్టేవాడు. ముక్క చీవాట్లు పెట్టేవాడు. ఆయన శిష్యులలో ఒకరైన ఆస్త్రోంస్కీ తన సేవా భావంతో అవన్నీ భరించాడు. జ్ఞానం పొందగలిగాడు.

దయానంద మహర్షి గురువు విరజానందజీ ఆయనను పట్టకారుతో కొట్టేవారు. ఆయనతో ఎంతో కఠినంగా వ్యవహరించేవారు. అపుడే ఒక మహాయోధుడు, పాషండ ఖండన పతాకను ఎగురవేసిన ఆర్యసమాజ సంస్థాపకుడు జన్మించాడు.

స్వామి వివేకానంద తన గురువుగారి అపరిమిత ప్రేమను చూరగొన్నారు. అయితే గురువు ఆ శక్తి అంతటినీ ధారణ చేసిన తర్వాత ఆయన జీవించిన జీవితం ఆయన శరీరం మొత్తాన్ని ఎండగట్టింది. 1886-87లో శక్తిపాతం పొందిన ఈ యువ సన్యాసి ఆ తర్వాత 15 సంవత్సరాలు మాత్రమే జీవించగలిగారు. ఆయన ఎన్నడూ విశ్రాంతిగా నిద్రపోలేకపోయారు. గురువు కార్యాన్ని ప్రపంచమంతటికీ అందించి ఆయన చాలా చిన్న వయస్సులోనే కష్టాన్ని భరిస్తూ శరీరం వదలి వెళ్లిపోయారు.

పాత్రతను వికసింపచేసుకోవడానికై సర్వస్వాన్ని ఒడ్డవలి ఉంటుంది. అపుడు మాత్రమే గురువు, విద్వాంసుడు, ఆచార్యుడు, పండిత గణం తమను తాము ఖాళీ చేసుకుంటారు. తమ శక్తులన్నిటినీ శిష్యులకు ధారపోస్తారు.

ఎంతో విలక్షణమైన విషయం ఇది. ఈ మూల తత్వాన్ని ప్రత్యక్షంగా చూచిన వారి నుండే (జ్ఞానినః తత్వదర్శనః) ఈ జ్ఞానం లభిస్తుందని గీతాకారుడు ఈ 34వ శ్లోకంలో చెపుతున్నాడు. అయితే నాలుగు శ్లోకాల తర్వాత 38వ శ్లోకంలో ఇలా చెపుతాడు. యోగం ద్వారా సంసిద్ధిని పొందిన వ్యక్తి దానిని తనకు తానుగానే తగు సమయంలో తన ఆత్మలో పొందుతాడు. (తతస్వయం యోగసంసిద్ధః కాలేన ఆత్మని విందతి) మరి ఈ రెంటిలో ఏది సత్యం? రెండూ సత్యములే. ఈ జ్ఞానం శిష్య భావంతో ప్రయత్నించే ప్రతి వ్యక్తిలో పెరుగుతూ ఉంటుంది. నిష్కామ భావంతో కూడిన సమత్వంలో భగవద్భక్తిలో లోతు పెరిగే కొలదీ జ్ఞానం కూడా పెరుగుతూ ఉంటుంది.

Ð(Ç~¡º"Eò=KÍó<-OH.Õ)

**అనుభవాన్ని జీర్ణించుకోవాలంటే ఏకాంతాన్ని ఆశ్రయించు.**

## కృష్ణావతారం-19

# గీతోపదేశం

యుధిష్ఠిరునకు అర్జునునకు నచ్చచెప్పి కృష్ణుడు హస్తినాపురమునకు వెళ్లుటకై సిద్ధమయ్యెను. ఆయన సంధియాత్రా సమాచారమును విని ద్రౌపది ఆయన దగ్గరకు వెడలి తన జుట్టును చూపి-"కృష్ణా! నీవు సంధికై వెళ్లుచున్నావు. కాని ఆ దుష్టులు నా జుట్టును పట్టుకుని లాగి నన్ను అవమానించితిరి. ఇది మరువవద్దు" అని పలికెను. కృష్ణుడు ఆమెను ఓదార్చి హస్తినాపురమునకు బయలుదేరెను. ఆయన హస్తినాపురమునకు వెళ్లి మొదట కుంతీదేవిని కలిసికొని ఆమెతో సంభాషించెను. అటు తరువాత ఆయన దుర్యోధనుని రాజసభకు వెళ్లెను. దుర్యోధనుడు ఆయనకు స్వాగతము చెప్పి భోజనమునకై ఆహ్వానించెను. కృష్ణుడు దానికి అంగీకరింపలేదు. కారణమడుగగా ఆయన ఇట్లు చెప్పెను - కార్యసిద్ధి కానంతవరకు దూత శత్రువు ఇంటిలో భోజనము చేయరాదు. నీవు భోజనము ద్వారా నాతో ఆత్మీయతను నెలకొల్పుకొను విషయమును గూర్చి ఆలోచింపవద్దు. నేను లొంగువాడను కాను.

**నాహం కామాన్న సంరంభాన్న ద్వేషాన్నార్థకారణాత్ ।**
**న హేతువాదాల్లోభాద్వా ధర్మం జహ్యాం కథఞ్చన ॥**

రాజా! నేను కామము వలన, క్రోధము వలన, ద్వేషమువలన, స్వార్థము వలన, హేతువాదము వలన, లేదా లోభము వలన ఏ విధముగా కూడా ధర్మమును వదలను.

(1) ఆపద వచ్చినపుడు ధర్మపరీక్ష జరుగును.
(2) ధీరపురుషు డెన్నడును ధర్మమును విడువడు.
(3) కృష్ణ భక్తిలో కూడా ఇట్టి ధృఢత్వముండవలెను.

**సంప్రీతి భోజ్యాన్యన్నాని ఆపద్భోజ్యాని వా పునః ।**
**న చ సంప్రీయసే రాజన్ న చైవాపద్గతా వయమ్ ॥**

ఏ ఇంటిలోనైనా అన్నమును ప్రేమ వలన భుజింపవచ్చును. లేదా ఆపద వచ్చినపుడు (ఆకలివలన చచ్చునపుడు) తినవచ్చును. నరాధిపా! నీవు ప్రేమ చూపుట లేదు, మరియు ఎట్టి ఆపదలోను మేము లేము.

(1) అన్నముతో గూడ సూక్ష్మ సంస్కారము కలిసియున్నది. దానిననుసరించి మన మనస్సు నిర్మించబడును. అందువలన మనము ఆహారశుద్ధిపై దృష్టి నుంచవలెను.
(3) తిరస్కారముతో లభించు మృష్టాన్నము కంటే ప్రేమతో లభించు ఎండురొట్టె అయినను బాగుగనే యుండును.

దుర్యోధనుని ఆహ్వానమును అంగీకరింపక కృష్ణుడు విదురుని ఇంటికి వెళ్లెను. "ధృతరాష్ట్రుని పుత్రులు నీ పట్ల చెడుతలంపులు కలిగియున్నారు. అందువలన నీవు వారి సభకు పోవుట మంచిది కాదని విదురుడు పలికెను. కృష్ణుడిట్లు పలికెను-"ఏ విధమగు భయము వలన కాని ప్రలోభమువలన కాని నేను నా కర్తవ్యమునుండి విచలితుడనుగాను. నేను నాశక్తి కొలది యుద్ధమును నివారించుటకు, పాండవులకు న్యాయోచితమైన అధికారము నిప్పించుటకు ప్రయత్నింతును-

**ఆకేశగ్రహణాన్మిత్రమకార్యాత్ సనివర్తయన్ ।**
**అవాచ్యః కస్యచిద్భవతి కృతయత్నోయథాబలమ్ ॥**

జుట్టు పట్టుకొనియైనా తన మిత్రుని దుష్టకార్యము నుండి మరల్చుటకు యథాశక్తి ప్రయత్నించువాడు ఏ విధమగు నిందకు పాత్రుడుగాడు.

(1) మిత్రుని ప్రతికార్యమును సమర్థించుట మిత్రత్వము కాదు. దుష్ట కార్యముల నుండి వారించుట ఉత్తమ కార్యముల యందు నియమించుట నిజమగు మైత్రియగును.
(2) తన హితైషులను బలవంతముగనైనా చెడుపనులను చేయకుండగ వారించవలెను.
(3) సత్కార్యమువలననే మానవుడు ప్రశంసను పొందును.

విదురునితో నిట్లు పలికి శ్రీకృష్ణభగవానుడు సభకు వెళ్లదలచి ముందుగా అక్కడనే విశ్రాంతి తీసికొనెను.

**త్వం హి బ్రహ్మ పరంజ్యోతిర్గూఢం బ్రహ్మణి వాఙ్మయే ।**
**యం పశ్యన్త్యమలాత్మాన ఆకాశమివ కేవలమ్ ॥**

దేవా! నీవు వేదమంత్రములలో తాత్పర్యరూపమున దాగియున్న పరంజ్యోతి స్వరూపుడవు, పరబ్రహ్మవు, నిర్మల

**సిద్ధాంతాలకు మరోపేరు భగవానుడు.**

హృదయులగు మహాత్ములు ఆకాశము వలె సర్వవ్యాపకమైన నిర్వికారమైన నీ స్వరూపును సాక్షాత్కరింప చేసికొనుచుందురు.

(1) ఈశ్వరుడు సర్వవ్యాపకుడు, ఆయనను కృషిజేసి అన్వేషింపవలెను.

(2) హృదయము ఆయనను కలిసికొనుస్థానము, నిర్మల హృదయులగు మహాత్ములే ఆయనను సాక్షాత్కరింప జేసికొందురు.

శ్రీకృష్ణ భగవానుడు ప్రాతఃకాలమున నిద్ర నుండి లేచెను. నిత్యకర్మలను నెరవేర్చి గాయత్రిని జపించి, సూర్యునకు అర్ఘ్యమునిచ్చి, హోమము మున్నగు ఉపాసనాత్మకమగు కర్మకాండను చేసెను. అప్పుడే దురోధ్యనుడు శకుని విదురుని గృహమునకు వచ్చి కృష్ణునితో "భీష్మద్రోణాదిగురుజనులు, ఇతర రాజులు సభలో నీరాకకై ప్రతీక్షించుచున్నా'' రని పలికిరి.

కృష్ణుడు కౌరవసభకు వెళ్లుటకు సిద్ధమయ్యెను. విదురుడు కూడా ఆయనతో పాటు వెళ్లెను. సభకు జేరికొనగనే అందరు ఆయనకు గొప్పగా స్వాగతమిచ్చిరి. శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రునితో నిట్లు పలికెను-"నీవు పాండవులకు వారి న్యాయోచితమైన అధికారము నొసంగి ఈ భయంకర యుద్ధమును తప్పింపుము. పాండవులు గూడ నీకుమారులే. నీవు పాండవులకు కౌరవులకు సంధి చేసి నశింపకుండగ నీ వంశమును కాపాడుము. వీరు ఇరువురు కలసియున్నచో నీకుటుంబము జగత్తులోనే అజేయమైనదగును.

ధృతరాష్ట్రుడు శ్రద్ధతో కృష్ణుని మాటలను విని ఇట్లు పలికెను. "నేను దుర్యోధనునకు ఎంతయో చెప్పిచూచితిని. కాని వాడు తన మొండిపట్టుదలను వదలుకున్నాడు. గాంధారి, భీష్ముడు, విదురుడు మున్నగు వారు వానికి నచ్చచెప్పుటకు ఎంతగనో ప్రయత్నించిరి. కాని వాడు ఎవ్వరి మాటను వినలేదు.''

ధృతరాష్ట్రుని మాటలు విని శ్రీకృష్ణుడు ప్రేమపూర్వకమైన వాక్కులతో దుర్యోధనునికి నచ్చచెప్పసాగెను. ఆయన ఇట్లు పలికెను-"నీవు సద్గుణ సంపన్నుడవు. నీకు సంపదవిషయమున ఏ లోటు లేదు. ఏల నీవు ఇట్లు అవినీతిగ ప్రవర్తింపదలచుకున్నావు? పాండవులు నీ సోదరులు, నీవు వారికి న్యాయోచితమైన అధికారమునిమ్ము, అత్యాశ పనికి రాదు. అర్థకామములమీదనే దృష్టినుంచక ధర్మపాలన విషయమునందును దృష్టి నుంచుము.

**పృథక్చ వినిష్టానాం ధర్మం ధీరోఽనురుధ్యతే,**
**మధ్యమోఽర్థం కలిం బాలః కామమేవానురుధ్యతే ॥**

వేరువేరుస్థితులు ఉన్న ధర్మార్థకామముల నుండి ఏదో ఒక దానిని ఎన్నికొనుట జరిగినచో ధీరపురుషులు ధర్మమునే అనుసరింతురు. మధ్యమ శ్రేణికి చెందిన వారు కలహమువలన అర్థమునే గ్రహింతురు. అధమశ్రేణికి చెందిన అజ్ఞానులగు పురుషులు కామమునే పొందగోరెదరు.

(1) మానవుడు ఉత్తముడా, మధ్యముడా, అధముడా అని గుర్తించుటకు వాని ప్రవర్తనయే ఆధారము.

(2) అర్థకామములు శరీరంతో నశించును. ధర్మాధర్మములు జీవాత్మతో వెడలును. అందువలన కలుగబోవు హితమును దృష్టిలో ఉంచుకుని ధర్మముగా ప్రవర్తించుట శ్రేయస్కరము.

"అందువలన నీవు గూడ ఉత్తమ పురుషుల వలె ప్రవర్తించుచు ధర్మమార్గమును స్వీకరించుము, దీనిలోనే నీ క్షేమము సమాజ క్షేమము సమాజ క్షేమము ఉన్నది.'' సభలో ఉన్న భీష్ముడు, ద్రోణుడు, విదురుడు, ధృతరాష్ట్రుడు - అందరు కృష్ణుని పలుకులను సమర్థించుచు శ్రీకృష్ణుని ఉపదేశమును అంగీకరింపవలసినదిగా దుర్యోధనుని వత్తిడి చేసిరి. కాని దుర్యోధనుడు ఎవ్వరి మాటను వినలేదు. తన పక్షము న్యాయమైనదిగా నిరూపించుచు 'నాజీవితముండగా నేను సూదిమొన మోపినంత భూమిని గూడా పాండవులకు ఈయజాల'నని అతడు పలికెను. ఇది విని కృష్ణుడు వానిని నిందించెను. దాని వలన దుశ్శాసనుడు రెచ్చగొట్టగా దుర్యోధనుడు సభ నుండి బయటకు వెళ్లిపోయెను.

దుర్యోధనుని పొగరుబోతు మాటలు విని, వాని ప్రవర్తనను చూచి కృష్ణుడు భీష్మాదులతో నిట్లు పలికెను. "మీరు ఆలోచింపకుండగనే దుర్యోధనునికి రాజ్యాధికారము నప్పగించి పెద్దపొరపాటు చేసితిరి. అతడు ఎవ్వరి మాట వినడు. ఇప్పుడితనిని బంధించుటలోనే కురువంశహితమున్నది. ఇతనిని బలవంతముగా అదుపులోనుంచవలెను. అప్పుడే మానవ సంహారము ఆగగలదు. దుష్టులను ఇట్లే అదుపులోనికి తీసికొని రావలెను. కంసుని పట్ల గూడా నేను ఇట్లే కఠినముగ ప్రవర్తింపవలసి వచ్చినది.

**ఉగ్రసేన సుతః కంసః పరిత్యక్తః సబాంధవైః ।**
**జాతీనాం హితకామేన మయా శస్తో మహామృధే ॥**

**అవిశ్వాసం చెడ్డదే. అంధ విశ్వాసం మరింత చెడ్డది.**

బంధువులందరు అతనిని వదిలివేసిరి. అందువలన సజాతీయులైన బంధువులకు మేలు చేయదలచి నేను యుద్ధములో ఉగ్రసేనుని పుత్రుడగు ఆ కంసుని సంహరించితిని.

(1) శరీరమున పుట్టిన విషపూరితమైన వ్రణము ఏ ఉపచారము చేత కూడా నయము కాదు. ఆపరేషన్ ద్వారా తొలగింపవలసి వచ్చును. అట్లే సమాజహితమునకై దుష్టపురుషుని మార్గము నుండి తొలగింపవలెను.

(2) దుర్మార్గమును ఎదుర్కొనుట భగవత్కార్యములో ఒక భాగము.

శ్రీకృష్ణుడు పలికెను. ఈ విషయమున మీరు సాహసమును చూపజాలినిచో ఈ కురువంశమునకు, దేశమునకు మేలగును.

**త్యజేత్కు లార్థే పురుషం గ్రామస్యార్థే కులం త్యజేత్ ।**
**గ్రామం జనపదస్యార్థే ఆత్మార్థే పృథివీం త్యజేత్ ॥**

వంశ క్షేమమునకై ఒక పురుషుని, గ్రామము యొక్క హితమునకై ఒక కులమును, జనపదము(చిన్న పల్లె) యొక్క క్షేమమునకై ఒక గ్రామమును, ఆత్మహితమునకై భూమండలము నంతటినీ వదలవలెను.

(1) పరోపకార భావనను క్రమముగ పెంపొందింపజేయుచు స్వార్థమును, సంకుచితత్వమును వదలవలెను.

(2) వ్యక్తిగతములైన హితాహితములను పరిగణింపక సర్వజనహిత దృష్టితో ఆలోచింపవలెను.

(3) ఆత్మహితమనగా జగత్తు యొక్క హితమని అర్థము.

శ్రీకృష్ణుని సలహాను విని ధృతరాష్ట్రుడు గాంధారిని పిలిపించెను. గాంధారి కూడా దుర్యోధనుని పిలిచి చెప్పెను. కాని వాడు వినలేదు. పైగా తన దుష్టమిత్రుల సలహాననుసరించి కృష్ణుని బంధించుటకు ప్రయత్నించెను. సాత్యకి ఈ రహస్యమును వెల్లడించెను. నీ కుమారుడు తన నాశనమునకై ప్రణాళికను సిద్ధము చేసుకొనుచున్నాడని విదురుడు ధృతరాష్ట్రుని హెచ్చరించెను. భగవానుడు అట్టహాసము చేయుచు (పెద్దగా నవ్వుచు) తన విశ్వరూపమును ప్రదర్శించి ఇట్లు పలికెను - 'నేను ఒంటరివాడనని తలంపవద్దు. నేను ఇప్పుడే కౌరవులందరిని బంధించి పాండవులను రాజుగా చేయగలను. కాని ఇట్లు చేయదలచలేదు' అని పలికి సాత్యకితోను కృతవర్మతోను కృష్ణుడు రాజసభనుండి బయటకు వెళ్లెను.

ధృతరాష్ట్రుడు భీష్ముడు మున్నగు వారు ఆయనను పంపుటకు వచ్చిరి. కృష్ణుడు అందరి దగ్గర సెలవు తీసుకొనెను. కుంతీదేవి విదురుని గృహమున ఉండెను. కృష్ణుడు ఆమెను కలిసికొనెను. ఆమెకు విషయమునంతటిని తెలిపి పాండవులకై సందేశమడిగెను.

కుంతీదేవి న్యాయరక్షణకై బలియైనను మంచిదేయని చెప్పుచు పాండవులకిట్లు సందేశము పంపెను-

**యదర్థం క్షత్రియానూతే తస్య కాలో&య మాగతః ।**
**కాలే హి సమనుప్రాప్తే త్యక్తవ్యమపి జీవితమ్ ॥**
**విక్రమేణార్జితాన్ భోగాన్ వృణీతం జీవితాదపి ।**
**విక్రమాధిగతా హ్యర్థాః ప్రీణన్తి పురుషోత్తమమ్ ॥**

ఏ కార్యమునకై క్షత్రియులు జన్మించిరో వారు అన్యాయమును నివారించుటకు పౌరుషమును చూపుటకు సమయమాసన్నమైనది. ఇట్టి సమయంలోనే జీవితంపై మోహమును వదలవలెను. మానవుడు తన జీవితంలో పురుషార్థముచే ఉత్పన్నమైన భోగములనే స్వీకరింపవలెను. ఉత్తమ పురుషుడు తన పురుషార్థముతో పొందిన ధనమునే ఇష్టపడును.

(1) క్షత్రియ జీవితము అన్యాయమును నివారించుటకై సర్వస్వమును ఒడ్డుట వలననే సార్థకత చెందును.

(2) పురుషార్థముతో కాక వేరు విధముగ సంపాదించినది అనైతికమగును.

కృష్ణుడు బయలుదేరెను. ఆయన కర్ణుని తన రథముపై కూర్చుండబెట్టుకుని వానికి వాని జన్మ వృత్తాంతము చెప్పి నీవు కుంతీ పుత్రుడవు, అందువలన పాండవులకు సోదరుడవు, నీవు పాండవుల పక్షమున జేరినచో యుధిష్ఠిరుని బదులు నీవే రాజువు అగుదువు అని ఇట్లు వివిధములగు మాటల ద్వారా కృష్ణుడు కర్ణుని పాండవ పక్షములోనికి తీసికొని వచ్చుటకు ప్రయత్నించెను. కాని కర్ణుడు ఇట్లు పలికెను - నేను ఆపదలో భయమువలనో లేదా ప్రలోభమువలననో నా మిత్రుడగు దుర్యోధనుని స్నేహమును వదలజాలను.

,, HHH

**ఎవరినైనా పైకి ఎత్తాలంటే నీవు అతనికన్న ఎత్తున నిలబడాలి.**